# మానవుల్లోని చెడు



రచన :
బ్రహ్మర్షి
తటవర్తి వీరరాఘవరావు

# మానవునిలోని చెడు



రచన & ప్రచురణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

మొదటి ముద్రణ : డిశంబరు, 2025
ప్రతులు : 2,000

వెల : రూ.70/-

పుస్తకముల కొరకు :-
**తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94901 71853, 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 11) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 12) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 13) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 14) పంచకోశాలు | - | రూ.60/- |
| 15) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 16) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 17) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |


పుస్తకముల కొరకు :-

**తటవర్తి వీరరాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

# మానవునిలోని చెడు

పత్రి గారు మానవ జన్మలోకి ప్రవేశించిన తరువాత జన్మలేని స్థితికి ఎదగాలంటే సుమారు 400 నుంచి 500 జన్మలు పడుతుంది అని చెప్పారు. ఆయన అలా అన్నప్పుడు అన్ని జన్మలు కావాలా? ఒక జన్మ సరిపోదా అనుకుంటాం. కానీ ఈ ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించి లోతుల్లోకి వెళ్తూ ఉంటే అప్పుడు అర్థమవుతుంది. మనం ఎన్నో సరి చేసుకోవాలి, ఎన్నో మార్చుకోవాలి, ఎన్నో పోగొట్టుకోవాలి, ఎన్నో సంపాదించుకోవాలి. ఇదే ఆఖరి జన్మ అనడానికి తేలికగానే ఉంటుంది, కానీ ఆ స్థితికి రావాలంటే ఎంతో కష్టపడాలి, ఎంతో కృషి చేయాలి, ఎంతో శ్రద్ధ ఉండాలి అని తెలుసుకోవాలి.

అందులో భాగంగా ఆధ్యాత్మిక సందేశాల్ని ఉపమానాల ద్వారా చెప్పుకుంటే చాలా బాగా అర్థం చేసుకోగలుగుతాము. ఒక ఉపమానం తెలుసుకుందాం.

**"పాము కోరలు పీకితే ఎవరికీ హాని చేయలేదు. అలాగే ధ్యానం ద్వారా మనిషిలోని చెడు తొలగిస్తే ఎవరికీ హాని చెయ్యడు".**

పాము కోరలు పీకడం తేలికే, కానీ మనిషిలోని చెడు తొలగించడం అన్నది చాలా కష్టం. పాముకి కోరలు రెండే ఉంటాయి. కానీ మనిషిలో ఎన్ని రకాల చెడులు ఉంటాయంటే ఆశ్చర్యపోతాం. మానవుడు పూర్ణ స్థితికి ఎదగాలంటే తనలో చెడుని పూర్తిగా తొలగించుకోవాలి. ఏదో ఒకటో రెండో తొలగించుకుని నేను చాలా మారిపోయాను అనుకుంటారు. కానీ ఎన్నో మార్చుకోవాలి.కొంచెం శ్రద్ధ ఉంటే తేలికగా అధిగమించగలుగుతారు.

ఈ ధ్యానాన్ని అంటే "శ్వాస మీద ధ్యాస" ధ్యానాన్ని తీవ్రాతి తీవ్రంగా చెయ్యాలి. అలాగే ఆహార నియమాలు కఠినంగా పాటిస్తూ తీవ్ర ధ్యాన సాధన చేస్తే ఒకటి కాదు రెండు కాదు మానవునిలో ఎన్ని రకాలు చెడులు వుంటాయో అన్నీ కూడా తొలగిపోతాయి. ధ్యానం యొక్క ముఖ్య ఉద్దేశం రోగాలు నయం

చేసుకోవడానికి కాదు, కోరికలు తీర్చుకోవడానికీ కాదు, ఏవో అనుభవాలు పొందడానికి కాదు. మొదటగా మీలో ఉన్నటువంటి చెడు తొలగించుకోవడం కోసమే.

మానవునిలో ఎన్ని రకాల చెడులు వున్నాయో తెలుసుకుందాం.

1) చెడు లక్షణాలు ఉన్నాయి.

2) చెడు పనులు చేస్తారు.

3) చెడు తిండ్లు తింటారు.

4) చెడు మాటలు మాట్లాడుతుంటారు.

5) చెడు ఆలోచనలు చేస్తూ ఉంటారు.

6) చెడు అలవాట్లు ఉంటాయి.

7) చెడు వ్యసనాలు ఉంటాయి.

8) చెడు గుణాలు ఉంటాయి.

అలా ఇన్ని రకాలు చెడులు ప్రతి ఒక్కరిలో వుంటాయి. ఇన్ని రకాలు చెడు మీలో ఉంటే దానికి తగ్గట్టు పనులు చేస్తూ ఉంటారు. వాటి పర్యవసానం మీకు కష్టాలు, బాధలు, రోగాలు, సమస్యలు, ఇబ్బందులు, అశాంతి, సుఖం లేకపోవడం ఇలా ఎన్నో రకాలుగా అనుభవిస్తారు. అందుకే ధ్యానం చేసేవారు నాలో ఎంత చెడు తొలగించుకోగలిగాను అని గమనించుకోవాలి.

మరి ఈ జన్మ ఎందుకు తీసుకున్నట్టు? ఇంతకుముందు జన్మలో సాధించలేనివి సాధించడానికి,ఆ జన్మల్లో తొలగించుకోలేనివి తొలగించు కోవడానికి, ఆ జన్మల్లో నేర్చుకోనివి నేర్చుకోవడానికి, ఆ జన్మల్లో పొందని అనుభవాలు పొందడానికి, అలా ఎన్నో సాధించడానికి ఈ జన్మని తీసుకున్నారు.

ఎప్పుడో బుద్ధుడు 2500 సంవత్సరాల క్రితం ఇచ్చినటువంటి ఈ "శ్వాస మీద ధ్యాస" ధ్యానాన్ని మీ అదృష్టం కొద్దీ పత్రీజీ మనకి ఇచ్చారు. మీలో చెడు పోవాలంటే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం తప్ప వేరే మార్గం లేదు. ఈ గైడింగులు, సంకల్పాలు, మ్యూజిక్ లు కూర్చోవడానికి ఉపయోగపడతాయి తప్ప మీలో మార్పులు తీసుకురావు. ఈ సాధన రోజురోజుకీ

తీవ్రాతి తీవ్రం కావాలి, ఎంత తీవ్రంగా చేస్తే మీలో అంత మార్పు వస్తుంది.

నాలో చెడు లేదని అనుకుంటూ పరిపూర్ణులు అయిపోయామని మీకు మీరు సర్టిఫికెట్ ఇచ్చుకుంటే లాభం లేదు.

ఎవరైనా సరే వారిలో చెడు ఉంటేనే ఇతరులకు చెడు చేస్తారు. వారిలో చెడు లేకపోతే ఎవరికీ చెడు చెయ్యరు. చెడు అంటే మీకు కష్టం, నష్టం కలిగించేది. దేనివల్ల అయితే మీరు నష్టపోతుంటారో దాన్నే చెడు అంటారు. చాలామంది అనుకుంటారు నేను అంతా మంచే చేస్తున్నాను, నాలో చెడు ఏమి ఉంది అని.

కానీ పూర్తిగా చెడు లేకపోతే ఎవరూ ఈ భూమి మీదకు రావలసిన అవసరం లేదు. భూమి మీద ఉన్నారంటే మీలో ఎంతో కొంత చెడు ఉందని లెక్క. మీలో చెడు ఉంచుకోవడం తప్పు కానీ, చెడు ఉందని ఒప్పుకోవడం తప్పు కాదు. అందుచేత నాలో ఈ చెడు ఉంది అని తెలుసుకున్నప్పుడు దాన్ని సరి చేసుకోవడానికి ప్రయత్నించాలి.

పత్రి గారు అన్నారు **"తప్పులు చేయనివాడు గొప్పవాడు కాదు, తప్పులు సరి చేసుకున్న వారే గొప్పవారు అన్నారు".** తప్పులు సరి చేసుకున్న వారే ఎదుగుతారు, గొప్ప వాళ్ళుగా తయారవుతారు. అంతేగాని గొప్ప కోసం నాలో చెడులు ఏమీ లేవు అని అనుకోవడం, అనడం మూర్ఖత్వమే అవుతుంది.

అందుచేత ఈ చెడు కర్మలు ఎలా పోతాయో అంటే దగ్ధమవుతాయో తెలుసుకుందాం.

## జ్ఞానంలో కర్మలు ఎలా దగ్ధం అవుతాయి?

జ్ఞానం అనుభవపూర్వకంగా పొందినవారు ఏ తప్పులు, పాపాలు చేయరు. తప్పులు చేయకుండా ఉండడం అన్నది ఆచరణలోకి వస్తుంది. ఇక ఏచెడు, తప్పు చెయ్యరు, చెయ్యమన్నా చేయరు.

అందుచేత వారికి అటువంటి కర్మలు అనుభవించవలసిన అవసరం ఉండదు. అందుకే సృష్టిలో అటువంటి కర్మలన్నీ రద్దు చేయబడతాయి. అంతే కాదు ఎటువంటి కర్మలు అనుభవంలోకి వస్తాయో! ఎలాంటి కర్మలు మరల

చెయ్యరో! అలాంటి కర్మలు మాత్రమే రద్దు చెయ్యబడతాయి.

అలాగే పూర్ణ జ్ఞానం పొంది, పూర్తిగా అన్ని తప్పులు, పాపాలు చేయడం మానేస్తే, వారికి అటువంటి కర్మలు పూర్తిగా రద్దు అవుతాయి. అంటే ఎటువంటి చెడు కర్మలు సరిచేసుకుంటే, అటువంటి కర్మలు రద్దు చేయబడతాయి. అన్ని చెడు కర్మలు బుద్ధి, జ్ఞానం ద్వారా సరిచేసుకుంటే! మొత్తం చెడు కర్మలన్నీ దగ్ధం అవుతాయి.

అందుచేత ముందు చెడులు గురించి వివరించుకుని, ఎలా తొలగించు కోవాలో తెలుసుకుందాం.

## చెడు లక్షణాలు

### ఎప్పుడూ విచారంలో ఉండడం

కొంత మంది ఎప్పుడూ విచారంలో ఉంటారు? వారు చేసిన పని సక్సెస్ అవ్వదు, అనుకున్న దానికి విరుద్ధంగా జరుగుతుంది. అందుచేత అలా విచారంలో ఉంటూనే ఉంటారు. ఏంటి నా బ్రతుకు ఇలా అయిపోయింది? మంచి చేద్దామన్నా నాకు చెడే ఎదురవుతుంది. కుటుంబంలో కానీ, సంసారంలో కానీ, బయట కానీ నన్ను ఎవరూ అర్థం చేసుకోవట్లేదు, నన్ను ఎవరూ పట్టించుకోవట్లేదు అని ఎప్పుడూ విచారంలో ఉంటారు. దుఃఖ పడుతూ ఉంటారు. ఏ సమస్య ఎదురైనా, నష్టం కలిగినా, కష్టం కలిగినా ఎంతో బాధపడుతూ ఉంటారు.

కొంత మంది దుఃఖం లేకపోయినా దుఃఖపడుతూ వుంటారు. తన జీవితం బాగానే ఉంటుంది, కాని తల్లి జీవితంలో కష్టాలు గురించి బాధపడు తుంటారు, ఇంకొకరు కూతురు గురించి బాధపడుతుంటారు, విచారిస్తూ వుంటారు.

భార్యా భర్తలు ఉంటారు, వారి జీవితం బ్రహ్మాండంగా ఉంటుంది. కానీ వాళ్ళ అబ్బాయికి డ్రింకింగ్ అలవాటు వుంటుంది. వాడు మామూలుగా బాగా వుంటాడు, కానీ త్రాగితే మనిషిలా ప్రవర్తించడు, మానమంటే మానడు. వాళ్ళకి ఇది ఒక్కటే సమస్య. వాళ్ళ వరకు చూసుకుంటే ఏమీ బాధపడక్కర్లేదు.

వాడేదో చేసుకున్నాడు, వాడు అనుభవిస్తాడు, నేర్చుకుంటాడు అని అనుకోరు. సొంత కొడుకు కదా? కని పెంచారు కదా? అందుచేత వాళ్లకి అదే బాధ. వాళ్ళ వరకు చూసుకుంటే ఏమీ లేదు కానీ ఆ బాధతో, విచారంతో చేయవలసిన పనులు చెయ్యరు. జీవితాంతం అలా ఆలోచిస్తూ గడిపేస్తుంటారు. ఇలా చాలా కుటుంబాల్లో ఉన్నాయి.

కొంతమంది కూతురు పెళ్లి చేస్తారు, అల్లుడు సరిగ్గా చూసుకోడు వదిలి పెట్టేస్తాడు, లేదంటే ఏదో ఒక రకంగా హింసిస్తాడు. ఆవిడ బాధపడుతూ చెప్తుంటె వీళ్ళు బాధపడుతూ ఉంటారు.

కాని దానికి బాధపడటం ఎందుకు? గతంలో చేసుకుంది ఇప్పుడు అనుభవిస్తుంది. అలాంటి అనుభవాలు పొందడానికి వచ్చింది అనుకుని కావలసిన సాయం చెయ్యాలి. ఇది జ్ఞాని అయినవారికి అర్థమవుతుంది.

అందుకే జ్ఞానం ఉన్నవాళ్లు విచారపడరు, దుఃఖపడరు, దుఃఖంలో కూడా సంతోషంగా ఉంటారు. కాని అజ్ఞాని సంతోషంగా ఉండవలసిన సమయంలో కూడా దుఃఖపడుతూ ఉంటాడు.

ఎందుకంటే జ్ఞానికి కూడా కష్టాలు ఉంటాయి. రమణ మహర్షికి క్యాన్సర్ రాలేదా? రామకృష్ణ పరమహంస కి క్యాన్సర్ రాలేదా? వాళ్ళు అలా ఏడుస్తూ కూర్చోలేదే. వాళ్ళ పనులు మామూలుగానే చేసుకున్నారు. కారణం వారు జ్ఞానం వున్నవారు. అందుచేత మీలో ఏ చెడు ఉన్నా దానికి ముఖ్య కారణం జ్ఞానం లేకపోవడమే. ఏదో ఒక సమస్య నుండి ఏదో ఒక కష్టం నుండి బయటపడటం కాదు, అన్నిటి నుంచి శాశ్వతంగా బయటపడాలంటే జ్ఞానం సంపాదించుకునే ప్రయత్నం చెయ్యాలి. ఎంత జ్ఞానం సంపాదించుకుంటే మీలో దుఃఖం అంత తగ్గిపోతూ ఉంటుంది, చెడు తొలగిపోతూ ఉంటుంది.

**2. భయం: –**

కొంత మంది ప్రతిదానికి భయపడుతూంటారు, అలా భయపడుతూ ఉండటం వల్ల జీవితంలో శాంతిని కోల్పోతూ ఉంటారు.

మానవులు నిత్యం భయంతో జీవిస్తున్నారు, కానీ నిర్భయంగా జీవిస్తేనే నిజమైన జీవితం, అదే శాంతిమయమైన జీవితం. భయంతో జీవించే జీవితం జీవితమే కాదు. ఎందుచేతనంటే భయమే దుఃఖానికి, అశాంతికి కారణం.

భయం ఎంతటి బలవంతుడినైనా బలహీనుడిని చేస్తుంది. కానీ నిర్భయత్వం అన్నది ఎటువంటి బలహీనుడి నైనా బలవంతుడిని చేస్తుంది. శారీరకంగా కండలు పెంచుకుని బలిష్టంగా ఉంటే బలం కాదు. ధైర్యంగా ఉండడమే నిజమైన బలం. గమనిస్తే ఎంతటి బలవంతుడైనా చీకటిలో భయపడతాడు, కొన్ని జంతువుల్ని చూస్తే భయపడతాడు. పైకి కనిపించక పోయినా లోపల భయపడుతూ ఉంటాడు.

చాలా సందర్భాల్లో వాడు ఎంతో బలిష్టి వాడైనా, వాడి భార్య ధైర్యం చెప్పవలసి వస్తుంది. కానీ ధైర్యం ఉన్నవాడు సన్నగా ఉన్నా సరే దేన్ని లెక్కచేయడు, ధైర్యంగా ఉంటాడు, ధైర్యాన్ని ప్రదర్శిస్తాడు. భయం అన్నది చాలా బలహీనమైనది, క్షుద్ర మైనది.

అందుకే శ్రీకృష్ణుల వారు "క్షుద్రం హృదయ దౌర్బల్యం" అన్నారు. నిర్భయత్వం అన్నది ఆత్మవిశ్వాసానికి, గౌరవానికి ప్రతీక. భయానికి దూరమైన వాడు సంతోషంగా జీవిస్తాడు.

సహజంగా మానవులకు చాలా రకాల భయాలు ఉంటాయి. అన్నింటికంటే ప్రతి ఒక్కరికి మరణ భయం ఎక్కువగా ఉంటుంది. ఇంకొంతమందికి తన భవిష్యత్తు ఎలా ఉంటుందో అని భయపడతారు. ఇంకొంతమంది ముసలితనం వస్తే నా జీవితం ఎలా ఉంటుందో, నా పిల్లలు నన్ను సరిగ్గా చూస్తారా చూడరా? చూడకపోతే నా పరిస్థితి ఏమిటి అని భయపడుతూ ఉంటారు.

కొంతమందికి దెయ్యాలంటే భయం. కొంత మందికి ఇంట్లో ఒంటరిగా ఉండాలంటే భయం. కొందరికి వికృతమైన ఆకారం ఉన్నవారిని

చూస్తే భయం. కొందరికి కొన్ని రకాల జంతువులు, పులులు, సింహాలు, మొసళ్ళు, పాములు, తేళ్లు ఇలాంటివి చూస్తే భయం. ఇంకా చాలామందికి దోమలన్నా భయం.

గమనిస్తే ధనవంతులకు దొంగల భయం, ఇన్కమ్ టాక్స్ వారంటే భయం. దొంగలకు, దొరికిపోతామేమోనని భయం. బలవంతులకు ఓటమి భయం. నీతిగా జీవించే వాడికి అపవాదు వస్తుందని భయం. రాజకీయ నాయకులకు ఓటమి భయం, శత్రుభయం. పదవిలో ఉన్నవారికి పదవి పోతుందేమోనని భయం. ఇలా రకరకాల భయాలతో మానవులు జీవిస్తున్నారు.

అలాగే లంచాలు తీసుకునే వారు, తప్పులు చేసేవారికి దొరికిపోతా మేమోనని భయం. కొంతమంది రోగాలకు, అంటు వ్యాధులకు భయపడతారు. వాళ్ల దగ్గరికీ, ఇంటికి వెళ్లరు. వారు దగ్గరికి వచ్చినా భయపడతారు.

ఇంకా పిల్లల్ని రోడ్డు మీద వదలాలన్నా, రైల్వే ఫ్లాట్ ఫారం మీద వదలాలన్నా భయపడతారు. ఇంకొంతమందికి పిల్లలు స్కూల్ కి వెళ్లి వచ్చేవరకు భయం. అంతేకాదు కొంతమంది భర్త ఇంటికి లేటుగా వచ్చినా, ఊరికి వెళ్లి టైంకి రాకపోతే భయపడతారు. అదే భర్త విషయానికి వస్తే భార్యను బయటికి పంపడానికి భయపడతారు.

ఇంకా ఉదయం పాలు రాకపోతే భయం, పని చేసుకోలేనివారికి పనిమనిషి వస్తుందో లేదోనని భయం. ట్రాఫిక్ ఎక్కువగా ఉంటే టైంకి స్టేషన్ కి వెళ్తామో లేదో అని భయం, ఎయిర్ పోర్ట్ కి వెళ్తానో లేదో అని భయం, రిజర్వేషన్ లేకుండా ప్రయాణిస్తే సీటు దొరుకుతుందో లేదో అని, ఇలా చిన్నచిన్న వాటికి కూడా భయపడేవారు ఉన్నారు.

రాజకీయ నాయకులు, పిరమిడ్ మాస్టర్స్ మీటింగ్ పెడుతూ ఉంటారు. జనాలు వస్తారో రారో, సక్సెస్ అవుతుందో లేదో అని భయపడుతూ ఉంటారు. అలా ఎలక్షన్స్ లో నిలబడిన వారు నెగ్గుతానో లేదో అని భయపడుతూ ఉంటారు. ఇలా ఎన్నో రకాలుగా భయపడేవారు ఉన్నారు.

ఇలాంటి వారికి శాంతి ఎలా ఉంటుంది చెప్పండి.

మరి ఈ భయానికి కారణమేమిటి? అంటే మానవునికి ఉన్నటువంటి విపరీతమైన వ్యామోహం, అంటే మమకారం. పిల్లల్ని వదిలిపెడితే పాడైపోతారని ఎంతో భయపడతారు. ఈ మమకారం ఎక్కువైతే వాళ్లకి ఏమన్నా అయితే, అందుచేత ఎంతో భయపడతారు. వాళ్లకి దూరమవుతారేమోనని భయపడతారు.

భయానికి కారణం ఉపనిషత్తులో "ద్వితీయం భయం భవతి" అని చెప్పబడింది. అంటే దైవం తప్ప ఇంకో వస్తువు ఉందని భావిస్తే వెంటనే భయం వస్తుందట.

అలాగే స్వామి వివేకానంద "మానవుడు తన స్వరూపాన్ని మరిచినందువల్లే భయం కలుగుతుంది". అని చెప్పారు. మరి మానవుడు తన స్వరూపాన్ని ఎందుకు మరిచిపోయాడు? అంటే జ్ఞానం లేకపోవడం వల్ల.

ఇంకా పెద్దలేం చెప్తారంటే మానవుని భయానికి ముఖ్య కారణం "అశాశ్వతమైన వాటి మీద వ్యామోహం పెంచుకోవడం." అలాగే భయం తొలగకపోవడానికి ముఖ్య కారణం, "మానవుడు శాశ్వతమైన దానిని ఆశ్రయించక పోవడం".

మానవులు అశాశ్వతమైనటువంటి వాటి మీద వ్యామోహం పెంచుకున్నారు. అంటే ఈ ఆస్తులు, సంసారం మీద విపరీతమైన వ్యామోహం. అందుకే ఎవరికి ఏమవుతుందో అని భయం. ఎందుచేతనంటే కదిలే స్తంభాన్ని పట్టుకున్నవాడు అది ఎప్పుడు పడిపోతుందోనని భయపడతాడు. కానీ కదలని స్తంభాన్ని పట్టుకున్న వాడు నిర్భయంగా ఉంటాడు.

అందుకే మానవుడు అశాశ్వతమైన వాటిని ఆశ్రయించడం వల్ల భయంతో జీవిస్తున్నాడు. కానీ వీటన్నిటిమీద మమకారం వదిలి, శాశ్వతమైన పరమాత్మను అంటే ఆత్మను ఆశ్రయిస్తే భయం తొలగిపోతుంది. ఆ మార్గమే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

ఆత్మను ఆశ్రయిస్తే  ఆత్మజ్ఞానం పొందుతారు.  తాను ఎవరో తెలుస్తుంది, సమస్తమూ తెలుస్తుంది. దేని గురించి ఆందోళన పడడు, భయపడడు. అందుచేత ఎటువంటి భయం పోవాలన్నా, నిర్భయంగా జీవించాలన్నా ''శ్వాస మీద ధ్యాస'' ధ్యానం చేయవలసిందే! జ్ఞానం సంపాదించుకోవాల్సిందే!

**"నేనేమీ చేయలేను, నేనేమీ సాధించలేను అని అనుకోవడం, అలా ప్రతి విషయంలో వ్యతిరేకంగా భావించడం".**

నేనేమీ చేయలేను, నేనేమీ సాధించలేను అని అనుకొంటూ ఏ పనీ మొదలుపెట్టరు. చేయగలనా? లేదా? అని అసలు ప్రయత్నించరు. చివరికి అది మన వల్ల కాదులే మనమేం చేయగలం అని వదిలేస్తారు. అలా ఏ విషయంలోనైనా సరే మన వల్ల కాదు అని అనుకుంటున్నారు అంటే మీరు వ్యతిరేక భావంలో ఉన్నారని లెక్క. అలాంటి వాళ్ళు బ్రతుకంతా కూడా అలాగే ఉండిపోతారు. ఎందుచేతనంటే చేయగలిగి కూడా ప్రయత్నించకుండా చెయ్యలేనేమోనని  భావించడం వల్ల ఏమీ చేయకుండా ఉండిపోతారు, ఏమీ సాధించలేరు.

ఎందుచేతనంటే "యద్భావం తద్భవతి" అని శ్రీకృష్ణుల వారు అన్నారు. పత్రీజీ ఏమన్నారంటే "మన భావమే మన వాస్తవంగా మారుతుంది" అన్నారు.

మీ అల్ప భావం వల్లే అల్పుడిగా ఉండిపోతున్నావు, నీ పిరికి భావమే నిన్ను పిరికివానిగా చేస్తుంది.  నువ్వు గొప్పవాడు అవ్వాలి అనుకుంటే ముందు నీ భావం మార్చుకోవాలి, నేనేం తక్కువ కాదు, నేను చెయ్యగలను, నేను సాధించగలను, నేను ఎదగగలను. వారిలా నేను తయారవుతాను.  నాలో ఏమిటి తక్కువ అని ఉన్నతమైన భావంతో, గొప్ప భావంతో నువ్వు ఉండు, అదే నీ వాస్తవంగా మారుతుంది, నువ్వు గొప్పవాడివి అవుతావు. ఊరికే సందేశాలు వింటే ఎదగరు, మీలో ఉండే లోపాలు సరి చేసుకుంటే ఎదుగుతారు.

పత్రిగారు ఇంకా ఏమన్నారంటే ఒక మనిషికి సాధ్యమైంది ప్రతి

మనిషికీ సాధ్యమవుతుంది అన్నారు. నా విషయానికి వస్తే...పత్రీజీతో పరిచయమైన కొత్తలో సార్ కొంతమందిని సీనియర్ మాస్టర్ అనేవారు . పత్రి గారు వారి చేత స్టేజ్ మీద మాట్లాడిస్తూ ఉండేవారు. నేను అందరిలాగే క్రింద కూర్చునే వాడిని. అప్పుడు నాకనిపించేది వాళ్ళేమిటి సీనియర్, నేనెందుకు కాదు అనుకునే వాడిని ఎప్పుడైతే అలాంటి భావంలో ఉన్నానో వారిలాగే చెప్పడానికి ప్రయత్నించాను. అలా చాలా స్వల్ప కాలంలోనే వారందరిలాగా ఎదగగలిగాను.

నేను పట్టు పట్టాను, పత్రి గారి బుక్స్ చదివాను, ఆయన వీడియోస్ అన్నీ విన్నాను, ఎంతో తెలుసుకున్నాను, అవే చెప్పడం మొదలుపెట్టాను.

భీమవరంలోనే కాదు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా చెప్పడం మొదలు పెట్టాను. అలా నిరంతరం కృషి చేస్తూనే ఉన్నాను.

ఒకసారి పత్రీజీ రాజమండ్రి దగ్గర మారేడుమిల్లి ఫారెస్ట్ లో ట్రక్కింగ్ పెట్టారు. ఆ ట్రెక్కింగ్ కి నేను కూడా వెళ్లాను. ఒక సమయంలో ఆయన రూమ్ లో ఒక్కరే కూర్చున్నారు. ఆయన దగ్గరికి వెళ్లి ఏదో మాట్లాడుతుంటే ఆయన అడిగారు ఎన్నాళ్ళయిందయ్యా నువ్వు ఇందులోకి వచ్చి అని? అప్పుడు 2 సంవత్సరాలు అయింది అన్నాను. అప్పుడు ఆయన అరే రెండు ఏళ్ళలో అందరిని డామినేట్ చేశావయ్యా అన్నారు. ఆయన చేత అలా అనిపించు కున్నాను అంటే ఎంత కృషి చేసి ఉంటాను ఆలోచించండి.

మీకు చిన్న జీవిత రహస్యం చెప్తాను. మీరు ఎందులోనైనా సరే నెంబర్ వన్ గా ఎదగాలంటే? ఏ మార్గంలో నెంబర్ వన్ అవ్వాలన్నా, అన్నీ వదలి దానిమీదే దృష్టి పెట్టండి ఖచ్చితంగా మీరు నెంబర్ వన్ పొజిషన్ కి వస్తారు.

నేను చదివేటప్పుడు చదువు మీద దృష్టి పెట్టేవాడిని. చదువు అయిపోయిన వెంటనే వ్యవసాయంలోకి వచ్చాను. అప్పుడు నాకు ఫ్రెండ్స్, ఆక్టివిటీస్ ఏమీ లేవు. వ్యవసాయం మీదే దృష్టి పెట్టాను. ఎప్పటినుండో 20

ఏళ్ల నుండి  చేస్తున్న వారిని  వ్యవసాయంలో డామినేట్ చేశాను. ఆ టైంలో నేను వ్యవసాయం చేసే టైంలో 15 నుండి 20 బస్తాలు పండేవి 25 బస్తాలు పండితే ఎకరానికి పెద్ద పంటకిందే లెక్క. ఆ టైంలో నేను 30 బస్తాలు పండించాను, మా ఊరిలో అందరూ ఆశ్చర్యపోయారు. మా ఫాదర్, గ్రాండ్ ఫాదర్ కూడా ఆశ్చర్యపోయారు. నేను అందరికీ సలహా ఇచ్చేవాడిని.

తర్వాత రైస్ మిల్ బిజినెస్ చేశాను, దానిలో కూడా టాప్ లెవెల్ కి వచ్చాను. పెద్ద వ్యాపారస్తులలో నేను ఒక వ్యాపారస్తుడిని అయ్యాను. ఇంక దేని మీద దృష్టి పెట్టేవాడిని కాదు. సరదాలు, ఎంజాయ్మెంట్లు లాంటివి ఉండేవి కావు.  ఎందుకో తెలియదు అదే ధోరణిలో ఉండేవాడిని. తరువాత ఒకటి, రెండేళ్లు పాలిటిక్స్ లోకి వెళ్లాను. ఆ రెండేళ్లలోనే వ్యాపారం తగ్గించి పాలిటిక్స్ మీదే దృష్టి పెట్టా, దానిలోను టాప్ లెవెల్ కి రాగలిగాను.

తర్వాత యోగాసనాలు వేయడం మొదలుపెట్టాను, అప్పుడు అన్ని బాగా తగ్గించేసి వాటి మీద ఫోకస్ పెట్టేవాడిని. అంటే అందరూ ఓ గంట ఆ గురువుగారు వచ్చినప్పుడు వేస్తారు. నేను అలా కాదు ఆ పుస్తకాలు తెప్పించుకునే వాడిని, ఆ  గురువుతో సంప్రదించే వాడిని, మధ్యాహ్నం కూడా ఒక్కో ఆసనాన్ని ఎక్కువ సేపు ఉండడానికి ప్రయత్నించే వాడిని. మూడు మాసాల్లోనే మాస్టర్‌లా తయారైపోయాను, నేనే ఆసనాలు ప్రాణాయామం చెప్పడం మొదలుపెట్టాను.

అది అయ్యాక ఈ ధ్యానమార్గంలోకి వచ్చాను ఇక్కడా అంతే! వ్యాపారం మానేసాను, పాలిటిక్స్, సంసారం దూరంగా పెట్టేసాను ఇంక పూర్తిగా ఇదే పట్టుకున్నాను. ఎందుకంటే ఆధ్యాత్మికంగా ఎదగడం అంత సామాన్య విషయం కాదు. చాలా గ్రామాలు తిరిగేవాడిని, నాలుగు సంచులు పత్రి గారి పుస్తకాలు వేసుకుని బయలుదేరేవాడిని.   ఒక వారం రోజులు తిరిగేవాడిని. ఇంటికి వచ్చి ఒకటి, రెండు రోజులు రెస్ట్ తీసుకుని మళ్ళీ సంచులు నింపుకొని వెళ్లేవాడిని. బస్సులోనే వెళ్లేవాడిని, డబ్బు ఉంది కదా అని కారులో వెళ్లేవాడిని కాదు. అప్పటికి ఇంకా ఈ మార్గం వల్ల పొందే లాభాలు ఏంటో  పూర్తిగా నాకు తెలియదు. కానీ నేను ఎదగాలి, నేను గొప్పవాడిని అవ్వాలి, అందరిలా

చెప్పాలి అనే భావం వుండేది. "యద్భావం తద్భవతి" అన్నట్టుగా అనతి కాలంలోనే చాలా ఎదిగాను.

నా లక్ష్యమే నాకు ముఖ్యం, మిగతావి ఏవీ పట్టించుకోలేదు. నేను కష్టపడుతున్నానా, సుఖపడుతున్నానా, యాతన అవుతుందా, వీలవుతుందా లేదా, ఏమి పట్టించు కునేవాడిని కాదు. నేను ఈ మార్గంలో ఎదగాలి, అందరిలా చెప్పాలి అనుకునేవాడిని.

పత్రి గారు ఒక అద్భుతమైన వాక్యం చెప్పారు. ఆయన "మన లక్ష్యం మన జీవితాన్ని మార్చేస్తుంది" అన్నారు. ఆయన చెప్పే ఒక్కొక్క మాటలో ఎంత అర్థం ఉంటుందో అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను.

అప్పుడు నా లక్ష్యం ఏమిటంటే? నేను సీనియర్ మాస్టర్ కావాలి. ఎందుకు వచ్చిందిరా బాబు ఈ తిరగడం, మోయడం అనుకోలేదు. ఎందుకు చెప్తున్నానంటే మీ అందరికీ అవ్వాలని ఉంటుంది. కానీ అలా అయినవాడు ఎంత కృషి చేశాడో మీకు అర్థం కాదు, ఊరికే ఒక సర్టిఫికెట్ ఇచ్చి వదిలేస్తారు, లేదా వాడి పూర్వజన్మ సుకృతం అని వదిలేస్తారు.

మరి ఈ జన్మలో నేను కష్టపడలేదా? కృషి చేయలేదా? ఎన్ని ఇబ్బందులు పడ్డాను నేను. ఇవన్నీ లెక్క చేయలేదే ఎన్నో పరీక్షలు కూడా ఎదురయ్యాయి. నాకు ఇలాంటి ఇబ్బందులు వచ్చినప్పుడు ఒకటే అనుకునే వాడిని ఇది ప్రకృతి పెట్టే పరీక్ష, భగవంతుడు పెట్టిన పరీక్ష. ఇది సక్సెస్ అయితే నాకు ప్రమోషన్ వస్తుంది అని అనుకునేవాడిని. బండగా, మొండిగా ప్రయత్నించాను సాధించాను. ఎవరు సాధించరు ?

**"ఒక మనిషికి సాధ్యమైంది ప్రతి మనిషికీ సాధ్యమవుతుంది" అన్నారు పత్రీజీ.**

అర్జునుని దృష్టి, పక్షి కన్ను మీద ఉన్నట్టు, నా దృష్టి లక్ష్యం మీదే ఉంది. పత్రి గారు చెప్పిన మాట వాస్తవం, సత్యం అన్నది నాకు అర్థమైంది. ఆయన ఇంకా **"మీ భావమే మీ వాస్తవాన్ని మారుస్తుంది"** అన్నారు.

నాది ఉన్నతమైన భావం, అల్ప భావం కాదు, అధిక భావం నన్ను అధికుడ్ని చేసింది. పత్రీజీ ఏమన్నారంటే? **"నేను మీరు ఒకటే, నేను కొంచం ముందు ఉన్నాను, మీరు కొంచెం వెనుక ఉన్నారు",** అంతే తేడా అన్నారు.

అప్పుడు అర్థమైంది నేను ఆయన ఒకటే అన్నమాట, నేను కొంచెం కృషి చేస్తే ఆ స్థాయికి ఎదగొచ్చు అని అనుకునే వాడిని. ఆయన కారణజన్ముడు, అవతార పురుషుడు నా బ్రతుకింతే అని అనుకుంటారు. కానీ ఆయన మాటలు నాకు బాగా వంటపట్టాయి. నా లక్ష్యం, నా ఆశయం, ధ్యానం చేయించడం, జ్ఞానం నేర్పించడం కాదు, అందర్నీ మాస్టర్స్ గా చేయడమే. ప్రతి ఒక్కరూ పర్ఫెక్ట్ మాస్టర్ అవ్వాలి, ఎందుకు అవ్వరు అందరూ అవుతారు. నా దగ్గర ఏముందో మీ దగ్గర అవే ఉన్నాయి. భావాన్ని మార్చుకోండి చాలు. మీ లక్ష్యాన్ని నిర్ణయించుకోండి, మీరు కూడా ఎదుగుతారు.

**"నేను అల్పుడను, ఏమీ లేని వాడిని, నేనేమి ఇవ్వగలను,**
**ఇవ్వలేని వాడిని అని భావించడం."**

ఇలాంటి అల్ప భావం పోవాలి. మీలో అందరూ నా దగ్గర ఏముందండి ఇవ్వడానికి, నేను ఏమైనా కోటీశ్వరుడినా, లేదా లక్షాధికారినా అనేటువంటి భావం మీలో కలుగుతూ ఉండొచ్చు. కానీ మీరు అలాంటి భావంతో ఉంటే మీరు అలాగే తయారైపోతారు. పత్రీజీ అన్నారుగా "యద్భావం తద్భవతి" అని. ఆయన ఇంకా "యా మతిది సాగతిర్భవేత్ " అని చెప్పారు.

అంటే నీ మతి ఎలా ఉంటే నీ గతి అలాగే ఉంటుంది. అందుచేత నువ్వు ఆ భావంతో ఉన్నప్పుడు నువ్వు ఏమీ ఇవ్వలేవు, ఇవ్వవు. నువ్వు ఏమీ లేని వాడిగానే ఉండిపోతావు. కానీ ఈ అల్ప భావం వదిలిపెట్టి నీకు ఉన్నదాంట్లో అది ఏదైనా సరే ఇస్తూ ఉంటే నీ పరిస్థితి మారిపోతుంది.

ఎంతసేపు అందరి దృష్టి ఎలా ఉంటుందంటే ధనం మీదే ఉంటుంది. ధన దృష్టితోనే ఆలోచిస్తుంటారు, కానీ ధనం కంటే ఎన్నో రెట్లు విలువైనవి మనకి ప్రకృతి అంటే భగవంతుడు ఇవ్వడం జరిగింది, వాటిని ఇవ్వొచ్చు.

మీరు అడగవచ్చు ఏముందండి నా బ్రతుకిలా ఉంది అని, కానీ భగవంతుడు అందరికీ సమానంగానే ఇచ్చాడు, ఎవరికీ తక్కువ ఇవ్వలేదు.

మరి ఏమిచ్చాడు అంటే విలువ కట్టలేని సమయం ఇచ్చాడు, వాక్కు ఇచ్చాడు, పనిచేసే శక్తి ఇచ్చాడు, ఆలోచించే శక్తి ఇచ్చాడు, ప్రస్తుతం మీరంతా జ్ఞానాన్ని సంపాదించు కుంటున్నారు, దాన్ని ఇవ్వచ్చు.

నేను అనుకునేవాడిని పత్రి గారు అందర్నీ ఇవ్వమంటాడు, అసలు ఆయన ఏమిస్తున్నాడని అనుకునేవాడిని. కాని ఆలోచిస్తే అర్థమైంది, ఆయన ధనం కంటే ఎంతో విలువైన జ్ఞానాన్ని ఇస్తున్నాడు, ఎందుకంటే జ్ఞానం విలువ కట్టలేనిది. అజ్ఞానంలో ఉన్నవారికి, మూఢత్వంలో, మూర్ఖత్వంలో ఉన్న వారికి జ్ఞానం చెబుతూ వాళ్లలో మార్పు తీసుకొస్తున్నారు. వారిలో ఉన్నటువంటి ఎన్నో చెడు లక్షణాలు, చెడు గుణాలు తొలగిస్తున్నారు, మరి ఆయన ఎంత గొప్పవారు.

ఆయన ఇచ్చే దాని విలువ ఎవరికి తెలుసండి, ప్రకృతికి తెలుసు, నడిపించే ఆ భగవంతునికి తెలుసు. అందుకే చూడండి లక్షల డొనేషన్లు ఇచ్చిన వారు ఎదగలేకపోతున్నారు. కానీ పత్రి గారికి అపారమైన జ్ఞానం వుంది. ఆయన అందరికీ అంత ఆకర్షితుడయ్యాడు. ఇదే ఆయన దగ్గర నేను గ్రహించాను, ఆయన రహస్యం ఇదా అని తెలుసుకున్నాను.

ఆయన సమయాన్ని వృధా చేయడని బాగా గ్రహించాను, అన్నిచోట్ల తిరుగుతూ ఎవరింట్లో వుంటే వారింట్లో కరెక్షన్స్ చేస్తూ, మెసేజ్‌లు ఇస్తూ ఉంటారు. వారి సమస్యల నుండి బయటపడే సలహాలు ఇస్తూ ఉంటారు.

ఆయన సమస్య ఉన్నవారిని ఏదో ఒక సేవ చేయమని చెప్తూ వుంటారు. ఆ కార్యక్రమంలో పాల్గొను, దానికి సాయం చెయ్యి, ఈ బుక్ వేయించు, పాంప్లెట్స్ వేయించు అని చేయిస్తూ ఉంటారు. ఎప్పుడైతే ఆయన చెప్పినట్టు చేస్తూంటారో వారు ఆ సమస్య నుండి బయట పడతారు.

కొంతమందికి అర్థం కాదు ఆయన దగ్గరికి వెళ్తే ఏదో ఒక పని చెప్తారని అనుకుంటారు. కారణం వాళ్ళల్లో ఉన్నటువంటి ఆయన అలా దోషాలు

తొలగిపోవడానికి చెప్తారని నాకు అర్థం అయ్యే నేను ఆచరిస్తున్నాను, అదే అందరికీ చెప్తూ ఉంటాను.  ఊరికే ధ్యానం ఒకటే చేస్తే సరిపోదు, సేవకూడా చెయ్యాలి.

వశిష్టులవారు చెప్పారు కదా? నీ సమస్య  ఒక పొట్టేలు, ఇప్పుడు నువ్వు చేసే సేవ, సాధన ఇంకో పొట్టేలు, ఈ రెండింటిలో బలమైనది గెలుస్తుంది, బలహీనమైంది ఓడిపోతుంది అన్నారు. నీ సమస్య బలమైన పొట్టేలు అయితే చేసిన సేవ బలహీనమైతే నీ సమస్య అలాగే ఉంటుంది. నువ్వేమనుకుంటావు అది ఇచ్చానండి, ఇది చేశానండి, అది చేశానండి అని గొప్పలు చెప్తూ ఉంటావు. నువ్వు ఎంత చేశావో పైన సృష్టిలో లెక్కించబడుతూ ఉంటుంది. అక్కడ నిర్ణయించాలి, నీ అంతట నువ్వు నిర్ణయించడం కాదు.

నేను పత్రి గార్ని అనుసరించే ఎంతోమందిని చూశాను,వారి పెద్ద పెద్ద సమస్యలు కూడా తొలగిపోయాయి.

అందుకే నేను ఎవరికైనా ఈ ఆధ్యాత్మిక సేవలో పాల్గొనండి. జ్ఞానం సంపాదించుకోండి, జ్ఞానాన్ని పంచండి అంటాను. ఎవరు ఏది చేయగలరో అది చేయండి, కాని నువ్వు అల్పమైనది చేస్తే ఎక్కువ ఫలితం ఆశిస్తే ఎలా వస్తుంది? అదే  మీరు క్లాసులు చెప్పించారు కదా, సత్యం తెలుసుకొని సత్యమే చెబితే మీకు ఫలితం పెరుగుతుంది, లాభం ఎక్కువ ఉంటుంది.

అందుకే ధనం లేదని  బాధపడటం కాదు, కానీ నువ్వు కృషి చేస్తే జ్ఞానం వస్తుంది, జ్ఞానాన్ని పంచు, జ్ఞానాన్ని దానం చెయ్యి. ఎంతో గొప్ప వాడవతావు. అందుకే  ప్రతి ఒక్కరూ మార్నింగ్ జూమ్ లో జాయిన్ అవ్వండి శ్రద్ధగా వ్రాసుకోండి.  మళ్లీ మళ్లీ చదువుకోండి, ఆ సందేశ సారాన్ని గ్రహించండి. దాన్ని ఆచరణలో పెట్టే ప్రయత్నం చేయండి, అప్పుడు నేను అల్పుడను అనే భావం పోతుంది, ఏమీ లేని వాడిని అనే భావం పోతుంది.

పత్రి గారి దగ్గర కోట్లు లేవు? ఆయన దగ్గర ఏమున్నాయి?  రమణ మహర్షి దగ్గర ఏముంది? వివేకానంద దగ్గర ఏముందండి? వారు ఎన్ని గొప్పనులు చేశారు.

అలాగే నీకున్న వాటిలో ఎన్నో ఇవ్వవచ్చు. అందుచేత నువ్వు ఎంత ఇచ్చావు అన్నది కాదు, ఉన్నదాంట్లో ఎంత ఇచ్చావు అన్నది ముఖ్యం. నీ దగ్గర విలువ కట్టలేని సమయం, వాక్కు, మేధస్సు ఉంది, పని చేసే శక్తి ఉంది. నేను ఇవ్వలేను అని అల్ప భావం ఎందుకు?

నువ్వు తీవ్ర ధ్యానం చేస్తూ, సాత్విక ఆహారం తీసుకుంటే అప్పుడు సాత్విక గుణంలోకి వస్తావు అప్పుడు  వద్దన్నా ఇస్తావు. అందుచేత మీరు సాత్విక గుణంలోకి వస్తే మీకు ఇవ్వడం అన్నది అలవాటవుతుంది. మీరు గొప్ప వాళ్ళు అవుతారు. మీకు తెలియకుండానే మీలో ఏ లోపం అయితే ఉందని బాధపడతారో ఆ లోపం మీకింక కనిపించదు, ఆ సమస్యల నుంచి, కష్టం నుంచి బయటపడతారు.

ఏమీ చేయకుండా ఏమి ఇవ్వకుండా ఏమి రాదు, ఇస్తేనే వస్తుంది. ఏది ఇస్తే అదే వస్తుంది, ఎంత ఇస్తే అంతే వస్తుంది, ఎలాంటిదిస్తే అలాంటిదే వస్తుంది, ఇవ్వడం నేర్చుకోండి. నేను ఇవ్వలేని వాడిని అన్న అల్ప భావం వదలండి.

**"ఎదుటి వారిలోని లోపాలను చూడటం."**

**"ఎదుటి వారిని చులకనగా చూడటం."**

**"ఎదుటి వారిని తక్కువగా భావించడం."**

ఇది కూడా ఇంచుమించు చాలా మందిలో ఉండే లక్షణమే. సహజంగా ఎవర్ని చూసినా ఎదుటివారి గురించి, వారి లోపాల గురించి మాట్లాడుతారు. అంతేగాని వారిలో ఉండే గొప్ప గురించి, విశిష్టత గురించి, మంచి గురించి మాట్లాడరు.

ఎంతసేపు లోపాలే చూస్తూ ఉంటారు, వారిలో చెడే చూస్తూ ఉంటారు. అలా మీరు ప్రవర్తిస్తూ, మాట్లాడుతున్నారు అంటే గుర్తుపెట్టుకోండి! ఎటువంటి లోపం మీకు ఎదుటివారిలో కనిపిస్తుందో అదే రకమైన లోపం మీలో ఉందని లెక్క.

మీలో ఏ చెడు లేకపోతే ఎవ్వరిలోనూ మీకు చెడు కనిపించదు. వారిని, వీరిని సరి చేయటం కాదు. ముందు నిన్ను నువ్వు సరి చేసుకోవాలి.

మహాభారతంలోని కథ చెప్పుకుంటూ ఉంటాము. శ్రీకృష్ణుడు దుర్యోధనున్ని రాజ్యమంతా తిరిగి మంచి వాళ్ళు ఎవరైనా వుంటే చూసి చెప్పమన్నాడు. దుర్యోధనుడు తిరిగి వచ్చి నాకు రాజ్యంలో ఎవరు మంచి వాళ్ళు కనపడలేదు. కాస్తో కూస్తో మంచితనం ఉంటే నాలోనే ఉంది అన్నాడు.

ధర్మరాజును చూసి రమ్మంటే ధర్మరాజు ఏం చెప్పాడంటే రాజ్యంలో నాకు ఎవరూ చెడ్డవారు కనపడలేదు. ఏమైనా కాస్త చెడు ఉంటే నాలోనే ఉంది అన్నాడు. అంటే దుర్యోధనునికి మంచి వాళ్ళు కనపడలేదు, ధర్మరాజుకి చెడ్డవాళ్ళు కనపడలేదు. అంటే దాని అర్థం దుర్యోధనునిలో ఉన్నది చెడ్డ కాబట్టి అందరూ చెడ్డవాళ్లగానే కనిపించారు. ధర్మరాజులో అంతా మంచి వుంది కాబట్టి అందరూ మంచివాళ్లగానే కనిపించారు.

ఇలా ఉంటే నష్టం ఏంటి అనుకుంటారు? కాని చాలా నష్టం ఉంది. ముఖ్యంగా సంసారంలో ఏ భార్య భర్తల్ని చూసినా వారిలో చెడు ఉండటం వలన ఆ భార్యకి భర్తలో లోపాలు, చెడు కనిపిస్తాయి. అలాగే ఆ భర్తకి భార్యలోని లోపాలే కనిపిస్తూ ఉంటాయి. అప్పుడు ఆ లోపాలను ఎత్తుతూ ఆ భర్తను భార్య విమర్శిస్తుంది, ఆ భార్యను భర్త విమర్శిస్తాడు. అలా విమర్శించడం వల్ల ఇద్దరి మధ్య గొడవలు జరుగుతాయి. అందుచేత ఇద్దరికి సుఖశాంతులు ఉండవు.

భార్య, భర్తలకి మధ్య ఉండే గొడవలకి ఒక ముఖ్య కారణం ఈ చెడు లక్షణమే.

నీలో ఏ చెడు లేకపోతే నీ భర్తలో చెడు నీకు కనిపించదు, ఆయనలో లోపాలు కనిపించవు, ఆయనలో విశిష్టతలే కనిపిస్తాయి, ఆయనలో గొప్పదనమే కనిపిస్తుంది. ఆయన పడే కష్టం, ఆయన పడే శ్రమ, ఆయన చేసే ఉపకారం, ఆయన వల్ల తాను పొందే లాభాలు చూస్తారు.

అదే విధంగా భర్త కూడా భార్య దగ్గర అవే చూస్తాడు. నా కోసం ఎంత కష్టపడుతుందో, ప్రొద్దుటి నుంచి సాయంత్రం దాకా ఇల్లు, పిల్లలు, వంట చూసుకుంటుంది అని అనుకుంటాడు. అదే చెడు ఉంటే ఏదో ఒక వంక పెట్టి ఇల్లు శుభ్రంగా లేదని, అన్నీ బాగా చేసినా కూరలో కొంచెం ఉప్పు ఎక్కువ అయిందని తిడతాడు. ఇంట్లో వుండి ఏం చేస్తున్నావు నువ్వు, కనీసం వంట కూడా సరిగ్గా చేయలేవు, అంటూ ఏదో వంక పెట్టుకుని తిడుతూనే ఉంటాడు. ఆయన తిడితే ఈవిడ ఊరుకుంటుందా, ఈవిడ కూడా తిడుతుంది. అందుచేత ఈ చెడు లక్షణం తొలగించుకోకపోతే సంసారంలో సుఖశాంతులు ఉండవు.

ఇంకా కొంతమందికి ఆ తల్లిదండ్రులు కొన్ని కారణాల వలన కట్నం సరి పెట్టలేకపోతారు. అప్పుడు భర్త భార్యకి నరకం చూపిస్తూంటాడు. ఆ ఇంట్లో అస్తమానం గొడవలే. అసలు ఆలోచిస్తే వాడికి తోడు కావాలా? లేకపోతే 10 లక్షలు కావాలా? ఆ భార్యను వదిలేసి ఈ 10 లక్షలతో హ్యాపీగా ఉండగలడా? ఆ భార్య లేకపోతే ఎంత నరకం అనుభవిస్తాడు ఆలోచించండి.

అదే స్త్రీ దగ్గరికి వచ్చేసరికి భర్త నచ్చుతాడు, కానీ అత్తగారు నచ్చదు. మళ్ళీ ఇదొక విచిత్రం, ఆ అత్తగారు చేసేవన్నీ లోపాల క్రిందే కనిపిస్తాయి. ఇలాంటి అత్తగారు దొరికింది నాకు అనుకుంటారు. ఇలా లోపాలు చూస్తూ ఉంటే ఎవరూ నచ్చరు. మరి ఎందుకు లోపం కనిపిస్తుంది? అంటే తనలో లోపం ఉంది కాబట్టి.

దీని గురించి ఒక కథ చెబుతారు. ఒక కోడలికి అత్తగారు నచ్చదు, జీవితం నరకం అయిపోతుంది. ఆవిడ గురించి ఓ స్నేహితురాలితో చెప్పి చాలా బాధపడింది. నా భర్త వల్ల ఏ ఇబ్బంది లేదుకాని నా అత్తగారి వల్ల అంతా ఇబ్బంది అని. ఏదోరకంగా ఆవిడని వదిలించుకునే మార్గం చెప్పు అని అడిగింది.

అప్పుడు ఆవిడ ఊరు చివర ఒక స్వామీజీ ఉన్నారు . ఆయనను నువ్వు ఒకసారి వెళ్లి కలువు. ఆయన నీకు మంచి సలహా ఇస్తారు, మార్గం

కూడా చెప్తారు  అని అంది. ఎంతో ఆశతో  వెళ్లి ఆయన  కాళ్ళ మీద పడి తన బాధంతా  చెప్పుకుని ఆవిడ  అడ్డు  లేకుండా వుండే మార్గం చెప్పండి లేకపోతే నేను  జీవించలేకపోతున్నాను అంది.

అప్పుడు ఆ గురువు గారు ఏమీ లేదమ్మా నీకు ఒక  మందు ఇస్తాను. ఇది రోజు కొద్ది కొద్దిగా కాఫీలో  కలిపి నీ అత్తగారికి ఇస్తూ ఉండు, 2 నెలలకి ఆవిడ యొక్క అడ్డు లేకుండా ఆవిడ చనిపోతుంది అని చెప్పాడు .

అలా చెప్పి ఇంకొక కండిషన్ పెట్టాడు. నువ్వు ఇవాళ్టి నుంచి నీ అత్త గారితో  ప్రేమగా ఉన్నట్టు నటించు, ఎందుకంటే నువ్వు ఇదివరకటిలాగే ఉంటే నువ్వే చంపేసావు అని అనుకుంటారు. అదే నువ్వు ఇష్టంగా ఉన్నావనుకో నీ మీద ఎవరికి  అనుమానం రాదు అని చెప్పారు .

రెండు నెలలు నటించడమే కదా? అనుకుంది. ఆ రోజు  నుంచి ఈవిడ ప్రవర్తనలో మార్పు  వచ్చింది. ఆవిడ  ఏమన్నా దాని గురించి ఈవిడ పట్టించుకోవడం మానేసింది. రోజు కాఫీలో ఆ మందు కలిపి ఇచ్చేది, ఏదో కోడలు ప్రేమగా ఇస్తుంది కదా అని  చెప్పి ఆవిడ త్రాగుతూ ఉండేది.

ఒక నెల గడిచేసరికి ఈ కోడలు  అంత ఇష్టంగా అత్తగారిని చూస్తూ ఉంటే  అరే నా కోడలేదో రాక్షసి అని అనుకున్నాను ఇంత మంచిదా అని ఆవిడలో మార్పు వచ్చింది.

ఇంకొక  నెల అయ్యేసరికి ఇద్దరికీ ఒకళ్ళు అంటే ఒకళ్ళు ఇష్టంగా మారిపోయారు. అత్తగారు తల్లి కంటే ఎక్కువగా చూసుకుంటున్నారు, కోడలు కూతురు కంటే ఎక్కువగా అత్తగారిని చూసుకుంటుంది. కోడలు ఆశ్చర్య పోయింది మా అత్తగారు ఇంత మంచిదా? రాక్షసి అనుకున్నానే అని.

ఈ లోపు రెండు నెలల మందు అయిపోయింది, కోడలు బెంగ పెట్టుకుంది. ఇంత మంచి అత్తగారినా నేను చంపుకుంటున్నది. ఈవిడ చనిపోకూడదని మరల గబగబా గురువుగారి దగ్గరికి పరిగెత్తుకుంటూ వెళ్ళింది.

గురువుగారు ఏదో అనుకున్నాను, మా అత్తగారు చాలా మంచిది. మీరు చెప్పినట్టు మందు మొత్తం ఇచ్చేశాను. ఇప్పుడు ఆవిడకి ఏమైనా అయితే

నేను బ్రతకలేను. ఆవిడ ఎలాగైనా బ్రతకాలి అని అంది. అప్పుడు గురువుగారు నేను ఏమీ చావడానికి మందు ఇవ్వలేదమ్మా, బలానికి మందు ఇచ్చాను. మీ అత్తగారికి ఏమీ అవ్వదు అన్నారు. అప్పుడు ఆ కోడలు ఎంతో ఆనందంగా ఇంటికి వెళ్ళింది.

ఇక్కడ ఆవిడలో ఉన్న లోపాన్ని ఆవిడే సరి చేసుకుంది. అంతే తప్ప అత్తగారిలో ఏమీ లోపం లేదు అని తెలుసుకుంది. అందుచేత గుర్తు పెట్టుకోండి. ఏమైనా లోపం ఉంది అంటే అది మీలోనే ఉన్నట్టు. అందుచేత "వచ్చిన భార్య నచ్చకపోయినా మీలోని లోపాన్ని సరిచేసుకుని నచ్చేటట్టు చేసుకోండి". అదేవిధంగా "వచ్చిన భర్త నచ్చకపోయినా మీలోని లోపాన్ని సరిచేసుకుని భర్తని నచ్చేటట్టు చేసుకోండి".

దీనికి చేయవలసింది రెండే!

1) మనసుని శుద్ధి చేసుకోవడం, 2) మనసులో ఉన్న చెడును మొత్తం తొలగించుకోవడం. ఇదే పరిష్కారం.

దానికి తీవ్రమైన ధ్యాన సాధన చేయాలి, సాత్వికమైన శాకాహారం తీసుకోవాలి. మనసును శుద్ధి చేసుకోవడం అనేది అంత సులభమైన విషయం ఏమీ కాదు. దానికి కొన్ని నెలలే కష్టపడాలి.

రూమి అనే ఆయన ఒక గొప్ప యోగి, ఆయన ఏమన్నాడంటే? "BE LIKE A TREE, LET THE DEAD LEAVES DROP". దాని అర్థం "నువ్వు చెట్టులా ఉండాలి, పండిపోయిన ఆకులు రాలిపోయినట్లు నీలో చెడు పోవాలి."

చెట్టుకి పండిపోయిన ఆకులు ఉంటే ఏమాత్రం ఉపయోగం లేదు. అందుకే చెట్టు ఏం చేస్తుందంటే వాటిని వదిలేస్తుంది. చెట్టు నుండి పండిపోయిన ఆకులు ఏ విధంగా రాలిపోతాయో నీలో నుండి చెడు ఆ విధంగానే పోవాలి.

పండిపోయిన ఆకులు దేనికీ ఉపయోగపడవు, చెట్టుకి బరువు. ఆ ఆకులు కిరణ జన్య సంయోగ క్రియ ద్వారా పదార్థాన్ని తయారు చేయలేవు. ఆకుపచ్చని ఆకుకి ఆ శక్తి ఉంది, కానీ పండిపోయిన ఆకుకి ఆ శక్తి లేదు.

అందుకే చెట్టు పండిపోయిన ఆకుల్ని వదిలేస్తుంది. అవి క్రిందకు రాలిపోతాయి. అలాగే మనలో ఉన్న చెడును కూడా తొలగి పోయేటట్టు చేయాలి. చెట్టుకి ఎన్ని ఆకులు ఉంటాయో, మానవుడికి అన్ని రకాల చెడులు ఉన్నాయి. వాడిలోని చెడే వాడికి నరకం చూపిస్తుంది.

ఎదుటి వారిని నువ్వు విమర్శిస్తున్నావు అంటే అటువంటి చెడు నీలో ఉంది అనే లెక్క. అందుచేత ఎప్పుడూ ఎవరిని విమర్శించకూడదు. అందుకే పత్రి గారు "నో కామెంట్, నోజడ్జిమెంట్" అంటారు. అటువంటి లక్షణం మీలోంచి తొలగించుకోవాలి.

ఇన్ని రకాల చెడులు పెట్టుకుని ఎక్కడ ఎదుగుతారు. ఆధ్యాత్మికంగా ఎదగాలంటే ఏదో మాంసం ఒక్కటి మానేసి, ఉదయం ఒక గంట ధ్యానంలో కూర్చుంటే ఎదిగిపోయినట్టు కాదు? ఏదో ఒక అనుభవం వస్తే గొప్పవాడివి అయిపోయినట్టు కాదు, అనుభవాలు వస్తే ఎదిగినట్టు కాదు.

నీ నోటి నుంచి విమర్శలు రాకుండా వుంటే అప్పుడు నువ్వు ఎదిగినట్టు.

## దుర్వినియోగం, నిర్వినియోగం

ఇతరులకు నష్టాన్ని, కష్టాన్ని కలిగించే పని దుర్వినియోగం అవుతుంది, తనకు ఏమీ ఉపయోగం లేని పని నిర్వినియోగమవుతుంది. మానవునిలో చెడు ఉన్నవాళ్ళే ఈ రకంగా ప్రవర్తిస్తారు, కష్టాల్ని, నష్టాల్ని తెచ్చుకుంటారు.

చూస్తే 84 లక్షల జీవరాశుల్లో భగవంతుని తెలుసుకోగలిగే అవకాశం ఒక్క మానవుడికే ఇవ్వబడింది. అందుకే మానవునకు ధ్యాన సాధన చేయగలిగే శరీరము, మాట్లాడగలిగే శక్తి, ఆలోచించే శక్తి, ఇవ్వబడ్డాయి.

కాని మానవుడు వాటిని భగవంతుని తెలుసుకోవడానికి ఉపయోగించకుండా వ్యర్థం చేసినా, దుర్వినియోగం చేసినా ఎంతో నష్టపోతాడు.

మానవులకు ధ్యానం చేయగలిగే శరీరం ఇవ్వబడింది. కానీ ఆ శరీరాన్ని జీవులను అంటే కోళ్లను, మేకలను, చేపలను హింసించి, చంపి,

వాటి మాంసాన్ని భక్షిస్తున్నాడు అంటే తనకు ఇవ్వబడిన శరీరాన్ని దుర్వినియోగం చేసుకున్నట్టే.

నిజంగా ఆ శరీరాన్ని ధ్యానం చేయడానికి ఉపయోగించి, జ్ఞానం సంపాదించుకొని, కర్మలు రహితం చేసుకుని, మోక్షాన్ని సంపాదించు కోవచ్చు. కానీ ఆ శరీరంతో హింసచేసి దుర్వినియోగం చేయడం వల్ల, భవిష్యత్తులో రోగాలతో బాధపడడమే కాదు, చనిపోయిన తర్వాత అధో లోకాలకు చేరుకొని ఎంతో నష్టపోవడం జరుగుతుంది. అందుచేత దుర్వినియోగం అన్నది నష్టం కలిగించే చెడ్డ లక్షణం అని తెలుసుకోవాలి.

అలాగే ఆ శరీరాన్ని వ్యర్థమైన మాటలకు ఉపయోగించడం, అంతేకాదు ఎంతసేపు ఆ శరీరాన్ని సుఖపెట్టడం కోసం ఉపయోగించినా, ఉపయోగం లేని పనులు చేసినా, ఆత్మ కోసం కాకుండా దేనికి ఉపయోగించినా వ్యర్థం చేసినట్లే అది కూడా వారికి నష్టం కలిగినట్లే.

అలాగే మానవులకు ఇవ్వబడిన వాక్కు అంటే మాటలు దుర్వినియోగం చేస్తే అంటే ఇతరులను దూషించడం, విమర్శించడం, తిట్టడం, అబద్ధాలు చెప్పడం, కఠినంగా మాట్లాడడం, ఇతరులను బాధించే మాటలు మాట్లాడటం చేసి వాక్కును దుర్వినియోగం చేస్తే భవిష్యత్తులో దాని ఫలితంగా ఎన్నో రకాలైన కష్టాలు అనుభవించి ఎంతో నష్టపోవాల్సి వస్తుంది, బాధకు గురికావాల్సి వస్తుంది.

కానీ ఆ మాటలే ప్రియంగా, నెమ్మదిగా, ప్రేమగా, ఇష్టంగా మాట్లాడి సద్వినియోగం చేస్తే భవిష్యత్తులో ఎంతో లాభం పొందగలుగుతాడు. అలాగే ఆ మాట్లాడే శక్తిని వ్యర్థమైన ఉపయోగము లేని మాటలకు ఉపయోగించిన కాలక్షేపం కబుర్లు కోసం ఉపయోగించినా నిర్వినియోగం చేసినట్టే అదికూడా తనకు నష్టం కలిగినట్టే.

అలాగే తనకు ఇవ్వబడిన ఆలోచనా శక్తిని, మానవుడు ఇతరులపై కక్ష తీర్చుకోవడానికి, నాశనం చేయడానికి, నష్టపరచడానికి ఉపయోగించి దుర్వినియోగం చేస్తే, దాని ఫలితంగా భవిష్యత్తులో దుఃఖానికి లోనై ఎంతో

బాధ అనుభవించవలసి వస్తుంది.

అదే ఆలోచన శక్తిని పదిమంది ఉపయోగపడే పనులు చేయడానికి లాభం కలిగించడానికి, మంచి చేయడానికి ఉపయోగిస్తే అంటే సద్వినియోగం చేస్తే భవిష్యత్తులో లాభం పొందడమే కాదు సుఖశాంతులు కూడా పొంద గలుగుతారు.

అలాగే ఆ ఆలోచన శక్తిని  ఉపయోగం లేని పనులగురించి ఆలోచిస్తే ఆ శక్తి వ్యర్థం చేసుకున్నవాడు అవుతాడు, మరి ఇది నష్టమే కదా?

అలాగే మానవులకు ఇంకా సమయము, చూసే శక్తి, వినే శక్తి, పనిచేసే శక్తి లాంటి ఎన్నో విలువ కట్టలేనివి ఇవ్వబడ్డాయి వాటిని దుర్వినియోగం చేస్తే అంటే లోక విరుద్ధమైన పనులు చేయడానికి ఉపయోగిస్తే భవిష్యత్తులో ఎంతో నష్టపోతారు, కష్టాల పాలవుతారు.

అదే సమయాన్ని భగవంతుని పొందడానికి చేయవలసిన ధ్యాన సాధనకు ఉపయోగించి సద్వినియోగం చేసినా,  చూసే శక్తిని మంచి కార్యక్రమాలు చూడటానికి ఉపయోగించినా, వినే శక్తిని ఆధ్యాత్మిక కార్యక్రమాలు వినడానికి ఉపయోగించి సద్వినియోగం చేస్తే మోక్షాన్ని పొందగలుగుతారు.

## "ఓర్పు, సహనం లేకపోవడం"

ఈ లక్షణాలు కూడా మానవునిలో ఉన్న లోపాలు. ఈ ధ్యానంలో ముఖ్యంగా ఓర్పు, సహనం చాలా అవసరం. ఎందుకంటే ఈ రెండు లేనివారు ధ్యానంలో అసలు కూర్చోలేరు.

సాధనలో ఓర్చుకుంటూ కూర్చోవాలి, సహనం చూపించాలి. మధ్యలో లేచిపోకూడదు, కళ్ళు తెరవకూడదు. సహనం ఉంటేనే సాధనలో పురోగతి, ప్రగతి వస్తుంది. అటువంటి వారే శక్తి సంపాదించుకుంటారు, ఆ శక్తి వల్లే జీవితంలో ఎన్నో లాభాలు పొందగలుగుతారు, అనుకున్నది సాధిస్తారు.

ఆ శక్తి రావాలి అంటే కళ్ళు మూసుకుంటే రాదు,  ఆలోచనలు లేని స్థితిలో కూర్చోవాలి. శక్తి యొక్క గొప్పతనం మీరు తెలుసుకుంటే దానిని సంపాదించడానికి కష్టపడతారు, ఓర్పు, సహనం చూపిస్తారు.

పత్రి గారు అంత శక్తివంతుడు కాబట్టే ఆయన బోధలు ఇన్ని వేల మంది అనుసరిస్తున్నారు. అందుచేత అటువంటి శక్తి సంపాదించుకోవాలి, అలా ఎదగాలి అంటే సహనం, ఓర్పు చాలా ముఖ్యం. అందుకే పత్రి గారు "సహనమే ప్రగతి" అని జ్ఞాన నవరత్నాలులో చెప్పడం జరిగింది.

అందుకే షిరిడి బాబా సాధకులకి శ్రద్ధ, సబూరి అవసరం అని చెప్పారు. అంటే సాధనలో శ్రద్ధ ఉండాలి, సాధనలో కూర్చున్నప్పుడు వచ్చే నొప్పులు ఓర్చుకోవాలి, సహిస్తూ కూర్చోవాలి. అప్పుడే ఎంతో శక్తి వస్తుంది, లాభాలు అనుభవాలు వస్తాయి. అందుచేత ఓర్పు, సహనం అన్న గొప్ప లక్షణాలు సాధకుడికి చాలా చాలా అవసరం.

ఈ ఆధ్యాత్మిక మార్గంలో గురువులు ఏమంటారంటే? జీవితంలో ఏ కష్టం వచ్చినా శాశ్వతంగా ఉండదు, కారణం ఇంతకుముందు ఏవో కర్మలు చేశారు.ఆ కర్మ ఫలితంగా కష్టం వస్తుంది. కాని ఆ కర్మ కొన్నాళ్ళు ఉంటుంది, తర్వాత దానంతట అదే పోతుంది. అందుచేత బాధపడడం కాదు, కాస్త సహనం చూపించాలి, కంగారు పడకూడదు, ఓర్చుకోవాలి. అప్పుడు కొన్నాళ్ళు పోయేసరికి ఆటోమేటిక్ గా ఆ కష్టం నుంచి బయటపడతావు అని గురువులు చెపుతారు.

ఈ ఓర్పు, సహనం గురించి కొన్ని ఉదాహరణలు చూద్దాం.

– ఏసుక్రీస్తుకి శిలువ వేసినా సహనం, ఓర్పుని కోల్పోలేదు.

– మహమ్మద్ ని ఊరూరా వెళ్ళగొట్టినా సహనం కోల్పోలేదు.

– రామకృష్ణ పరమహంసని ఆయన చుట్టూ ఉన్నవారు ఎన్నిరకాల బాధలకు గురిచేసినా ఆయన ఏమి పట్టించుకోలేదు.

– రమణ మహర్షిని బాల్యంలో రాళ్లతో కొట్టినా లెక్క చేయలేదట.

అటువంటి ఓర్పు, సహనం కలిగిన వారు చివరికి బ్రహ్మంగా నిలబడతారు. అలాంటి ఓర్పు సహనాన్ని శంకరాచార్యులవారు 'తితిక్ష' అని చెప్పారు.

అందుచేత సాధకులకి సహనం ముఖ్యం, సహనం లేనిదే సాధనలో నిలబడలేరు. ఈ సహనశక్తి ధ్యానం వల్లే వస్తుంది. 'సాధన చేయాలి అంటే సహనం ఉండాలి, సహనం ఉండాలంటే శక్తి కావాలి'.

అందుచేత ఓర్పు, సహనం కలిగిన వారు సమస్త దుఃఖాల నుంచి బయట పడతారు, జన్మలేని స్థితికి ఎదుగుతారు.

## వర్తమానంలో జీవించలేకపోవడం

ఇది కూడా మానవునిలో ఉన్నటువంటి ఒక చెడు. ఎందుచేతనంటే మీరు వర్తమానంలో జీవించలేకపోతే ఎన్నో రకాల నష్టాలు పొందవలసి ఉంటుంది. మానవునిలో చూడడానికి "దేహం" గొప్పదిగా కనిపిస్తుంది కానీ "మనసుదే" ప్రధాన పాత్ర. కారణం దేహాన్ని నడిపించేది మనస్సే! మనస్సు చెప్పినట్టే దేహం పని చేస్తుంది. దేహమే కాదు..... దేహంలోని భాగాలైన

1. జ్ఞానేంద్రియాలు, 2. కర్మేంద్రియాలు మనస్సు చెప్పినట్టే పనిచేస్తాయి. అందుచేత ఎవరైతే మనస్సును అదుపు చేసుకుంటారో ఇవన్నీ వారి అదుపులో ఉంటాయి. ఒకరకంగా చెప్పాలి అంటే మానవుని యొక్క జీవితం ఈ మనసు బట్టే ఆధారపడి వుంటుంది.

మనసు అదుపులో ఉంటే వర్తమానంలో జీవిస్తారు, శాంతిగా వుంటారు, దుఃఖం ఉండదు. అశాంతి వల్ల "శక్తిని" కోల్పోతూ ఉంటారు. మనసు ఎంత ఆలోచిస్తూ ఉంటే శక్తి అంతగా ఖర్చు అవుతూ ఉంటుంది.

వర్తమానంలో ఉన్నవాడికి మనసు బానిస, లేకపోతే మనసుకి వీడు బానిస. అంటే మనసును అదుపు చేసుకున్నవాడు. అలా మనసును జయించినవాడు ప్రపంచాన్ని జయించిన వాడి కంటే కూడా గొప్పవాడు అంటారు.

మనసు వర్తమానంలో ఉండడం అంటే చంచలస్థితి నుంచి నిశ్చలస్థితికి చేరుకోవడం. ఎప్పుడైతే మనసు నిశ్చలమైందో మీ అదుపులోకి వచ్చినట్టే. ఎప్పుడైతే మనసు నీ అదుపులో ఉందో మనసుకి సంబంధించిన గుణాలు, అలవాట్లన్నీ నీ అదుపులో ఉన్నట్లే! ఇంకా ఒక రకంగా చెప్పాలి

అంటే మనసుని అదుపు చేసుకోగలిగిన వారు "అరిషడ్వర్గాలు" అన్నింటిని అదుపు చేసుకున్నట్లే.

అరిషడ్వర్గాలంటే "కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు". మనసుని మీరు వర్తమానంలో ఉంచుకోగలిగితే మనసును మీ అదుపులో ఉంచుకున్నట్టు. మనసు అదుపులో ఉండడం వల్ల మాట కూడా మీ అదుపులో ఉంటుంది. మాట అదుపులో ఉన్నవాడు "ఆచి తూచి" మాట్లాడతాడు.

మనసు అదుపులో ఉంటే తినే తిండి మీద కూడా అదుపు ఉంటుంది. మనసు అదుపులో లేకే తినకూడని "మాంసాహారం, కోడిగుడ్లు" తింటున్నారు.

మనసు అదుపులో ఉంటే మీరు చేసే కర్మలు, పనుల మీద కూడా అదుపు ఉంటుంది. నీ మనసు మీద అదుపు లేకపోతే మీరు ఎన్నో అనుకుంటారు, ఎన్నో చేయాలని అనుకుంటారు. కానీ వేటిని "ఆచరించలేరు". మనసు అదుపులో ఉంటే మీరు అన్నవి ఆచరించగలుగుతారు, అనుకున్నవి కూడా సాధించగలుగుతారు, మాట నిలబెట్టుకుంటారు.

వర్తమానంలో ఏ పని చేసినా ఏకాగ్రతగా చేస్తారు. అప్పుడు మీరు ఏ రంగంలో ఉన్నా మీరు చేసే పని చాలా నైపుణ్యంగా ఉంటుంది.సక్సెస్ అవుతుంది.

మీ జీవితంలో ఎన్నో దుఃఖకరమైన సంఘటనలు జరుగుతాయి. వర్తమానంలో జీవించ లేకపోతే ఈ దుఃఖకరమైన భారం అంతా "మనసు" మీద పడి, మీరు "డిప్రెషన్" లోకి కూడా వెళ్లే అవకాశం ఉంది. అలాంటి వాళ్లు నావల్ల కాదు, ఇంకా జీవించలేను అని కృంగిపోతూ ఉంటారు. ఎందుచేత నంటే దుఃఖాన్ని తట్టుకునే శక్తి వారికి ఉండదు. కానీ వర్తమానంలో జీవించగలిగే వారు గతంలోకి వెళ్ళరు. ఒకవేళ దుఃఖం ఉన్న తట్టుకోగలుగుతారు. ఈ స్థితి రావాలి అంటే "శ్వాస మీద ధ్యాస" ఉంచి తీవ్ర ధ్యాన సాధన చేయాలి.

జిడ్డు కృష్ణమూర్తి గారు ఎప్పుడూ వర్తమానంలో జీవించేవారు "ఎన్‌లైటెన్‌మెంట్" పొందినవారు అన్నారు.

మీరు కూడా వర్తమానంలో జీవించగలిగితే మీరు కూడా

ఎన్‌లైటెన్‌మెంట్ కి దగ్గర అవుతున్నట్టే లెక్క. అందుచేత వర్తమానంలో జీవించలేకపోవడం మానవునిలో ఉన్న "చెడు" అని చెప్పుకోవచ్చు.

## "తన మీద తనకు నమ్మకం లేకపోవడం"

ఇది కూడా ఒక చెడు లక్షణం. "ఎంతసేపు దేవుళ్ళను, గురువులను, ఇతరులను ఉద్ధరించమనటం, అన్నిటికీ ఇతరుల మీద ఆధారపడటం" అన్నది కూడా చెడే.

మానవుడు తనమీద తనకి "నమ్మకం" లేకపోవటం వల్ల నేను చేయలేనేమో! నేను సాధించలేనేమో! నావల్ల అవుతుందా? అని తనని తాను బాగా తగ్గించుకుంటూ ఉంటారు. అలా అనుకుంటే ఏదీ చేయలేరు, ఏది సాధించలేరు.

భగవద్గీతలో "యద్భావం తద్భవతి" అని శ్రీకృష్ణుల వారు స్పష్టంగా చెప్పడం జరిగింది. అంటే నువ్వు చెయ్యలేననే భావంతో ఉంటే నువ్వు ఏ పని చెయ్యలేవు, సాధించలేవు.

అందుచేత ఏమి చేయలేనేమో అన్న భావంలో ఉంటే... తన మీద తనకే నమ్మకం లేక ఏమీ చెయ్యలేరు. ఇప్పుడు మన "జూమ్" లోనే చాలామంది ఉన్నారు, కొంతమంది 'చాలా పనులు' చేస్తున్నారు, కొంతమంది 'ఏమీ చేయలేక పోతున్నారు'.

కానీ ఎవరైనా తలుచుకుంటే! ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చు. ఆ శక్తి ప్రతి ఒక్కరికి ఉంది. "ఎవరూ తక్కువ కాదు". ఇది తెలుసుకోలేక ఈ విషయం మర్చిపోయి ఏమీ చేయలేనేమో.....అని అనుకుంటారు.

పత్రి గారు "ఒక మనిషికి సాధ్యమైంది ప్రతి మనిషికి సాధ్య మవుతుంది" అన్నారు. ఎందుకంటే అంతా 'ఆత్మ' స్వరూపలే. అంతా 'దైవ' స్వరూపులే.

'ఎస్ జానకి' పాటలు పాడేవారు. దాదాపు 48 వేల పైగా పాటలు చక్కగా మధురంగా పాడారు..... ఆమెకు సాధ్యమైంది! మనకెందుకు సాధ్యం కాదు? అంటారు పత్రిగారు. "ఓషో రజనీస్" ఎన్ని వేల ఉపన్యాసాలు ఇచ్చాడో!

ఎంత జ్ఞానాన్ని అందించాడో లెక్కేలేదు. ఆయనకు సాధ్యమైంది ఇంకో మనిషికి ఎందుకు సాధ్యం కాదు? ఎందుకంటే తన శక్తి తనకు తెలియదు అంతే. తన శక్తిని తెలుసుకోవడమే "ఆధ్యాత్మికత". అలా 'శక్తి'ని అభివృద్ధి చేసుకోవడం కోసమే ఇప్పుడు మనం చేసే 'ధ్యానం'.

పత్రి గారు ఏమంటారంటే? "మన ఆలోచనలో లేనిది, మన భావాలలో లేనిది, మన దృక్పథాలలో లేనిది, ఏది కూడా భవిష్యత్తులో రూపుదిద్దుకోబడదు" అని చెప్తూ వుంటారు. అందుచేత ఏదైనా సాధించవచ్చు, ఎవరు తక్కువ కాదు. అందుకే తన మీద తనకి నమ్మకం లేకపోవడం అనేది మీలో ఉన్న చెడు లక్షణమే.

ఎంతసేపు ఆ దేవుడిని ఉద్ధరించమని అడగటం, అందరి కాళ్ళ మీద పడటం ఇవన్నీ కూడా .. నీ మీద నీకు నమ్మకం లేకపోవడమే. నువ్వు ఎంత కాలం ఇతరుల మీద ఆధారపడుతూ ఉంటావో! అంతకాలం తక్కువగా ఉండిపోతావు. అందుచేత "భగవద్గీత"లో కూడా ఎవరిని వారే ఉద్ధరించు కోవాలి.....అని స్పష్టంగా చెప్పడం జరిగింది.

నిన్ను నువ్వు తక్కువగా భావిస్తున్నావు? అసలు నువ్వు ఆత్మవి! అంటే ఈ సృష్టికే మూలమైన ఆ "పరబ్రహ్మవి". మిమ్మల్ని మీరు తగ్గించుకోవద్దు! నీ మీద నీకు నమ్మకం లేకపోవడం అన్నది కూడా ఒక "చెడు లక్షణం".

గుర్తుపెట్టుకోండి! "బుద్ధుడు"కూడా "అప్పో దీపో భవ" అన్నారు. అంటే "నీ దీపాన్ని నువ్వే వెలిగించుకోవాలి".

అంటే దీనిని బట్టి మనకి మనమే ఉన్నతంగా ఎదగాలి. ఎవరు ఏమి చేయలేరు, దారి చూపిస్తారు...అంతే! దారి వెంట వెళ్లవలసింది నువ్వే, ప్రయత్నించవలసింది నువ్వే.

## "లోభం"

లోభం అన్నా, పిసినారితనం అన్నా, ఎవరికి ఏమి ఇవ్వలేకపోవడం, ఇవ్వాలని అనిపించకపోవడం. ఈ లోభం అన్నది తమోగుణం, రజోగుణం ఉన్న వారిలో ఉంటుంది.

పత్రిగారు "సృష్టిలో పంచితేనే పెంచబడుతుంది. దాచుకుంటే దోచుకోబడుతుంది" అని చెప్పారు.

పత్రిగారు చెప్పిన ఈ సందేశం నన్ను చాలా ప్రభావితం చేసింది, నాలో మార్పు తీసుకు వచ్చింది. ఎందుచేతంటే మానవులు ఏమీ ఇవ్వలేని పరిస్థితిలో ఎవరూ ఉండరు. ఇవ్వడము అంటే ధనం అనుకుంటారు, మా దగ్గర ఏముందండీ ఇవ్వడానికి అంటారు.

కానీ మానవులకు "ధనం కంటే విలువైనవి" ఎన్నో ఉన్నాయి. వాటిని కూడా ఇవ్వవచ్చు. అవే "సమయం, శక్తి, వాక్కు, ఆయుష్షు" లాంటివి.

మీ దగ్గర ఈ లోభం అనే గుణం లేకపోతే ఏదైనా ఇస్తారు, ఎంతైనా ఇస్తారు. ఈ చెడ్డ లక్షణం వల్ల ఇవ్వగలిగినా ఇవ్వలేకపోతున్నారు. కానీ జీవితంలో "ఇవ్వగలగడమే చాలా గొప్పతనం" ఎవరి జీవితం బాగుండాలి అన్నా ఇస్తూనే ఉండాలి. పుచ్చుకోవడం గొప్పకాదు, ఇవ్వడమే గొప్ప.

నీకు నువ్వు అనుభవించడం, వినోదించడం, తినటం గొప్ప కాదు. ఉన్న దాంట్లో ఎంతో కొంత ఇవ్వగలిగితే అది చాలా గొప్ప విషయం. కాని నువ్వు ఇవ్వలేకపోతున్నావు! ఇవ్వాలని అనిపించట్లేదు! అంటే నీలో లోభం, పిసినారితనం అనే చెడు ఉన్నట్లే లెక్క!.

పుణ్యకార్యాలు, దానాలు, దేహ సేవలు గొప్పవి అనుకుంటారు. కానీ ఈ దేహసేవల కంటే "ఆత్మ సేవలు చాలా గొప్పవి."

దేహసేవలు భోగాన్ని కలిగిస్తాయి. కాని ఆత్మసేవలు "ముక్తినే" కలిగిస్తాయి. మేము పత్రిగారి పరిచయమైన తరువాత దేహ సేవలు మానేసి, ఆత్మ సేవలే చేస్తున్నాము. మా శేష జీవితాన్ని ఎంత వీలైతే అంత ఇవ్వడానికే అంకితం చేశాము.

ధనం, జ్ఞానం, సమయం, వాక్కు, శక్తి, ఈ సేవలకే అంకితం చేశాము. మాకు భోగాల మీద దృష్టి లేదు. భోగిస్తే వచ్చేదేమీ లేదు, సేవ చేస్తే ఎంతో లాభం కలుగుతుంది అని మాకు తెలుసు. అందుచేత ఈ రహస్యం తెలుసు కోండి. మీలో ఉన్న లోభం అనే చెడులక్షణం తొలగించూకోండి.

ఇంకో విషయం కూడా మీరు తెలుసుకోవాలి... ఆశించి ఇచ్చేది కూడా ఒక రకంగా 'లోభం' క్రిందికే వస్తుంది. ఆశించకుండా ఇచ్చేదే అసలైన దానం, వాడు లోభం లేనివాడు.

అందుకే "శ్రీ కృష్ణ భగవానుడు" భగవద్గీతలో "నిష్కామంగా" చేయమంటారు. నువ్వు ఏం చేసినా, ఏ సేవ చేసినా, ఏమిచ్చినా "గుప్తంగా" చేయమని అంటారు. ఆశించి ఇస్తే అది కూడా కొంత లోభం కిందికే వస్తుంది.

**శ్లో॥ యుక్తః కర్మఫలం త్యక్త్వా శాన్తిమాప్నోతి నైష్ఠికీమ్।**
**అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే (భ.గీ. 5-12)**

తా: యోగ యుక్తుడు నిష్కామకర్మయోగి కర్మ ఫలాన్ని విడిచి పెట్టడం వలన ఆత్మనిష్ఠా సంబంధమైన శాశ్వతమైన శాంతిని పొందుతున్నాడు.

యోగ యుక్తుడు కానివాడు అంటే ఫలితం ఆశించి కర్మలు చేసేవాడు, ఆశచే ప్రేరితుడై కర్మఫలమందు ఆసక్తి కలిగి బద్ధుడు అవుతున్నాడు. అంటే బంధంలో చిక్కుకుంటున్నాడు.

కర్మ ఫలం వదిలినవాడికి, కర్మ ఫలం మీద ఆసక్తి ఉన్న వాడికి ఎంత తేడా ఉందో చూడండి! కర్మ ఫలం వదిలినవాడు శాశ్వతమైన శాంతి అంటే మోక్షాన్ని పొందుతున్నాడు.

నువ్వు కోరవలసిన పనిలేదు. ఒకవేళ నువ్వు కోరినా "కోరింది రాదు." కారణం నువ్వు చేసింది కొద్దిగా వుంటుంది, కాని నువ్వు ఆశించేది ఎక్కువ. ఎలా వస్తుంది? నీకు ఎంత రావాలో అంతే వస్తుంది!

అందుచేత ఆశించకుండా నీకు ఉన్నదాంట్లో ఇవ్వగలిగినంత ఇయ్యి. అప్పుడు నువ్వు లోభాన్ని జయించిన వాడివి అవుతావు. దానికి బుద్ధి వికసింప చేసుకో! బుద్ధి వికసించాలంటే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేయాలి. సాత్విక మైన శాకాహారం తీసుకోవాలి.

## "సోమరితనం, బద్ధకం, అతినిద్ర"

ఇవి కూడా మానవులకు చెడు కలిగించేవే, నష్టాన్ని కలిగించేవే. మానవుడు మాధవుడిగా మారాలి అంటే ముందు తనలో ఉన్న ఏ రకమైన చెడువున్నా తొలగించుకునే ప్రయత్నం చేయాలి. బుద్ధుడు అంత గొప్పవాడు అవ్వడానికి కారణం మొదట ఆయన తనలో ఉన్న చెడుని తొలగించుకున్నాడు కాబట్టే.

మనలో చెడులు తొలగించుకోవాలి అంటే రెండే పనులు –

1. తీవ్రమైన ధ్యాన సాధన,

2. శుద్ధ సాత్వికాహారం తీసుకోవాలి. ఆహార నియమాలు చాలా కఠినంగా పాటించాలి.

సోమరితనం అంటే ఏ పని చేయకుండా ఊరికే తిరుగుతూ ఉండడం. ఉద్యోగం చేయదు, సంపాదించదు, ఊరికే తిరుగుతూ ఉంటాడు. పెద్దవాళ్ళు ఏంట్రా సోమరిపోతులా తిరుగుతున్నావు అని తిడతారు. అలా కొంతమంది పిల్లలు స్కూల్ కు వెళ్ళకుండా బయట తిరుగుతూ వుంటారు.

ప్రతి ఒక్కరు ఏదో ఒక పని చెయ్యాలి. పురుషుడు చేసే పని పురుషుడు చేయాలి, అలాగే స్త్రీ చేసే పని స్త్రీ చేయాలి, పిల్లలు చేసే పని పిల్లలు చేయాలి. ఏమీ చేయకుండా సోమరిపోతులాగ ఉంటే అది జీవితానికి ఎంతో నష్టాన్ని కలిగిస్తుంది.

## బద్ధకం

అలాగే బద్ధకం అంటే చేయగలిగి కూడా చేయకపోవడం, లేవగలిగి లేవకపోవడం, రేపు చేద్దాం అంటూ పనులు వాయిదా వేయడమే బద్ధకం. ఒకరకంగా బద్ధకమే మానవునికి బద్ధ శత్రువు. బద్ధకం శరీరానికి సంబంధించినది. సోమరితనం అన్నది మనసుకు సంబంధించినది. బద్ధకమైనా, సోమరితనమైనా మానవునకు ఎంతో నష్టాన్ని కలిగిస్తుంది.

ఉదయం జూమ్ లో ధ్యానానికి నాలుగు గంటలకు లేవలేక పోతున్నారంటే బద్దకమే. బద్ధకం వల్ల దీక్షగా సాధన చేయలేరు. శక్తి పొందలేరు.

విచిత్రం ఏమిటి అంటే? చాలామంది మార్నింగ్ జూమ్ జాయిన్ అవ్వలేరు.

"సాధనలో పట్టు రావాలి" అంటే భీమవరం రావాలి. "జ్ఞానం వృద్ధి కావాలి" అంటే ఈ జూమ్ లోకి రావాల్సిందే. ఆలస్యంగా పడుకోవడం, ఆలస్యంగా లేవడం కూడా చెడే!

తొందరగా లేవడం వల్ల ఎంతో సమయం కలిసి వస్తుంది. పుస్తకాలు చదవచ్చు, వీడియోలు వినొచ్చు, పుస్తకాలు వ్రాయొచ్చు, సేవా కార్యక్రమాలలో పాల్గొనవచ్చు. మన భవిష్యత్తుకి ఇవన్నీ లాభం కలిగించేవే, మన భవిష్యత్తుని మార్చేవి.

అటువంటి కార్యక్రమాలలో పాల్గొంటే మీకు తెలియకుండానే మీకు వున్న సమస్యలు గాలి వేస్తే మబ్బులు తొలగిపోయినట్టు మీ జీవితంలో కష్టాలు, సమస్యలు మెల్లిగా తొలగిపోతాయి. అందుచేత బద్ధకించి సమయాన్ని వృధా చేసుకుంటే ఇవ్వబడిన అవకాశం కోల్పోతారు, నష్టపోతారు.

## అతి నిద్ర

అతి నిద్ర కూడా మీలో ఉన్న ఒక చెడు లక్షణమే. ఎందుచేతనంటే? ఏ విషయంలోనైనా అతి పనికిరాదు, మితము పనికిరాదు.

అతి అన్నది మీలో ఉన్న ఒక చెడు లక్షణం; నిద్రేకాదు అతి తిండి, అతి వాగుడు అన్నీ అనర్థమే. భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు కూడా ఇదే చెప్పాడు.

**శ్లో॥ యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు।**
**యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహ ॥ (భ.గీ.6-7)**

తా:॥ యుక్తమైన ఆహారము, యుక్తమైన నడత కలవాడు, యుక్తమైన పనులు చేసేవాడు, యుక్తమైన ప్రవర్తన కలవాడు, యుక్తమైన నిద్ర కలవాడు అగు ధ్యాన యోగి దుఃఖం నుంచి బయటపడతాడు. అలా అని చెప్పి అస్సలు లేకుండా ఉండకూడదు. అతి కాని, మితము కాని పనికి రాదు.

అలా నిద్రలో, ఆహారం విషయంలో కూడా అతి పనికిరాదు, అంటే ఎక్కువ తినకూడదు, మరీ తక్కువ తినకూడదు. మీ పనులు అతిగా

ఉండకూడదు అలాగే చేయకుండా ఉండకూడదు.

అతి అన్నది ఏ విషయంలోనూ పనికిరాదు. అందుచేత అతి నిద్ర కూడా చెడు లక్షణమే. వీటికి పరిష్కారం ధ్యానమే అని తెలుసుకోవాలి.

## గర్వం -అహంకారం

"నాది" అనుకుంటే "గర్వం" పెరుగుతుంది. "నేను" అనుకుంటే ఎవరికైనా సరే "అహంకారం" పెరుగుతుంది. ఒక రకంగా చెప్పాలి అంటే ఈ రెండు కూడా ఆధ్యాత్మిక ఎదుగుదలకి ఎంతో అవరోధం.

అందుచేత ఈ చెడును కూడా తొలగించుకునే ప్రయత్నం ప్రతి ఒక్కరూ చేయాలి. మీలో ఇవి ఎంత ఉంటే మీ ఆధ్యాత్మిక ఎదుగుదల అంత తగ్గిపోతూ ఉంటుంది. మీరు ఎంత కృషి చేసినా ఈ రెండు లక్షణాలు ఉంటే ఎంతో నష్టపోతారు. అవి పైకి కనిపించవు కానీ తొలగించుకోవాలి.

## "గర్వం"

ఈ సృష్టిలో "నేను" అన్నదే లేదు, ఇక నాది అన్నది ఎక్కడ ఉంటుంది? కారణం ఉన్నదంతా ఆ సృష్టికర్త, ఆ పరబ్రహ్మాదే కాబట్టి.

ఆత్మలైన మీరు భూమి మీదకు వచ్చినప్పుడు ఏమీ తెచ్చుకోలేదు. అలాగే ఈ భూమిని వదిలి వెళ్ళేటప్పుడు ఏది తీసుకొని వెళ్ళరు.

ఎందుచేతనంటే నాది అనేది ఏదైనా తెచ్చుకుంటే తీసుకొని వెళ్లగలరు, కానీ తెచ్చుకోనిది ఎలా తీసుకొని వెళతారు? అందుచేత వెళ్లేటప్పుడు ఎవరైనా సరే ఖాళీ చేతులతో వెళ్ళవలసిందే!

షిరిడి బాబా ఈశావాశ్య ఉపనిషత్ లోని సందేశం ఒక్కసారి చూద్దాం.

**శ్లో॥ ఈశా వాశ్య మిదంసర్వం యత్కించ జగత్యాం జగత్ ।**
**తేనత్యక్తేన భుంజిథా మాగృధః కశ్య సిధ్ధనం ॥**

తా:– అంతా పరబ్రహ్మ కాబట్టి ఎవరికి ఏది లభించినా, ఉన్నా అది ఈశ్వరునిదే అని... ఈశ్వరుడి నుంచే లభించిందని తెలుసుకోవాలని అన్నారు. అందుచేత ఈశ్వరుడి నుంచి లభించిన ఐశ్వర్యాన్ని అది ఎంత అవ్వనివ్వండి త్యాగపూర్వకంగా అనుభవించాలి. అంటే కొంత లోక కళ్యాణానికి

పంచాలి. ఏ రకమైన లోభాన్ని, మోహాన్ని పెట్టుకోరాదు. ఎవరిది ఆశించ కూడదు, అపహరించ కూడదని షిరిడి బాబా ఈ శ్లోకం ద్వారా వివరించారు.

అలాగే భగవద్గీతలో ఉన్న ఈ శ్లోకం చూస్తే మనకు ఇంకా బాగా అర్థం అవుతుంది.

**శ్లో॥ మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా**
**మత్థాని సర్వ భూతాని న చాహం తేష్వ వస్థితః (భ.గీ.9-4)**

తా:- "నేను నా అవ్యక్త రూపంలో ఈ జగత్ అంతా వ్యాపించి ఉన్నాను. సమస్త ప్రాణకోటి నాయందు ఉన్నవి. నాకవి ఆధారములు కావు అని శ్రీకృష్ణుల వారు చెప్పారు".

అందుచేత ఉన్నది అంతా ఆయనదే అని తెలుసుకోవాలి. అందుచేత మానవుడు తనకు లభించిన దానితో సంతుష్టి చెందాలి. అందుచేత ఈ సృష్టిలో ఎవరికీ ఏది లభించినా అది అందరి కోసం అని అర్థం చేసుకోవాలి. అందరికీ పంచాలి, దాచుకోకూడదు అని బాబా వారు వివరించారు.

ఇంకా కొంచెం బాగా ఆలోచిస్తే. ఈ సృష్టిలోని వారంతా ఒక్కటే, అన్నీ ఒక్కటే. అన్నీ పరబ్రహ్మ స్వరూపాలు అని తెలుస్తుంది. ఆఖరికి జంతువులు, పక్షులు, జలచరాలు కూడా. ఇంకా చెప్పాలి అంటే అసలు నేను అనేదే లేదు.

ఇక్కడ నేను..నేను అంటున్నారు ఆలోచిస్తే 'నేను' అనేదే లేదు. నేను అన్నది లేనప్పుడు నాది అన్నది ఎక్కడ ఉంటుంది. ఎందుచేతనంటే? ఆయన తప్ప ఇంకొకటి లేదు. ఏదైనా ఉన్నట్లుగా కనిపిస్తున్నా అవి కూడా లేనివే. కారణం అన్నీ ఆయనచే సృష్టింపబడినవే, సృష్టింపబడినవన్నీ మాయమయ్యేవే.

ఇది కూడా మీరు మర్చిపోకూడదు. మీ శరీరం కానీ, జీవరాసులు కానీ ఏవైనా సరే సృష్టించబడ్డ ప్రతిదీ మాయమయ్యేవే!

ఈ శరీరం చూసి నేను నేను అనుకుంటున్నావు. అది కూడా

మాయమవుతుంది, ఉండదు. ఉంటే నీవు అనుకునే ఆ నేను చివరకు ఎక్కడ ఉంటుంది.

ఎందుచేతనంటే నేను అని నీవు అనుకుంటున్నావు. ఆలోచించు! ఆ నేను ఎక్కడ ఉంది? అసలు ఉన్నదే ఒక్కడు, ఆయనే "ఆ పరబ్రహ్మ".. ఇంకా చెప్పాలి అంటే నేను అనుకుంటున్న "నువ్వే" ఆ పరబ్రహ్మ. ఈ దేహం నీవు అనుకుంటున్నావు కానీ అది నువ్వు కాదు. "ఆ పరబ్రహ్మే నీవు".

అందుకే వేదాల్లో "అహం బ్రహ్మోస్మి" అని చెప్పబడింది. అంటే నేను అనుకుంటున్న నీవు ఎవరో కాదు ఆ పరబ్రహ్మే. అందుచేత నేను లేదు, నాదీ లేదు, ఇది తెలుసుకోవాలి.

చివరకు నీవు ఈ స్థాయికి రావాలి అంటారు, ఇదే పరాకాష్ట. నేను అంటూ, నాది అంటూ లేనిపోని గొప్పలు చెప్పుకోవడం, తప్పులు, పాపాలు చెయ్యడం, కష్టాలు తెచ్చుకోవడం ఎందుకు చెప్పండి? దేనికి అహంకరిస్తావు? దేనికి గర్విస్తావు? "నీది అనేది ఉంటే గర్వపడు, నువ్వు అనేది ఉంటే అహంకరించు, లేకపోతే నీవు కష్టాలు తెచ్చుకోవడమే అవుతుంది.

అందుకే పెద్దలు ఏమంటారు అంటే నాది అనుకుంటే అంతే నీది, నాది కాదు అనుకుంటే అంతా నీదే అని అన్నారు.

ఈ ఇల్లు నాది అనుకుంటే ఆ ఇల్లు ఒక్కటే నీది. నాది అన్నది ఎక్కడ ఉంది అని నీవు అనుకుంటే? అంతా నీదే, సకల సృష్టి నీదే అని అన్నారు. అందుచేత ఈ సృష్టి రహస్యం అర్థం కావాలి అంటే మీ జ్ఞానం పెంచుకోవాలి.

దానికి "శ్వాస మీద ధ్యాస" ఉంచి తీవ్రమైన ధ్యాన సాధన చెయ్యాలి. జ్ఞానం పెంచుకుంటే అన్నీ మీకే తెలుస్తాయి.

ఈ సృష్టిలో ఇదంతా ప్రత్యక్షంగా చూస్తున్నాం, జ్ఞానం ఉన్న వారికి ఇది అర్థం అవుతుంది. అందుకే జ్ఞానం సంపాదించండి అంటాను.

# అహంకారం

మానవునిలోని ఇంకొక చెడు అహంకారం. ఎవరికైనా సరే ఆధ్యాత్మిక మార్గంలో ఇది చాలా ముఖ్యమైనది. అహంకారం తొలగకపోతే ఆధ్యాత్మికంగా ఎదగలేరు. ఎవరైనా సరే శాశ్వతంగా దుఃఖం నుంచి బయటపడాలి అంటే ఆధ్యాత్మికంగా ఎదగవలసిందే.

ఆధ్యాత్మికంగా నువ్వు ఎదిగితే జ్ఞానాన్ని పొందుతావు. పూర్ణజ్ఞానం పొందే కొద్దీ "ఆత్మను" సాక్షాత్కరించు కుంటావు. ఇవన్నీ సాధించాలి అంటే ముఖ్యంగా "నేను అనే అహం" ఏ మాత్రం ఉండకూడదు.

ఏ సద్గురువు అయినా మొట్ట మొదట అహంకారం తొలగించడానికి ప్రయత్నం చేస్తాడు. కారణం అహంకారం ఉంటే జ్ఞానం బోధించినా బోధపడదు, అర్థం చేసుకోలేరు, బోధించింది వ్యర్థమవుతుంది. ఎందుచేతనంటే? "ఖాళీ కుండలో నీరు నింపవచ్చు కానీ నిండు కుండలో ఎవరూ నీరు నింపలేరు." అలాగే అహంతో నిండిన వారికి జ్ఞానం ఎంత బోధించినా భోదపడదు.

అందుకే బుద్ధుడు ఒక చోట ఉపదేశం చేస్తూ ఉంటే ఒక శిష్యుడు బుద్ధుడితో భగవాన్ మీరు మాకు ఎన్నో బోధలు చేస్తున్నారు కానీ "నేను ఎప్పుడైనా ఉన్నత జ్ఞానానికి సంబంధించిన విషయాలు అడిగితే వాటిని మాకు చెప్పరు". మౌనంగా ఉంటారు, దాటవేస్తూ ఉంటారు అని అడిగాడు.

అప్పుడు బుద్ధుడు, నేను రేపు మీ ఇంటికి భిక్షకు వస్తాను. అప్పుడు ఆ విషయం చర్చిద్దాం అని చెప్పి ఆయన మౌనం వహించారు. అప్పుడు శిష్యుడు బుద్ధ భగవానుడు ఇంటికి వస్తున్నాడు అని పరమానందంతో ఇంటికి వెళ్ళాడు. మర్నాడు ఎన్నో పిండి వంటలు చేసి బుద్ధుని రాక కోసం ఎదురు చూస్తున్నాడు.

సమయం కాగానే బుద్ధుడు వచ్చాడు. వచ్చి భిక్షపాత్రను చాచి భిక్ష అభ్యర్థించాడు. వెంటనే ఆ శిష్యుడు ఆనందంతో తాను తయారుచేసిన పిండి వంటలు అన్నీ ఆ పాత్రలో వేయబోయాడు. కానీ ఆ పాత్రను చూసి అలాగే ఉండిపోయాడు. ఎందుచేతనంటే ఆ పాత్ర నిండా మట్టి, ఇసుక ఉంది.

అప్పుడు బుద్ధుడు ఎందుకు భిక్ష వేయడం లేదు? అని అడిగాడు. అతను ఏమన్నాడంటే? స్వామి మీ పాత్రలోని మట్టిని బయట వేసి పాత్రను శుభ్రం చేయండి, అప్పుడు భిక్ష వేస్తాను అన్నాడు. అప్పుడు బుద్ధుడు నా భిక్షా పాత్ర ఎలా ఉంటే నీకేంటి? నేను వేయమన్నాను వెయ్యి అన్నాడు. అప్పుడు నిజమే స్వామి కానీ అలాంటి మట్టి ఉన్న పాత్రలో నేను భిక్ష సమర్పించినా అది ఇసుకతో కలిసి అశుద్ధమై నిరుపయోగం అవుతుంది అని సమాధానం ఇచ్చాడు.

అప్పుడు బుద్ధుడు చిరునవ్వుతో నాయనా! నిన్న నీవు నన్ను ఒక విషయం అడిగావు. నీవు ఉన్నతమైన జ్ఞానాన్ని నేను నీకు ఎందుకు బోధించడం లేదు అన్నావు? నీలో ఎంతో అహంకారం ఉంది. అహంకారంతో ఉన్న నీకు జ్ఞానాన్ని ఇస్తే అది మట్టి, ఇసుకతో కలిపిన ఆహారం లాగా వృధా అవుతుంది. అందుకే నేను జ్ఞానం నీకు బోధించలేదు అన్నాడు.

నీ హృదయం అనే పాత్ర శుభ్రంగా ఉంటే ఒకరు జ్ఞాన భిక్ష వేయవలసిన పని కూడా ఉండదు. అది తనకి తానుగా ఉద్భవిస్తుంది, అని బుద్ధుడు బోధించాడు.

అప్పుడు ఆ శిష్యుడు ఆయన కాళ్ళ మీద పడి మీరు చెప్పింది నాకు అర్థమైంది. మీరు చెప్పినట్లే చేసి నాలో ఉన్న అహంకారం తొలగించుకునే ప్రయత్నం చేస్తాను అని అన్నాడు. అప్పుడు బుద్ధుడు నేను జ్ఞానాన్ని బోధించక్కర్లేదు. నీ హృదయాన్ని "శుద్ధంగా, అహంకార రహితంగా" ఉంచుకో. నీలో చాలా మంచి గుణాలు ఉన్నాయి. కానీ ఈ అహంకారం ఉంటే ఈ జ్ఞానం నీకేమి ఉపయోగపడదు అన్నారు.

అందుచేత ఎవరైనా సరే అహంకారంతో ఒక మహా జ్ఞానిని ఆశ్రయిస్తే వారు ఎంత బోధించినా, ఉపదేశించినా ఆ ఉపదేశాలు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చలేవు.

అంతేకాదు అహంకారం నిండుగా ఉన్నప్పుడు ఎన్ని శాస్త్రాలు చదివినా వాటిలోని అంతర్గత విషయాలు అర్థం కావు, బాహ్యార్థం తప్ప.

అర్థం కాదు సరి కదా "వాటిని వాళ్ళు ఆత్మవికాసానికి  కాకుండా తప్పులను కప్పి పుచ్చుకోవడానికి, స్వార్థ ప్రయోజనాలకి వినియోగించి ఇంకా పతనం అవుతారు".

ఇంకా బుద్ధుడు ఏమన్నారు అంటే... అహంకారపూరితమైన వారు ఎన్ని పవిత్రమైన కార్యాలు చేసినా, జ్ఞానానికి సంబంధించిన విషయాలు తెలుసుకున్నా నిరుపయోగమే అన్నారు.  అందుచేత ఎవరైనా సరే "జ్ఞానకాంక్ష" ఉన్నవారు తనలోని అహాన్ని తొలగించటానికి ప్రయత్నించాలి.  ఎంతవరకు మీలో అహంకారం ఉంటుందో అంతవరకు జ్ఞాన సముపార్జనకు అవకాశం ఉండదు.  ఎన్ని తిప్పలు పడినా, ఎన్నాళ్ళు ఉన్నా, ఎన్ని చెప్తున్నా సరే మీ జ్ఞానం పెరగదు.

అందుచేత ఆ గురువులకు మీరు ప్రశ్నలు వేసినా, వారు జవాబులు చెప్పినా, బోధలు చేసినా అన్ని వ్యర్థమే. .

అందుచేత  జ్ఞానం పెరగడానికి పెద్ద అవరోధం అహంకారం అని తెలుసుకోవాలి. అది గురువు వల్లే సాధ్యం

మీలో అహంకారం ఉందా? లేదా? అని మీలో అహంకారాన్ని బట్టి అది తొలగించే ప్రయత్నం గురువు చేస్తాడు.  ఆయన మాటలు, ఆయన తిట్లు అర్థం కావు.  అపార్థం చేసుకునేవారు ఉండవచ్చు.

ఎందుచేతనంటే మీరు పత్రి గారిని గమనిస్తే వారు చేసేది కూడా ఇదే అని మీకు తెలుస్తుంది. ఎందుకంటే ఆయన ముఖ్యంగా ప్రతి ఒక్కరిలోనీ అహంకారం తొలగించడానికి ప్రయత్నిస్తారు. కారణం మీరు జ్ఞానం పెంచుకోవాలి అంటే ఇది ముఖ్యం. కనుక పత్రి గారు చేసే ఈ ప్రయత్నం చాలా మంది అర్థం చేసుకోలేక అపార్థం చేసుకొని ఆయనకు దూరం అవుతున్నారు.

ఇది నేను బాగా గమనించాను.  ఈయన ఏంటి ఇలా తిడుతూ ఉంటారు.  ఏదో ఒక వంక పెట్టి తిడుతుంటారు అని అనుకునే వాడిని. కానీ ఆయనకి కావలసినవారు, బాగా దగ్గర వాళ్ళు ఎంతో ఎదగాలనే తపన

ఆయనలో ఉన్నపుడు మొదట్లో వాళ్లు చేసే పని ఏమిటంటే శిష్యుడిలో ఉన్న "అహం" తొలగించే ప్రయత్నం చేస్తారు. ఈ ఆధ్యాత్మిక మార్గంలో, జ్ఞాన మార్గంలో మీలో ఎన్నో మంచి లక్షణాలు ఉండవచ్చు. మీలో అహం ఉంటే అవన్నీ వృధా అయిపోతాయి. అందుకే వాళ్ళు ఆ ప్రయత్నం చేస్తారు.

నా విషయంలో కూడా అలానే జరిగింది. నేను క్లాస్ ఆర్గనైజేషన్ చేసినప్పుడు, అన్ని ప్రోగ్రాములు ఏర్పాటు చేసినప్పుడు ఆయన పొగుడుతారు అనుకుంటే తిట్టేవారు. లోపల అనుకునేవాణ్ణి ఇంత పని చేస్తే ఆయన తిట్టడం ఏమిటి? అని తర్వాత అర్థమైంది. నేను కాబట్టి ఇంత గొప్ప పని చేశాను అని నాలో అహంకారం పెరిగినప్పుడు ఆయన అలా తిట్టడం జరిగేది " అని.

మా మేడంకు కూడా సాధారణంగా పత్రిగారు లాంటి గురువు ఇంటికి వస్తున్నారని అహంకారం ఉంటుంది. ఎవరింటికి రాలేదు, మా ఇంటికి వచ్చారు అని అనుకొంటే ఎలా? ఆయన ఆ వంట మీద ఏదో వంక పెట్టి తిట్టేవారు. ఇన్ని చేస్తున్నా తిడుతున్నారని దూరంగా ఉండి, వాళ్లను, వీళ్ళను పంపించేది. వంటింట్లోకి వెళ్లి మరీ తిట్టేవారు. ఏమీ లేదు ఇంత చేస్తున్నాను అన్న సంగతి ఆయనకు తెలుసు! మనలో అహంకారం పెరగకూడదని ఉద్దేశ్యం. కానీ ఎవరైనా అపార్థం చేసుకొని దూరమైనా పత్రిగారు పట్టించుకునే వారు కాదు. ఆయన లక్ష్యం అందరినీ "జ్ఞానవంతులని చేయాలని".

జ్ఞానవంతులైతే ఏమవుతుంది? జ్ఞానం ఉన్నవాడు ఎప్పుడూ "లోక కళ్యాణం" కోసం పాటుపడతాడు, వాడికి మిగతా గొడవలు అనవసరం. తన సుఖం, తన భోగం లెక్కచేయడు, లోక కళ్యాణమే జ్ఞానం ఉన్నవాడి లక్ష్యం. అందుచేత ఆయన ఏమి చేసినా కూడా లోక కళ్యాణ ఉద్దేశ్యంతోనే చేస్తారు. అందుచేత మనం అహంకార రహితులు కావాలి అంటే "బ్రహ్మ జ్ఞానులు" అయినటువంటి "పత్రీజీ మార్గంలో" పయనించాలి. ఆయన్ని ఆశ్రయించాలి. ఆయన బోధించే ఈ 'శ్వాస మీద ధ్యాస ధ్యానం' చేయాలి.

స్వార్థ ప్రయోజనాలతో గురువును ఆశ్రయించిన వాడు, వాడి అహంకారం దెబ్బతిని ఆ గురువును వదిలివేస్తాడు. వాడికి నచ్చిన గురువును

చూసుకుంటాడు. ఆ గురువుకి జ్ఞానం ఉందా లేదా వాడికి అనవసరం. తనకు నచ్చినట్లుగా గురువు ఉన్నాడా? లేదా? అన్నది చూస్తాడు.

అసలు గురువుకు నచ్చినట్లుగా శిష్యుడు ఉండాలా? శిష్యుడికి నచ్చినట్లుగా గురువు ఉండాలా? అలాంటి వారు ఎన్ని వందల జన్మలు తీసుకోవాలో! కానీ గురువు నచ్చినట్లు వీడు ఉంటే కొద్ది జన్మలలోనే వీడు పరిపూర్ణుడు అవుతాడు. అందుచేత ఎవరైనా సరే ఆధ్యాత్మికంగా ఎదగాలి, పరాకాష్టకు చేరుకోవాలి అనుకునేవాడు అటువంటి సద్గురువులను ఆశ్రయించినప్పుడు, ఆ గురువు తప్పనిసరిగా వారిలో ఉన్న అహంకారం తొలగించే ప్రయత్నమే చేస్తాడు. నిజంగా వారు ఆ స్థితికి చేరుకున్నారు కాబట్టి వారికి తెలుసు కాబట్టి, ఈ ప్రయత్నమే చేస్తారు.

మీరు ఇక్కడ కనుక చూసినట్లయితే విశ్వామిత్రుని జీవితం ద్వారా ఈ విషయం మనం తెలుసుకోవచ్చు.

విశ్వామిత్రుడు 1000 సంవత్సరాలు తపస్సు చేశాడు. అలా చెయ్యడం వల్ల అపారమైన శక్తి సంపాదించాడు. ఏ స్థాయికి ఎదిగాడు అంటే సృష్టికి ప్రతి సృష్టి చేయగలిగే స్థాయికి ఎదిగాడు. ప్రకృతిలో అలాంటి వారికి పరీక్షలు ఉంటాయి, అలాగే విశ్వామిత్రుని ఇంద్రుడు  పరీక్షించాడు.

ఇంద్రుడు విశ్వామిత్రుని దగ్గరకు మేనకని పంపించాడు.  మేనక సౌందర్యం చూసి విశ్వామిత్రుడు ఆవిడను వివాహం చేసుకోవాలనుకుని మేనకతో చెప్పాడు. ఆవిడ నాకు ఏమీ అభ్యంతరం లేదు అని ఒక కండిషన్ పెట్టింది. నా కోరిక తీర్చకపోతే నిన్ను వదిలి వెళ్ళిపోతాను అంది.

విశ్వామిత్రుడు అంగీకరించి ఆమెను వివాహం చేసుకున్నాడు. కాపురం చేశారు. ఆవిడ రోజు విచిత్రమైన కోరికలు కోరేది.  విశ్వామిత్రుడు తన శక్తిని ఖర్చుపెట్టి ఆవిడ కోరికలు తీర్చేవాడు,  మెల్లిగా శక్తి అంతా అయిపోయింది.

ఒక రోజు ఆవిడ కోరిక తీర్చకపోయేసరికి  ఆవిడ వెళ్లిపోయింది, చాలా  బాధపడ్డాడు. ఇక చేసేది లేక మళ్లీ 1000 సంవత్సరాలు ధ్యానం

చేశాడు, మళ్లీ అంత శక్తిని సంపాదించాడు. ఇంద్రుడు ఈసారి రంభను పంపించాడు. విశ్వామిత్రునికి అర్థం అయింది ఇంద్రుడు చేసిన పనే ఇది అని. అతని అహంకారం దెబ్బతింది. నన్ను ఇంతలా పరీక్షిస్తాడా? అంటూ, రంభను రాయి అవ్వమని శపించాడు. తన శక్తిని కోల్పోయాడు, మామూలు మనిషి అయ్యాడు, చాలా బాధపడ్డాడు.

ఇలా నాలుగు సార్లు తన అహంకారంతో శక్తిని నష్టపోయాడు. ఆఖరికి ఇంద్రుడే స్వయంగా మారువేషంలో వచ్చాడు. విశ్వామిత్రుడు భోజనానికి కూర్చున్నాడు. ఆ టైంలో ఇంద్రుడు బిక్షను అభ్యర్థించాడు. నాకు ఆకలిగా ఉంది అని. అహంకారంతో నా శక్తిని కోల్పోయాను. ఈసారి నేను అలా కాకూడదు అని చెప్పి, భోజనం దగ్గర నుంచి లేచి ఇంద్రుని ఆహ్వానించి కూర్చోబెట్టి భోజనం పెడతాడు. భోజనం అయ్యాక ఇంద్రుడు నీవు ఇప్పుడు పరిపూర్ణుడు అయ్యావు, బ్రహ్మర్షివి అయ్యావు. నీకు ఏ లోటూ లేదు, నీవు పరిపూర్ణ స్థితిని సాధించావు అన్నాడు.

అంటే ఇక్కడ ఈ కథ ఎందుకు తెలుసుకోవాలి అంటే, ఆయన సృష్టికి ప్రతి సృష్టి చెయ్యగలిగిన శక్తి ఉన్నా కూడా, నేను ఇంత గొప్ప వాడిని, నేను ఇంత శక్తివంతుడిని, నేను ఏదైనా చేయగలను అనే అహంకారం వాడిలో ఉన్నంతకాలం పరిపూర్ణుడు కాలేకపోయాడు. ఎప్పుడైతే అహంకారం తొలగించుకున్నాడో, అప్పుడు పరిపూర్ణుడు అయ్యాడు.

అందుచేత మీలో ఎన్నో విశిష్టతలు ఉండవచ్చు, ఎన్నో గొప్ప తనాలు ఉండవచ్చు. అంత గొప్ప వాడికే పరిపూర్ణుడు అయ్యే అవకాశం లేదే! ఏదో కొద్దిపాటి ధనం సంపాదించి, ఎంత అహంకారిస్తారు. కొంచెం నైపుణ్యం మీ దగ్గర ఉంటే ఎంత అహంకరిస్తారు! కొద్దిపాటి తెలివితేటలు ఉంటే ఎంత అహంకరిస్తారు. ఏదో చిన్న గొప్ప పని చేస్తే, ఒక క్లాసు చెప్పినా మీరు ఎంతో ఫీల్ అవుతారు. ఎక్కడైనా క్లాస్ చెప్పినా శాలువా కప్పి, ఫోటో తీస్తే, తెలియకుండానే లోపల ఎంతో అహంకారం పెరిగిపోతుంది. మీరు ఎక్కడ ఎదుగుతారు. అంత గొప్ప విశ్వామిత్రుడికే దిక్కు లేదు. కొద్దిపాటి జ్ఞానానికే

పొంగిపోతే  ఎలా ఎదుగుతారు?

అందుకే పత్రిగారు మానం, అవమానం రెండింటిలో సమాన స్థితిలో వుండాలి అని. మానము అంటే సన్మానం, అవమానం రెండింటిలో సమస్థితిలో ఉండాలి. విశ్వామిత్రుని కథ ద్వారా మనం తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన వారికి ఇది చాలా అవసరం.

ఎంత ఉన్నత స్థితికి ఎదిగినా  చివరి దాకా మిగిలేది ఈ అహంకారమే. అది కూడా తొలగిస్తేనే నీవు పరిపూర్ణుడివి అవుతావు.

ఎవరైతే భూమి మీద ఆత్మజ్ఞానం పూర్ణంగా సంపాదించుకున్నప్పుడు, మెల్లిమెల్లిగా వారిలో అహంకారం నశిస్తుంది. అలాగే చిత్తం శాంతింప చేసుకుంటారు. చిత్తం అంటే మనసు, ఆ చిత్తం పూర్తిగా పరిశుద్ధం అవుతుంది. ఈ రెండు పోతే మిగిలేది ఆత్మ. అప్పుడు అద్వైతంగా, పురుషోత్తముడిగా, పరమాత్ముడిగా, శాశ్వతంగా నిలిచిపోతాడు.

అందుకే  సద్గురువులు ముందు ఆ సాధకుడిలో, ఆ శిష్యుడిలో, అహంకారం నశింపచేయడానికి  ప్రయత్నం చేస్తారు. కారణం ఏమిటంటే ఈ అహంకారం అన్నది ఆ గురువు ఎంత తొలగించినా మళ్లీ పెరిగిపోతూ ఉంటుంది. తెలియకుండానే పెరిగిపోతుంది .దాన్ని ఎప్పటికప్పుడు తొలగించే ప్రయత్నం చేస్తారు. వారికి తెలుసు వీరిలో అహంకారం పెరిగింది అని. వారిని కోపగించుకుని, లేదా మరీ ఎక్కువ ఉంటే రెండు దెబ్బలు వేసైనా చేప్తారు.

నాకు బాగా తెలుసు చాలా సందర్భాలలో పత్రి గారు ఏమి చేస్తారో. ఒక్క సందర్భంగా అంటే షిరిడీలో ధ్యాన మహా యజ్ఞం జరిగింది. పత్రి గారు నిర్వహించారు. అప్పుడు నేను రెండు మూడు రోజులు లేటుగా వెళ్ళాను. లేటుగా వెళ్లి పత్రి గారు అందరితో  గదిలో కూర్చుని ఉంటే,నేనూ వెళ్లాను ఆయనకు కనిపిద్దామని. ఎందుకో తెలియదు నాకు, నన్ను చూడగానే విపరీతంగా కోపం వచ్చింది పత్రి గారికి. లేచి నన్ను కొట్టారు. ఏంటి ఇప్పుడు వచ్చావా నువ్వు అని. నాకు అర్థం కాలేదు, నేను ఏం తప్పు చేశాను? ఏం

పొరపాటు చేశాను? ఏమిటి ఇలా కొట్టారు, స్టన్ అయిపోయాను. అప్పటికే ప్రతి దానికి ఒక కారణం ఉంటుంది అనే అవగాహన ఉండటం వలన ఏం మాట్లాడలేదు, అలాగే కూర్చున్నాను. కాసేపటికి మరలా ఎంత కోపం ప్రదర్శించారో, అంత ప్రేమను ప్రదర్శించారు.

అప్పుడు ఆలోచించాను ఏమిటి నేను చేసిన పొరపాటు అని, నాకు అర్థమయింది. అటువంటి యజ్ఞాలు నిర్వహించినప్పుడు అది సక్సెస్ అవ్వాలి అంటే ఎవరు అయితే అందులో కీలకంగా వ్యవహరిస్తూ ఉంటారో, దాని సక్సెస్ కు కొంచెం కృషి చెయ్యాలి. నేను సీనియర్ మాస్టర్ అయి ఉండి ఏమీ చేయకుండా, అందరి లాగా అందులో పాల్గొంటే ఆ కార్యక్రమం ఏమవుతుంది చెప్పండి. అందులో ఏ పాత్రా పోషించక పోతే కోపం ఉండదా! అప్పటినుంచి నేను అర్థం చేసుకున్నాను. తర్వాత నుంచి ఏ యజ్ఞం జరిగినా దానిలో పాల్గొనే వాడిని. అది సక్సెస్ అవ్వటానికి ముఖ్య పాత్ర తీసుకునే వాడిని. అలా ప్రతి చోటా, అమరావతిలో కానీ, వైజాగ్ లో కానీ, కడ్తాల్ ధ్యాన యజ్ఞంలో కానీ, చాలా ముఖ్యమైన పాత్ర పోషించి ఫండ్ కలెక్ట్ చేయడానికి కృషిచేసేవాడిని. అందుకే పత్రి గారు ఎప్పుడైనా సరే ఏ కార్యక్రమం అయినా ఫండ్స్ అవసరం అయినపుడు, నీవు ఇది చూసుకోవాలి అనే మాట అంటూ ఉంటారు.

నిజంగా ఇటువంటి గొప్ప కార్యక్రమాలు జరిగినప్పుడు అందులో పాల్గొంటే, ఆ ఫలితం మనం ఎందుకు పొందం? మనకు అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకోకపోతే, ఎంత నష్టపోతాం. అందుచేత అటువంటి అవకాశాలు అస్తమాను రావు, వచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలి. మన వంతు ఎంతో కొంత, అటువంటి కార్యక్రమాలలో పాల్గొనాలి. ఆయన ద్వారా ఇంత జ్ఞానం పొందుతున్నామే, ఎంతో కొంత మనం ఎందుకు పాల్గొనలేము.

ధ్యాన యజ్ఞము అంటే పరబ్రహ్మ మీద దృష్టి ఉంచి ఆయననే ఉపాసించడం. ఈ ధ్యాన యజ్ఞం అంత గొప్పది. పరబ్రహ్మ అంటే దేవతలు, దేవుళ్ళ కంటే గొప్పవాడు.

దీనికి ఉపనిషత్తులోని ఒక కథ చెప్తారు. పూర్వకాలంలో దేవతలు, రాక్షసులు చాలా రోజులు యుద్ధం చేశారు. దేవతలు నెగ్గారు, రాక్షసులు ఓడిపోయారు. దేవతలు గెలిచినందుకు ఉత్సవాలు చేసుకుంటూ మాకంటే గొప్ప వారు లేరని, మమ్ములను మించిన వారు లేరని వారిలో అహంకారం పెరిగింది. వీళ్ళను మించిన ఆ పరబ్రహ్మ వీరిని గమనించాడు. వీరికి ఎందుకు ఇంత అహంకారం.

ఇంతటి అహంకారం వీరి నాశనానికి కారణం అవుతుంది అని భావించాడు. వీరికి బుద్ధి చెప్పాలి అని దేవతలు సమావేశమై ఉండగా, ఒక యక్షుని రూపంలో వారికి దూరంగా ప్రత్యక్షమయ్యారు. ఆయన తేజస్సును చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఆయన ఎవరో అర్థం కాక దేవతలు అందరూ కలిసి అగ్ని దేవుని పంపించారు.

అగ్నిదేవుడు యక్షుని దగ్గరకు వెళ్ళాడు. స్వామి ఎవరు మీరు అన్నారు. నా సంగతి చెప్తాను కానీ నువ్వు ఎవరో చెప్పు అన్నారు. నేను అగ్నిదేవుడిని చాలా శక్తివంతుడ్ని, నేను దేనినైనా భస్మం చేయగలను, ఈ ప్రపంచాన్నే భస్మీపటలం చేయగలను అన్నాడు. నీవు అంత శక్తివంతుడివా? అయితే ఈ గడ్డి పరకను భస్మం చేయి అన్నారు. అగ్నిదేవుడు తన శక్తిని అంతా ఉపయోగించాడు. కానీ దానిని ఏమీ చేయ లేకపోయాడు. ఆశ్చర్యం వేసింది. భయపడి పారిపోయాడు.

తరువాత వరుణదేవుడు వచ్చాడు. నేను శక్తివంతుడిని, దేనినైనా నా శక్తితో కొట్టుకుపోయేలా చేస్తాను అన్నాడు. ఈ గడ్డిపరకను కొట్టుకుపోయేలా చేయి అన్నారు. కానీ అది కదలలేదు. ఆయన కూడా పారిపోయాడు.

తరువాత వాయుదేవుడు వచ్చాడు. ఆయన కూడా ఆ గడ్డిపరకను ఏమీ చేయలేకపోయారు. ఆయన పారిపోయాడు.

తర్వాత ఇంద్రుడు వచ్చేలోపులే యక్షుని రూపంలోని ఆ పరబ్రహ్మ మాయమయ్యారు. అందరికీ ఆశ్చర్యం కలిగింది. ఎవరు ఆయన అని? అప్పుడు పార్వతీదేవి ప్రత్యక్షమై ఇంద్రునితో చెప్పింది. నాయనా ఆయన ఎవరో కాదు

మన అందరికీ మూలమైన వాడు, ఆధారమైన వాడు. మనం ఏం చేయగలిగినా ఆయన వల్లే చేస్తున్నాం, ఆయన లేకపోతే మనం ఏమీ చేయలేము అని చెప్పింది. మీ శక్తి అంటూ మీరు ఏదో విర్రవీగుతున్నారు. ఆయనే లేకపోతే ఏం చేయగలరు! అని ఆయన చూపించాడు. ఇప్పుడు చూసావు కదా ఈ పాఠం మీకు నేర్పడానికే ఆయన ప్రత్యక్షమై ఇలా మీకు బుద్ధి చెప్పాడు అని చెప్పింది. అప్పుడు అర్థం చేసుకున్నారు దేవతలు.

ఇక్కడ మీరు కూడా గుర్తుపెట్టు కోవలసింది ఏమిటి అంటే ఆ పరబ్రహ్మ అంటే ఆత్మ, పత్రి గారు చెప్పారుగా ఆత్మే పరబ్రహ్మ అని.

ఆత్మ దేవతలలో ఉండబట్టే వారు విజయం సాధించారు. ఆత్మే లేకపోతే గడ్డిపరకను కూడా ఏమీ చేయలేకపోయారు. అలాగే అదే ఆత్మ ప్రతి ఒక్కరిదేహంలో ఉంది కాబట్టే, నీవు ఉపన్యాసాలు చెప్తున్నావు, క్లాసులు చెప్తున్నావు, డబ్బులు సంపాదిస్తున్నావు, పదవులు సంపాదిస్తున్నావు, అన్నీ చేస్తున్నావు.

ఆత్మ లేకపోతే ఏం చేస్తావు చెప్పు. నీ చేయి కదలదు, నోరు మాట్లాడలేదు, కళ్ళు చూడలేవు, చెవులు వినలేవు ఏమీ చేయలేవు. నువ్వు జీరో! నేను నేను అంటావు ఏమిటి? నీవు ,ఏం చేయగలవు.

అంత శక్తి వంతుడైన ఆ పరబ్రహ్మ, దేవుళ్ళ కంటే అంటే బ్రహ్మ, విష్ణు మహేశ్వరుల కంటే గొప్పవాడు. అటువంటి పరబ్రహ్మను ఉపాసిస్తూ చేసేదే ధ్యానం. ఇంత గొప్ప యజ్ఞం జరిగితే నాకు ఏమీ సంబంధం లేనట్లు దూరంగా ఉన్నాను నేను. మరి ఎంత తెలివైన వాడివో అని చెప్పి నన్ను అప్పుడు మేల్కొలిపారు పత్రి గారు.

మనలో ఉన్నటువంటి ఇంకొక చెడు లక్షణం తెలుసుకుందాం.

## "వ్యామోహం"

ఇది కూడా మానవునికి చాలా చెడు కలిగిస్తుంది."వ్యామోహం అంటే విపరీతమైన కోరిక". ఏమైనా సరే ఆరు నూరైనా, నూరు ఆరైనా సరే ఆ కోరిక తీర్చుకోవాలి అనే ఈ వ్యామోహంలో చేయకూడని పనులు చేస్తారు.

తప్పులు, పాపాలు చేస్తారు, అధర్మంగా వ్యవహరిస్తారు, సృష్టికి విరుద్ధంగా వ్యవహరిస్తారు, చివరకు కష్టాలు తెచ్చుకొని నాశనమవుతారు.

చూడండి రాజకీయాలలో ఉన్న వారిని నేను మినిస్టర్ అవ్వాలి, ఎమ్మెల్యే అవ్వాలి, ఒక చీఫ్ మినిస్టర్ అవ్వాలి అనే వ్యామోహంతో ఎన్ని దారుణాలు, కక్ష సాధింపులు, ఎంతమందికి ఎన్నో రకాలుగా అన్యాయం చేస్తున్నారు! చివరకు దాని ఫలితం దారుణాతి దారుణంగా అనుభవిస్తారు. కారణం ఆ పదవి మీద ఉన్న వ్యామోహం. ప్రతి ఒక్కరూ ఈ లక్షణం కూడా తొలగించుకోవాలి. ఇది చాలా ముఖ్యం, అవసరం.

ఇది అర్థం అవ్వడానికి ఒక ఉదాహరణ చూద్దాం.ఒక అబ్బాయి మంచి యౌవనం లో ఉన్నాడు. ఒక అమ్మాయిని చూశాడు. రోజూ చూస్తుంటే, వాడికి ఆ అమ్మాయిని ఎలాగయినా పొందాలని కోరిక కలిగింది. ఆ అమ్మాయి దగ్గర తన కోరిక వ్యక్తం చేస్తే ఆ అమ్మాయి అంగీకరించలేదు. అప్పుడు వాడికి విపరీతమైన కోపం వస్తుంది. ఆ కోపంతో, వాడేమి చేస్తున్నాడో కూడా వాడికి తెలియలేదు. ఒక యాసిడ్ బాటిల్ తెచ్చి ఆ అమ్మాయి మీద పోసి పారిపోతాడు. మొత్తం ఆ అమ్మాయి జీవితం నాశనమైపోతుంది. ఎంతో అందంగా ఉన్న అమ్మాయి, వికృతంగా తయారవుతుంది. ఒళ్ళంతా కాలిపోతుంది. ఎందుకు ఇలా చేసాడు అంటే అమ్మాయి మీద వ్యామోహం. దేని మీదైనా విపరీతమైన కోరిక కూడా చెడు లక్షణమే. ప్రతి ఒక్కరూ ఈ కోరిక కూడా తొలగించుకోవాలి. ఇది చాలా ముఖ్యం.

కొంతమందికి నేను కోటీశ్వరుని కావాలి, అందరికంటే బాగా సంపాదించాలి, అనేటటువంటి వ్యామోహం ఉంటుంది. దానికోసం న్యాయంగా, ధర్మంగా, సంపాదించలేడు. అందుచేత తప్పుడు మార్గాలు వెతుకుతాడు. అక్రమాలు చేస్తాడు, అన్యాయంగా ప్రవర్తిస్తాడు, మోసగిస్తాడు, దౌర్జన్యం చేస్తాడు. ఇలాగ రాజకీయ నాయకులలో చూస్తాం. వారి చేతుల్లో పవర్ ఉంటుంది. అందుచేత ఎవరి ఆస్తి మీద, పొలం మీద, స్థలం మీద కన్ను పడితే నాకు అమ్మమంటాడు. అది నాది, నేను ఎందుకు అమ్ముతాను?

అమ్మను అంటే వాడిని బెదిరిస్తాడు. కాదు కూడదు అంటే వాడిని కిడ్నాప్ చేస్తాడు. వాడి మీద దౌర్జన్యం చేస్తాడు, అవసరమైతే చంపేస్తాడు కూడా. ఎందుకంటే వ్యామోహం వల్లనే. ఇలా మనం గమనించినట్లయితే ఈ వ్యామోహం వలన ఎంతో మంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.

ఈ విషయం భగవద్గీతలో కూడా చెప్పబడింది.

**శ్లో॥ ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తే షూపజాయతే।**
**సంగాత్ సంజాయతే కామఃకామాత్ క్రోధోభిజాయతే। (భ.గీ.2-62)**

**శ్లో॥ క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః।**
**స్మృతి భ్రంశాద్బుద్ధినాశో బుద్ధి నాశాత్ ప్రణశ్యతి। (భ.గీ.2-63)**

తా:- విషయాలను చింతించు మనుషులకు ఆ విషయాల పట్ల ఆసక్తి కలుగుతుంది. ఆసక్తి వలన దానిని పొందాలి అనే కోరిక కలుగుతుంది, అది చివరకు విపరీతమైన కోరికగా మారి తీరకపోవడం వలన కోపం కలుగుతుంది. ఈ కోపం వల్ల వివేకం నశిస్తుంది. వివేకం నశించింది అంటే వాడి బుద్ధి నాశనం అవుతుంది. బుద్ధి నశించడం వల్ల వాడు ఏం చేస్తున్నాడో కూడా తెలియదు. అలాంటి వాడిని చనిపోయిన వాడితో సమానంగా పేర్కొంటారు.

అంటే రోజూ అమ్మాయిని చూస్తున్నాడు. రోజు చూడడం వలన అమ్మాయిని పొందాలి అని ఆసక్తి లోపల కలుగుతుంది. ఆసక్తి కోరికగా మారుతుంది. కోరిక పెరిగే కొద్దీ తన కోరికను ఏదో రకంగా అమ్మాయికి వ్యక్తం చేస్తాడు. ఒకవేళ అమ్మాయి ఆ కోరికను కాదు అన్నది అనుకోండి, నన్ను కాదంటావా? అని ఎన్నో రకాలుగా బ్రతిమిలాడుతాడు. నిన్ను పెళ్లి చేసుకుంటాను, అని ఎన్ని ప్రలోభాలు పెట్టినా ఆ అమ్మాయి కాదు అంటుంది. అప్పుడు వాడికి విపరీతమైన కోపం వస్తుంది. ఆ కోపం పెరిగే కొద్దీ అప్పటిదాకా ఉన్న వివేకం నశించిపోతుంది. వివేకం అంటే ఏది చెయ్యాలి-ఏది చెయ్యకూడదు, ఏది మంచి-ఏది చెడు అనే జ్ఞానం నశిస్తుంది.

అప్పుడు ఏమైనా సరే నన్ను కాదంటావా? నీ పని చెప్తాను అని

అనుకుంటాడు. వాడికి  బుద్ధి పని చెయ్యదు . పత్రి గారు చెప్తారు కదా! బుద్ధి అంటే చేయవలసింది చేయడము, బుద్ధి లేదు అంటే? చెయ్యవలసినది చెయ్యడు, చెయ్యకూడనిది చేస్తాడు. అప్పుడు తన కోపం తీర్చుకోవడం కోసం ఒక యాసిడ్ బాటిల్ తెచ్చి అమ్మాయి మీద పోస్తాడు. ఆ అమ్మాయి గురించి ఆలోచించడు. ఆ అమ్మాయి పరిస్థితి ఏమిటి? ఆ అమ్మాయి భవిష్యత్తు ఏమిటి? తన కోరిక కోసం ఆమె జీవితం నాశనం చేస్తే ఎలా? ఆ అమ్మాయి కాదంటే వేరే అమ్మాయిలు దొరకరా? అలాగే ఎవరైనా తన మీద యాసిడ్ పోస్తే తన పరిస్థితి ఏమిటి? ఈ ఆలోచన, వివేకం ఏమీ ఉండదు.  ఈ పని చేసినందుకు నేను దారుణమైన శిక్ష అనుభవించవలసి వస్తుంది లాంటి ఆలోచనలు ఏమీ ఉండవు వాడికి. వాడు మనిషిగా ప్రవర్తించడు. అలాంటి పనులు చేసేవాడు బ్రతికి ఉన్నా, చనిపోయినా ఒక్కటే. అందుకే వాడిని చనిపోయిన వాడితో సమానం అంటారు.

అందుచేత చూస్తే చూడవచ్చు కాని దానిమీద వ్యామోహం పెంచుకోవద్దు. వ్యామోహం అంటే విపరీతమైన కోరిక. అది చాలా చెడ్డ లక్షణం. ప్రయత్నించు అయితే అవుతుంది, లేకపోతే లేదు. ఏదేమైనా కావాలి అనుకొంటే తప్పు. జీవితం నాశనం చేసుకుంటారు.

ఇప్పుడు చాలామందిలో ఈ ధ్యానంలోకి  వచ్చిన వాళ్ళు పిరమిడ్లు కట్టాలి అనే వ్యామోహం. వారి దగ్గర ఆ స్తోమత ఉండవచ్చు, లేకపోవచ్చు తన స్థితిని తెలుసుకోవాలి కదా? దానికి నేను సమర్థుడినా కాదా అని చూసుకోకుండా మొదలుపెడతారు. అక్కడి నుంచి వారిని, వీరిని డబ్బులు అడుగుతారు. పోనీ చిన్నది మొదలు పెడతారా, అంటే పెద్దదే మొదలుపెడతారు. బాగా తిరుగుతారు అన్నీ చేస్తారు.ఎవరైనా ఇవ్వకపోతే వారి మీద కోపం వస్తుంది. ఆ పని దగ్గరకు ఎవరైనా వెళ్లకపోయినా, కోపం వస్తుంది.  ఇది అంతా ఎందుకు జరిగింది? అంటే వ్యామోహం, ఏమైనా కట్టాలి అని కోరిక.

గుర్తుపెట్టుకోండి ఏదైనా చూస్తేనే కదా కావాలి అనిపిస్తుంది. అది అసలు చూడకపోతే కావాలి అని ఎందుకు ఉంటుంది.

మారుమూల ప్రదేశాల్లో ఏమీ ఉండవు. ఉన్న దాంట్లో అలా బ్రతుకుతూ ఉంటారు. కానీ పట్టణాలలో, జీవించేవారు ఫ్రెండ్స్ ఇంటికో, చుట్టాల ఇంటికో, వెళుతూ ఉంటారు. వాళ్లు బాగా డబ్బు ఉన్నవారు అయితే ఎన్నో సౌకర్యాలు కల్పించుకుంటారు. అక్కడికి వెళ్లి చూస్తే తానూ అది పొందాలి అనిపిస్తుంది. నిజంగా చూడకపోతే అది పొందాలి అనే కోరిక ఉదయించదు. చూస్తేనే వస్తుంది. అందుకే అన్నారు భగవద్గీతలో ఆ విషయాలు చింతించే వాడికి ఆ విషయాల మీద ఆసక్తి కలుగుతుంది. ఆ ఆసక్తి వలన కోరిక పుడుతుంది అన్నారు. చూసి ఏం చేస్తారు.ఆవిడ ఇంటికి వచ్చి భర్తను అడుగుతుంది. వాళ్లు అది కొన్నారు మనం కూడా కొందాం అని.

మనకు అంత స్తోమత లేదు. ఇది ఎందుకు, తర్వాత చూద్దాం అన్నాడు అనుకోండి. ఈ కోరిక తీరకపోయేటప్పటికీ ఆయనతో గొడవ పడడం, సాధింపులు చేయడము మొదలవుతాయి. భోజనం సరిగ్గా పెట్టకపోవడం, ఇలా ఏదో చేస్తుంది. దానికి తగినట్టు వాడూ ప్రవర్తిస్తాడు. ఇద్దరూ గొడవలు పడతారు. ఆ గొడవలు తీవ్రస్థాయికి వెళతాయి. విడాకుల దాకా వెళ్తాయి. వారికి బుద్ధి నశించి ఎవరు చెప్పినా ఇద్దరూ వినరు. ఇది అంతా ఎక్కడ నుంచి వచ్చింది? ఆ విషయాలు చూడడం వల్ల. అదే చూడకపోతే ఏ గొడవ లేదు. పోనీలే చూశావు? పొందాలి అని ఎందుకు అనుకున్నావు?. పొందాలి అనుకున్నావు అయితే దానిమీద విపరీతమైన కోరిక ఎందుకు పెంచుకున్నావు? పెంచుకోవడం వల్ల కోపం పెరిగింది. కోపం పెరిగితే పెరిగింది, నీవు వివేకం ఎందుకు కోల్పోయావు? సంసారం అంటే గొడవలు పడడం కాదుగా! అన్ని అయిపోయి చివరకు విడాకులు తీసుకున్నాక ఇద్దరూ నరకం అనుభవిస్తారు. భర్త నరకం అనుభవిస్తాడు, భార్యా నరకం అనుభవిస్తుంది. సంసారంలో ఎన్నో గొడవలు వస్తాయి, జీవితం నాశనమవుతుంది.

ఏదైనా సరే చూసీ చూడనట్లుగా ఉండు. చూడండి తప్పు లేదు. ఈరోజుల్లో ఎన్నో కొత్తవి వస్తున్నాయి, రకరకాల వారు ఉంటారు. అందరితో కలిసి తిరుగుతారు. ఈ వ్యామోహం అనే చెడు లక్షణం మీలో ఉంటే జీవితంలో

ఎంతో నష్టపోతారు, కష్టాలు పాలవుతారు, గొడవలు పడతారు, చివరికి జీవితాన్ని నాశనం చేసుకుంటారు.

అందుచేత ఎవరైతే నేను చెప్పినట్లు తీవ్రాతి తీవ్రమైన ధ్యాన సాధన చేస్తారో, అంటే గంటలు గంటలు ఆలోచనలు లేని స్థితిలో ఉండడం. మనసు వేటి మీదికి పోదు. భవిష్యత్తులోకి వెళ్ళదు. గతంలోకి వెళ్లదు. నిశ్చలంగా ఉండిపోతుంది. అప్పుడు మనసును అదుపులో చేసుకున్న వాడు అవుతాడు. మనసును అదుపు చేసుకున్న వాడికి కోరికలు కూడా అదుపులో ఉంటాయి, ఎప్పుడు అయితే కోరికలు అదుపులో ఉంటాయో. ఈ వ్యామోహాలలో పడడు, జీవితాన్ని నాశనం చేసుకోడు.

ధ్యానం బాగా చేసిన వారు, సాత్విక గుణం లోకి వచ్చి పొందాలి అనే గుణం లో నుంచి, ఇవ్వాలి అనే స్థితికి వస్తారు. పొందే వాడు గొప్పవాడు కాదు. ఇచ్చేవాడు గొప్పవాడు. తాను అనుభవించేవాడు, గొప్పవాడు కాదు, ఇతరులకు లాభం చేకూర్చేవాడు గొప్పవాడు. సృష్టిలో వాడే గొప్పవాడు. అవసరాలకు పరిమితం అవుతూ, మీకు అదనంగా ఉన్నది లోక కళ్యాణానికి ఉపయోగించండి, ఇతరుల లాభాలకు వినియోగించండి. వాళ్లు భవిష్యత్తులో సక్సెస్ అవుతారు. ఎంతో కొంత ఒక మంచి కార్యక్రమానికి ఖర్చు పెట్టాలి. మీ లగ్జరీకో, విలాసాలకో, ఖర్చుచేస్తే వృధా చేయడమే. మా ఇంట్లో నన్ను చూసి విమర్శిస్తారు. ఎందుకు నీకు కక్కుర్తి అంటారు? కానీ నాకు అందరికీ మంచి చేస్తే అది తృప్తి, నాకోసం నేను అనుభవించను, అవసరం అయితే అక్కడి వరకే పరిమితం.

కొన్ని సంవత్సరాల నుంచి ఈ జూమ్‌లో పాల్గొనడం వల్ల, భీమవరం వస్తూ ఉండడం వల్ల చాలామంది వారిలో వున్న చెడును అధిగమించారు. ఇంకా కృషి చెయ్యాలి. ప్రతి ఒక్కరూ వీటిలో నాకు ఏ లక్షణాలు ఉన్నాయి! ఇంకా వేటిని సరి చేసుకోవాలి! అని చూసుకొని సరి చేసుకోండి. వీటన్నిటినీ మీరు సరి చేసుకోగలిగితే మీకంటే పరిశుద్ధులు ఎవ్వరూ లేరు, మీకంటే గొప్పవారు ఎవ్వరు లేరు.

డబ్బు ఉన్నవాడు గొప్పవాడు కాదు, పదవులు ఉన్నవాడు గొప్పవాడు కాదు, భోగభాగ్యాలు ఉన్నవాడు గొప్పవాడు కాదు, తనలో ఏ లోపాలు లేకుండా ఉంటే, వాడు గొప్ప వాడు. ఆ పని చెయ్యాలి ప్రతి ఒక్కరూ!

ధ్యానం ఏదో ఒక రోగం తగ్గించుకోవడం కోసం కాదు. ధ్యానం చేసి రోగం తగ్గింది అని సంబరపడిపోతారు. ఏమిటి ఉపయోగం? మీలో ఇన్ని లోపాలు ఉంటే మళ్లీ తప్పులు, పాపాలు చేస్తారు. ఇతరులకు చెడు చేస్తూ ఉంటారు. మరి తనలో చెడు ఉన్నవారే ఇతరులకు చెడు చేస్తారు.

ఇతరులలో దోషాలు గురించి మాట్లాడేవాడు కాదు, తనలోని దోషాలను తెలుసుకొని వాటిని సరిచేసుకునేవాడే"ఎన్ లైటెన్ డ్"మాస్టర్. అందుచేత మీ దృష్టి ఇతరుల నుంచి మీ మీదకి మళ్ళించుకోండి. మా ఆయన ప్రవర్తన బాగోలేదు, నా భార్య ప్రవర్తన బాగోలేదు, నా పిల్లలు సరిగ్గా లేరు, మా బంధువులు సరిగా లేరు. అవన్నీ అవసరం లేదు.

ఇతరులను విమర్శిస్తే నీవు నష్టపోతావు. నీ గురించి ఆలోచించు, నిన్ను నువ్వు సరి చేసుకునే ప్రయత్నం చెయ్యి, నిన్ను సంస్కరించుకో, నీలో ఎంత మార్పు వస్తుందో చూడు. అసలు మనలో ఇన్ని లోపాలు పెట్టుకొని ఇతరుల గురించి మాట్లాడడం ఎంత అవివేకం.

అందుకే పెద్దలు అంటారు, నీవు ఒకరిని వేలెత్తి చూపిస్తున్నావు అంటే, మిగిలిన వేళ్ళు నీ వైపు ఉన్నాయి అని అర్థం చేసుకో. నీవు ఒక్కడిని విమర్శిస్తూ ఉంటే నలుగురు నిన్ను విమర్శిస్తారు. పెద్దలు చెప్పిన దాంట్లో అర్థం ఏమిటంటే"వాడిలో లోపం నీవు చెప్తున్నావు, కానీ నీలో ఎన్ని లోపాలు ఉన్నాయో అవి నీవు చూసుకో".

నువ్వు నీలో లోపం సరి చేసుకుంటే అసలు ఎవరిలోనూ లోపం కనిపించదు. నీకు ఇతరులలో లోపాలు కనిపిస్తున్నాయి అంటే, నీలో లోపాలు ఉన్నట్లే లెక్క. వాడు తప్పులు చేస్తున్నాడు, నష్టపోతున్నాడు అంటావు. నీలో లోపాలు ఉన్నప్పుడు నీవు తప్పులు చేయవా? నీకు కష్టాలు రావా? నీలో లోపాలు లేనట్లు ఇతరులను విమర్శిస్తున్నావు. అందుచేత తెలివైన వారు ఎవరైనా

సరే తనను తాను సరి చేసుకునే ప్రయత్నంచెయ్యాలి. ఇతరులను విమర్శించ కుండా ఉండగలిగితే, ఆధ్యాత్మికంగా మీరు గొప్ప స్థాయికి ఎదిగినట్లే . ఇంకా మీరు ఇతరులను విమర్శించే పరిస్థితి ఉన్నప్పుడు, మీరు ఇంకా చాలా ఎదగాలి, ఆధ్యాత్మికంగా ఎదగలేదు అని లెక్క.

నీ కుటుంబంలో ఉన్నవారితో కానీ, నీ చుట్టుపక్కల ఉన్నవారితో కానీ నీకు సంబంధం లేదు. ఏదో నిన్ను నీవు సంస్కరించుకోవడానికి భూమి మీదికి వచ్చావు. అసలు నువ్వు ఏ లోకానికి వెళ్తావో, నీ చుట్టూ ఉన్నవారు ఏ లోకాలకు వెళ్తారో? అసలు వారు ఎక్కడి నుంచి వచ్చారో, వీరు ఎక్కడి నుంచి వచ్చారో?

అందుకే చూడండి కాకులు అన్నీ రాత్రి ఒక చెట్టు మీదికి చేరుతాయి. మళ్లీ పొద్దున్నే వేటి ఆహారం కోసం అవి వేరే వేరే ప్రదేశాలకు వెళ్లిపోతాయి. అన్నీ కట్టకట్టుకొని ఒకే చోటుకి వెళ్ళవు. మళ్లీ రాత్రి అయ్యేసరికి ఒకే చోటికి వస్తాయి. అలాగే మనం వేరే వేరే ప్రదేశాల నుంచి వచ్చాం, ఒకచోట ఉన్నాం, మళ్ళీ వేరే వేరే ప్రదేశాలకు వెళ్ళిపోతాం. ఇది అర్థం చేసుకోవడమే జ్ఞానం.

మీరందరూ కూడా ఒక్కొక్కరు ఒక్కో ఊరిలో ఉన్నారు. ఇండియాలో ఎన్నో రాష్ట్రాలు, గ్రామాలు ఉన్నాయి. మీరు ఒక వారం రోజుల పని మీద ఢిల్లీ వెళ్లారు. అక్కడ ఒక పెద్ద హోటల్లో దిగారు. అక్కడ ఎన్నెన్నో గ్రామాల నుంచి పట్టణాల నుంచి ఎంతోమంది హోటల్లో దిగుతారు. వారం రోజులు లేదా పది రోజులకు ఆ పని అవగానే ఎవరి ప్రాంతాలకు వారు వెళ్లిపోతారు. సంబంధం లేని చోట నుంచి వస్తారు, సంబంధంలేని చోటికి వెళ్లిపోతారు. మళ్లీ వారికి మీకు సంబంధం ఉండదు. ఈ జీవితం అంతే.

ఉన్నంతసేపు ఎంతో స్నేహంగా మెలుగుతారు, మాట్లాడుకుంటారు, చర్చించుకుంటారు అన్నీ చేస్తారు. భార్య, భర్త, పిల్లలు, ఆ కుటుంబం, ఆ బంధువులు. మళ్లీ సంబంధం ఉండదు. చాలా విచిత్రంగా కనిపిస్తుంది. ఢిల్లీ వెళ్లి పని మీద దృష్టి పెడతాడు కానీ, మిగతా వాళ్ల మీద దృష్టి పెట్టరు. మిగతా వాళ్ల గురించి ఆలోచించరు. టైం కి బయటకు వెళ్లి ఆ పని

చూసుకుంటారు. వాళ్లతో కాలక్షేపం చేసి వాళ్ళంతా నా వాళ్ళు అని చెప్పి అనుకోరు. వాళ్ళకు ఏదైనా అయితే ఏడవరు, కావాలంటే సాయం చేస్తారు కానీ మమకారం ఉండదు. అలాగే మనం ఒకచోట చేరాము. మనం సాధించవలసింది ఒకటి, మన లక్ష్యం వేరు. మన పనులు చేసుకోవడానికి వచ్చాము కానీ, మన కుటుంబంలోని వారికోసం రాలేదు.

ఇది అర్థం చేసుకొని మనలో చెడు తొలగించుకొని, జ్ఞానం పొందాలి

# మమకారం

పత్రి గారు చాలా సార్లు,'నా' 'మా' వదలాలని చెప్తూ ఉంటారు. నామాలు అంటే నాది, మాది, ఈ రెండూ తీసేయాలి.

చిట్ట చివరకు తొలగించుకోవలసినవి ఈ రెండే. ఎన్ని జన్మలెత్తండి 'నా' 'మా'లు తీసేదాకా మోక్షం అన్నది రాదు. అవి ఏం మాత్రం ఉన్నా మోక్షం పొందలేరు.నా అంటే అహంకారం, మా అంటే మమకారం రెండూ పోవాలి.

ప్రతి ఒక్కరూ  నా భార్య, నా భర్త, నా పిల్లలు, నా మనుమళ్ళు, నా ధనం, నా సంపదలు అనుకొంటూ వుంటారు.  ఎందుచేతనంటే మమకారం. చాలా మంది పిల్లలను, ఇంకా వయస్సు పెరిగి పెద్దవారు అయితే మనుమళ్ళను చూసుకుంటూ తమ ఎదుగుదలను నిర్లక్ష్యం చేస్తున్నారు. వారి సమయం అంతా వాళ్ళ కోసమే కేటాయిస్తున్నారు.

వారి గురించి అంటే ఆత్మ గురించి అస్సలు ఆలోచించడం లేదు. అన్నీ వదులుకొని పిల్లల మీదే దృష్టి పెట్టుకుని పెంచారు. పెళ్ళిళ్ళు చేశారు. తర్వాత అయినా ఆత్మ గురించి ఆలోచిస్తారా అంటే ఆలోచించరు.

ఎంత సేపూ దేహం నేను అనుకుంటున్నారు. దేహం తాను కాదు, ఆత్మ తాను అన్న అవగాహన లేదు. ఆ కూతురు కోసం, కొడుకు కోసం, లేదా మనుమళ్ళ కోసం వీరి జీవితాన్ని త్యాగం చేస్తారు. ఎంత దురదృష్టం.

మన సొసైటీలో చాలామంది ఏమంటారు అంటే,ఏమీ లేదండి అమ్మాయి పెళ్ళి అయిపోతే, అబ్బాయి పెళ్ళి అయిపోతే, ఇక నాకు పని ఏమీ

లేదు.నేను దీని మీదే ఉంటాను అంటారు. మొత్తం మీద ఐదేండ్లకో, 10 ఏళ్ళకో అవుతుంది. మొదట్లో మంచి ఆసక్తి చూపిస్తారు, సాధన బాగా చేసి, క్లాసులు కూడా బాగా చెబుతూ ఎదిగిన తర్వాత సడన్ గా మళ్లీ కనిపించరు. ఏంటి అంటే ? ఏమోనండి మళ్లీ భాధ్యత మీద పడింది అంటారు. అమ్మాయి పెళ్లి చేశాక అమ్మాయి జాబ్ సంపాదించుకొని అమ్మాయి వెళ్ళిపోతుంది, అల్లుడు ఉద్యోగానికి వెళ్ళిపోతాడు. వీరిద్దరూ కలిసి పెళ్లి చేసుకుని పిల్లలను పుట్టిస్తారు, ఆ పిల్లలను వీరు పెంచుతారు. వీరు ఏమి అనుకుంటారు అంటే పెళ్ళి అయితే బాధ్యతలు తీరిపోతాయి అనుకుంటారు. నేను వాళ్ళను అడిగాను కూడా. నీ పిల్లలను నీవు పెంచావు బాగుంది. వాళ్ళ పిల్లలను ఎవరు పెంచుకోవాలి? అది ఎవరి బాధ్యత అంటే, ఏమోనండి నా మీద పడిపోయింది అంటారు. పెద్ద మాస్టరే, అన్నీ తెలిసి ఉన్నదే. మళ్ళీ అడిగితే అన్నీ చెప్తారు. నువ్వు ఎవరు అంటే? ఆత్మ అంటారు. తెలిసింది, కానీ అర్థం కాలేదు.

అందుకే వాళ్ళకి నిర్మోహమాటంగా చెప్పాలి. నా బాధ్యత తీరి పోయింది. అది నీ బాధ్యత, నువ్వు చూసుకోవాల్సిందే, ఏం చేసుకుంటావో చేసుకో! ఇప్పటికైనా నా పని నన్ను చేసుకోనివ్వు, ఇప్పటిదాకా నా జీవితాన్ని నీకోసం వెచ్చించాను అని పిల్లలతో అనలేరు. కారణం మమకారం, ఎంత దురదృష్టమండి.

అలాగే భర్త మీద మమకారం. మాంసం వండడం, మాంసం పెట్టడం ఇవన్నీ చేస్తారు, పాపాలు చేస్తారు. ఇంకా కొంతమందికి ధనం మీద మమకారం. ఎంత సంపాదించినా తృప్తి ఉండదు, ఎవరికి దానం చెయ్యలేరు, పంచలేరు, ఆత్మ సేవలు చెయ్యలేరు, ఎంతో నష్టపోతారు. ఆ ధనసంపాదన కోసం చెయ్యకూడని పాపాలు కూడా చేస్తారు, కష్టాలు తెచ్చుకుంటారు.

అందుకే అపార జ్ఞాన సంపన్నులు అయినటువంటి యోగీశ్వరులు అయినటువంటి ఆది శంకరాచార్యుల వారు భజగోవిందంలో ఏమన్నారంటే,

శ్లోకం:–　　**“కస్త్వం కోహం కుత ఆయాతః**
**కామే జననీ కోమే తాతః!**
**ఇతి పరిభావయ సర్వ మసారం**
**విశ్వం త్యక్త్వా స్వప్న విచారమ్”**

తాత్పర్యం:– నీవు ఎవరు? నేనెవడను? నేనెక్కడ నుంచి వచ్చాను? నా యొక్క తల్లి ఎవరు? నా తండ్రి ఎవరు? సారహీనమైన, స్వప్నతుల్యమైన ఈ విశ్వాన్ని ఈ విధమైన విచారణ ద్వారా విడిచి పెట్టాలి”. అన్నారు.

జీవితంలో ప్రతి ఒక్కరూ కూడా ఈ విచారణ చెయ్యాలి. ఏ విచారణ అంటే? నీవు ఎవరు? నీ భార్య ఎవరు? నీ భర్త ఎవరు? నీ పిల్లలు ఎవరు? నేనెవరిని? ముందు ఈ ప్రశ్నలు వేసుకొని సమాధానాలు సంపాదించుకోవాలి. నేను స్త్రీని, పురుషుడిని, నా భర్త, నా భార్య, నా పిల్లలు అనుకొంటారు. నువ్వు ఎవరో నీకు అర్థం అయితే నీ భార్య ఎవరో అర్థం అవుతుంది. నీ భర్త ఎవరో అర్థం అవుతుంది. నీ పిల్లలు ఎవరో అర్థం అవుతుంది. ఈ విచారణ చేస్తే ఖచ్చితంగా నీకు అర్థం అవుతుంది.

20 సంవత్సరాల క్రితం పత్రి గారి వల్ల నాకు అర్థమైంది. అంతకుముందు అందరిలాగే నేను అనుకున్నాను. నేను పురుషుడిని, నేను రాఘవరావుని అని చెప్పి అనుకున్నాను. తర్వాత పత్రిగారు పరిచయం అయ్యాక శంకరాచార్యులు గారు అన్నట్లు విచారణ చేశాను. అప్పుడు అర్థమైంది నాకు నేను దేహం కాదు నేను ఆత్మను అని.

కొంతమందికి అనిపిస్తుంది ఎందుకొచ్చిందీ తలకాయ నొప్పి? ఎవరికి కావాలి ఈ గోల?ఈ పాట్లు అన్నీ ఎవరు పడతారు?ఇవి అన్ని ఎవరు ఆలోచించగలరు? ఎవరికి తెలుస్తాయి? హాయిగా ఉండక, అనే భావంలో ఉండే వాళ్ళు ఈ తలకాయ నొప్పి అంతా పడరు. ఈ తలకాయ నొప్పి పడని వారు 300 జన్మలు 350 జన్మలు అలాగే గడిచిపోతాయి. అది దాటితేనే ఈ ఆలోచన వస్తుంది శంకరాచార్యుల వారు చెప్పినట్లు విచారణ చెయ్యాలని.

ఆలోచిస్తే మీకు అర్థం అవుతుంది. నేను పై లోకాలనుంచి, సూక్ష్మ

లోకాల నుంచి వచ్చిన వాడిని, ఆ పైలోకాల నుంచి వచ్చి తల్లి గర్భంలో తయారు అయ్యే శరీరంలో ప్రవేశించాను అని అర్థమవుతుంది.

మరి అలాంటప్పుడు ఆత్మ అయిన నా యొక్క తల్లి ఎవరు? నా తండ్రి ఎవరు? అంటే నా తల్లి, నా తండ్రి ఒక్కరే ఆయనే పూర్ణాత్మ లేదా ఆయనే పరమాత్మ, పరబ్రహ్మ. ఆయన నుంచి వచ్చిన వాడినే నేను అని అర్థమవుతుంది. అందుకే జీసస్ క్రైస్ట్ ఏమంటారు అంటే? ఆ పరబ్రహ్మను, ఆ భగవంతున్ని, తండ్రి అని పిలుస్తారు.

ఆ పరబ్రహ్మ అందరికీ తండ్రే. తల్లైనా, తండ్రైనా ఆయనే. నీవు అనుకునే తల్లి,తండ్రి ఈ శరీరాన్ని తయారు చేసిన వాళ్ళు. వారిద్దరి కలయిక వల్ల తయారైనదే నీ శరీరం. శరీరాన్ని తయారు చేశారు కానీ, ఆత్మ అయిన నిన్ను వారేమీ తయారు చేయలేదు. వారు శరీరానికి తల్లిదండ్రులు,నీ అసలు తల్లి, అసలు తండ్రి ఎవరు అంటే ఆ పరబ్రహ్మే. ఇది ఎంతో జ్ఞానం పెరిగితే తప్ప అర్థం కాదు. ఇది అర్థం అయింది అంటే నీ జీవితం ధన్యమే.

శరీరం నువ్వు కానప్పుడు ఈ శరీరానికి తల్లిదండ్రులు నీకు తల్లిదండ్రులు ఎలా అవుతారు? ఆలోచించండి. శరీరం నువ్వు అయితే, వారిద్దరూ నీకు తల్లిదండ్రులు. శరీరమే నువ్వు కానిది వారిద్దరూ తల్లిదండ్రులు ఎలా అవుతారు? నీవు ముందు విచారణ చేసి ఇది నిర్ధారణ చేసుకో. నువ్వు ఆత్మవు. నేను అందుకే చెప్తూ ఉంటాను, అందుకే చిన్న పోస్టర్ తయారు చేయించాను "నేను దేహం కాదు, నేను ఆత్మను" అని

ఇంకా ఏమన్నారు అంటే ఈ శ్లోకంలో సారహీనమైన,స్వప్నతుల్యమైన ఈ విశ్వాన్ని, ఈ ప్రపంచాన్ని ఈ విధమైన విచారణ ద్వారా విడిచి పెట్టాలి అన్నారు. నీవు ఏదైతే గొప్పది అని ఊహించుకుంటున్నావో అది ఒక స్వప్నం లాంటిది. నిజమే అని అనిపిస్తుంది కానీ మేలుకోగానే తెలుస్తుంది, ఓ ఇది కలా, స్వప్నమా, నిజం కాదా? అన్న విషయం అప్పుడు తెలుస్తుంది.

అలాగే ఇప్పుడు జరుగుతున్నది అంతా నిజం అనుకుంటారు. నాకు భర్త ఉన్నాడు, నాకు పిల్లలు ఉన్నారు, నాకు ఇల్లు ఉంది, నాకు ఇన్ని సంపదలు

ఉన్నాయి, ఈ అపార్ట్మెంట్ నాది అని అనుకుంటారు. నిజమే, కనబడడం లేదా అంటారు. కానీ మరణించగానే అర్థమవుతుంది ఒక్కటీ ఉండదు. నేను నిజం అనుకున్నానే, ఇవి ఏవి రావా? దేహమే నేను కాదా? ఇవి అన్ని అర్థం అవుతాయి, చనిపోయిన వెంటనే తెలుస్తుంది. నిద్రలోంచి మేల్కోగానే కల అంతా ఉత్తిదే అని ఎలా తెలుస్తుందో! చనిపోయాక ఇది అంతా ఉత్తిది అని తెలుస్తుంది. అదే చెప్పారు శంకరాచార్యుల వారు ఇందులో ఏమీ లేదు నాయనా, సారహీనమైనది, ఇది అంతా స్వప్నం లాంటిది అని.

అందుచేత ఈ విశ్వాన్ని దీని మీద ఉండే మమకారాన్ని, ఇవి అన్నిటినీ కూడా చూసి మావి అని అనుకుంటున్నావో, ఇలాంటి విచారణ ద్వారా తెలుసుకోవాలి. ఎవరైతే ఇలాంటి విచారణ చేస్తారో, ఒక రమణ మహర్షి చెప్పినట్లు, శంకరాచార్యుల వారు చెప్పినట్లు చేస్తారో, గొప్ప జ్ఞాన సంపన్నులు అవుతారు, లోకంలోనే గొప్పవారు అవుతారు, ఎంతోమందికి ఆదర్శ ప్రాయులు అవుతారు.

రమణ మహర్షి గారు ఉన్నప్పుడు ఆయన ఆశ్రమానికి వచ్చేవారు చాలా తక్కువ మంది ఉండేవారు. ఇవాళ గిరి ప్రదక్షణ అని ఆ రమణ మహర్షి ఆశ్రమానికి ప్రతి పౌర్ణమికి లక్షల కొద్ది గిరి ప్రదక్షిణలు చేస్తున్నారు. రమణ మహర్షి చేశారు అని చెప్పి వీరు చేస్తున్నారు. అక్కడకు వెళ్ళాలి అని తహతహలాడుతున్నారు ఎంతోమంది. మరి శంకరాచార్యుల వారు ఏర్పాటు చేసిన పీఠాలకు ఎన్ని లక్షల మంది వెళ్తున్నారు. ఎంత సీఎం అయినా, ఎంత పీఎం అయినా, ఎంత ప్రైమ్ మినిస్టర్ అయినా సరే, అమెరికా ప్రెసిడెంట్ అయినా సరే, ఇలా చనిపోగానే, ఇలా పదవి పోగానే వారిని తలుచుకునే వారు ఎవ్వరు ఉండరు. కానీ సత్యాన్ని తెలుసుకున్న వారు, జ్ఞానాన్ని పొందిన వాడు, సత్యాన్ని బోధించేవాడు తరతరాలు కాదు. యుగాలు మారినా లోకం గుర్తించుకుంటూనే ఉంటుంది. వాళ్లను ఆదర్శంగా తీసుకుంటూనే ఉంటుంది.

ఆత్మ అయిన తాను భూమి మీదికి వచ్చింది, ఈ దేహం తీసుకొన్నది, కారణం ఒకటైతే ఈ మమకారం వల్ల చేస్తున్నది ఇంకొకటి. ఓ రకంగా

చెప్పాలంటే మొత్తం మానవుని యొక్క జీవితం60 సంవత్సరాలు ఉండొచ్చు, 70 ఉండొచ్చు, 80 ఉండవచ్చు చేయవలసింది ఒకటి, చేస్తున్నది ఒకటి. చాలా విచిత్రం.

ఈ మమకారం మూడు రకాలు. వాటినే ఈషణ త్రయం అంటారు. ధారేషణ, ధనేషణ, పుత్రేషణ. అంటే భార్య మీద మమకారం, భర్త మీద మమకారం, ధనం మీద మమకారం, పిల్లల మీద మమకారం.

శంకరాచార్యుల వారు ఇంకా ఏమన్నారంటే

**"కాతే కాంతా కస్తే పుత్రః**
**సంసారో యమ తీవ విచిత్రః ?**
**కస్యత్వం కః కుత ఆయాతః**
**తత్వం చింతయ తదిహ భ్రాతః ?"**

ఆయన ఏమని చెప్తున్నారంటే, ఓయి సోదరుడా! ఎవరు నీ భార్య? నీ పుత్రులు ఎవరు? ఈ సంసారం అత్యంత విచిత్రమైనది. ఇంతకీ నీవు ఎవరికి చెందిన వాడివి? నువ్వు ఎక్కడి నుండి వచ్చావు?

ఈ తత్వ విచారణ చేస్తే ఈ భ్రాంతి మోహాలన్నీ పటాపంచలవుతాయి. నా భార్య,నా భర్త, నా కొడుకు, నా కూతురు అని అంటూ వాళ్ళ కోసమే జీవితమంతా వెచ్చిస్తారు, కష్టపడుతూ ఉంటారు, తప్పులు చేస్తారు, పాపాలు చేస్తారు, చెయ్యకూడని పనులు చేస్తారు, చెయ్యవలసినవి అన్నీ మానేస్తారు, అలాంటి ఈ సంసారం అత్యంత విచిత్రమైనది నాయనా, అని అంటున్నారు శంకరాచార్యులవారు.

అసలు ఇంతకీ నువ్వు ఎవరికి చెందిన వాడివి? నువ్వు ఎక్కడి నుంచి ఇక్కడికి వచ్చావు? ఇవన్నీ ఆలోచించమని అంటున్నారు ఆయన. ఇవన్నీ ఎప్పుడు అర్థమవుతాయి అంటే రమణ మహర్షి చెప్పినట్లు, పత్రి గారు చెప్పినట్లు నేను ఎవరు? అన్నది తెలుసుకుంటే నేను ఆత్మను అని తెలుస్తుంది. ఇతరులు కూడా ఆత్మలు అనే సంగతి తెలుస్తుంది.

ఎక్కడినుండి వచ్చారు అంటే ఆ పూర్ణాత్మ నుంచి కానీ మూలాత్మ

నుంచి కానీ వచ్చారు అన్నది అర్థమవుతుంది.

అంటే ఆత్మ అయిన నువ్వు ఈ దేహాన్ని తీసుకోవడానికి కారణం నువ్వు ఎవరో తెలుసుకోవడానికి, ఈ మాయా ప్రపంచం లో ప్రవేశపట్టపడ్డావు. నీ తండ్రి, ఆ మూలాత్మ, నీకు ఈ పరీక్ష పెట్టాడు. అది తెలుసుకుంటే నీ పరీక్ష అయిపోతుంది. ఇక నువ్వు భూమి మీదకి రానక్కర్లేదు. నీకు దేహం అవసరం లేదు. కానీ జన్మ ఉంటే మటుకు దుఃఖం ఉంటుంది. నువ్వు ఈ జ్ఞానం గాని బుద్ధి గాని సంపాదించుకోకపోతే ఈ దుఃఖం జన్మ జన్మలకి బాగా పెరిగిపోతూ ఉంటుంది.

ఎలాంటి పరిస్థితి వస్తుంది అంటే ఇక నేను జీవించలేను నావల్ల కాదు, నేను చనిపోతాను అని ఆత్మహత్యలు కూడా చేసుకోవాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల నుంచి బయటపడాలి అంటే, శంకరాచార్యుల వారు చెప్పినట్లు తత్వ విచారణ చేయాలి. తత్వ విచారణ అంటే ఆత్మ విచారణ చేసి నిన్ను నువ్వు తెలుసుకోవాలి, నేను ఆత్మను అన్న సంగతి తెలుసుకోవాలి.

అందరూ ఆత్మలే నీ పిల్లలూ ఆత్మలే, వాళ్ళు వేరే లోకాల నుంచి వచ్చారు. నువ్వు ఎలా సృష్టింపబడ్డావో, వాళ్లు అలానే సృష్టింపబడ్డారు. నిన్ను నువ్వు తెలుసుకోవడానికి నువ్వు ఎలా భూమ్మీదికి వచ్చావో, వాళ్ళూ అలాగే వచ్చారు. కొంచెం ముందు వెనక ఉంటాయి.నువ్వు రావడానికి 350 జన్మలు పట్టింది. నీ భర్త రావడానికి 300 జన్మలే పట్టొచ్చు. నీ పిల్లలు రావడానికి ఏ 250 జన్మలో ఉండొచ్చు. కానీ ముందు వెనుకలు ఉంటాయి.

నీ లక్ష్యము ఏమిటో వాళ్ళ లక్ష్యమూ అదే. నువ్వు ఏం చేయాలో వాళ్ళూ అదే చేయాలి. అంతే తప్ప అంతకన్నా ఇంకేమీ లేదు. కానీ భూమిమీదకి వచ్చిన తర్వాత శరీరం తీసుకున్నాక, మానవుడు మనుగడ సాగించాలి అంటే, ఒక్కడివల్ల సాధ్యం కాదు.రకరకాల అనుభవాలు పొందాలీ అంటే, ఒక్కడి వల్ల సాధ్యం కాదు. అందుచేత ప్రతి ఒక్కరికి తోడు ఉండాలి. భార్యకి భర్త, భర్తకి భార్య. సృష్టిలో ఇంకొక ప్రయోజనం ఉంది.

ఈ తోడు ఎందుకంటే, ఒక జన్మలోనే ఎవరూ లక్ష్యాన్ని సాధించలేరు. పత్రిగారు చెప్పారు, నాలుగు ఐదు వందల జన్మలు పడుతుందని. అందుచేత, ఆ జన్మలో కొంత నేర్చుకుంటారు నిష్క్రమిస్తారు.మళ్ళీ వస్తారు కొంత నేర్చుకుంటారు నిష్క్రమిస్తారు. ఇలా జరుగుతూ ఉంటుంది. అలా నాలుగు ఐదు వందల జన్మలు తీసుకోవాల్సి వస్తుంది. ఒకవేళ మీరు బుద్ధి ఉప యోగించకపోతే, నేర్చుకోకపోతే 500 కాదు 1000 జన్మలైనా పట్టొచ్చు.

కానీ జన్మ అంటే నరకమే. చాలామంది అనుకుంటారు డబ్బు ఉన్న వాళ్ళకి ఏమీ లేదని. కానీ డబ్బు ఉన్నా నరకమే డబ్బు లేకపోయినా నరకమే. అధికారం ఉన్నా నరకమే, అధికారం లేకపోయినా నరకమే, అసలు జన్మ అంటేనే అంతేనండి. దీని ముఖ్య కారణం మానవుడు అన్నవాడు ఉదయం లేచినప్పటి నుంచి సాయంత్రం పడుకునే దాకా కర్మలు చేస్తూనే ఉంటాడు. మరి సృష్టిలోని కర్మ సిద్ధాంతం వల్ల దాని ఫలితం అనుభవిస్తూనే ఉంటాడు. అలా పుణ్యకర్మలూ చేస్తారు,పాప కర్మలూ చేస్తారు.

సహజంగా ప్రారంభ జన్మల్లో పాపకర్మలే ఎక్కువ చేస్తారు. దానివల్ల కష్టాలు వస్తాయి, అవి భరించలేరు. ఒక్కొక్క జన్మ గడిచే కొద్దీ ఈ కర్మలు పెరుగుతూ ఉంటాయి. ఏదో మానవుడికి అవకాశం ఇవ్వబడింది. చేసిన కర్మలలో వాడు ఎన్ని అనుభవించగలడో అన్నీ తీసుకొని, మిగిలినవన్నీ సంచితంగా ఉండిపోతాయి. దాన్నే "ఆకాశిక్ రికార్డ్స్ అంటారు. తరువాత జన్మలో ఆ "ఆకాశిక్ రికార్డ్స్" లో నుండి కొద్దిగా తీసుకొని వస్తాడు, మళ్ళీ కర్మలు అనుభవిస్తూ ఉంటాడు. బాధపడుతూ ఉంటాడు.

పుట్టినప్పుడు సంబరపడతాడు, నా నా అంటూ ఎన్నో సమకూర్చు కుంటాడు, డబ్బు సంపాదిస్తాడు, సంపదలు సంపాదిస్తాడు, భార్యా పిల్లల్ని సంపాదించుకుంటాడు, ఇల్లు వాకిళ్లు సంపాదించుకుంటాడు. కారు కొంటాడు, ఎన్నో కొని. అనుభవిస్తూ ఉంటాడు. కానీ సడన్ గా నిష్క్రమిస్తాడు. అప్పుడు చూడండి, నా నా అనుకుంటూ, ఇన్ని సంపాదించుకొని, అన్నీ వదిలి వెళ్ళవలసి వస్తుంది. ఎంత బాధాకరమో? అంతా శాశ్వతం అనుకున్నాడు. అసలు నేను

ఉండను అన్న ఆలోచన కూడా ఉండదు, ఎన్నాళ్ళు ఉంటానో అని ఆలోచన కూడా ఉండదు, నేను పర్మినెంట్ అనే అభిప్రాయం వుంటుంది.

విచిత్రం ఏమిటంటే, ప్రతి ఒక్కర్లో కూడా, ప్రతిరోజు మార్పులు జరుగుతూ ఉంటాయి కానీ పైకి ఏమీ తెలియదు. నిన్న చూస్తే ఎలా ఉంటావో వాళ్ళు అలానే ఉంటారు. కానీ ఒక పది ఏళ్లు పోయిన తర్వాత చూస్తే అప్పుడు తేడా తెలుస్తుంది. ఏంటి అంత మారిపోయావు అంటారు, ఇంకా కొంతమంది గుర్తుపట్టలేనంతగా మారిపోతారు.

ప్రతి ఒక్కరిలోనూ మార్పు వస్తుంది. బాల్యంలో నుంచి యవ్వనంలోకి వస్తారు, యవ్వనంలో నుంచి మెల్లి మెల్లిగా కౌమారంలోకి వస్తారు, కౌమారంలో నుంచి వార్ధక్యం లోకి వస్తారు. మీరు గమనించండి మొట్టమొదట నల్ల జుట్టు ఉన్నప్పుడు వాడికి సడన్గా ఒక తెల్ల వెంట్రుక కనిపిస్తుంది. ఆశ్చర్యపోతాడు. ఏంటి నాకు తెల్ల వెంట్రుక వచ్చింది? అని. అప్పుడు రంగు వేయడం మొదలు పెడతాడు. ఈ పనులన్నీ చేస్తాడు గాని, నాలో మార్పులు వస్తున్నాయి. నేను ఎప్పటిలాగా లేను, అనే భావం వుండి నేను ఎప్పటిలాగా యవ్వనంలో లేను. దాంతోపాటు ఎన్నో మార్పులు ఉంటాయి. శరీరంలో శక్తి సన్నగిల్లుతూ ఉంటుంది, పళ్ళు ఊడిపోతూ ఉంటాయి. శరీరంలో మార్పులు వస్తూ ఉంటాయి, ఇవన్నీ గమనించడు. కానీ ఆలోచిస్తే అర్థమవుతుంది. ఈ మార్పులు ఎందుకు వస్తున్నాయి, ఎలా వస్తున్నాయి, చూస్తే విచిత్రంగా వుంటుంది.

గడియారం చూస్తే ముందు మెల్లిగా ముల్లు పైకి వెళ్తాది. పైకి వెళ్ళిన ముల్లు, మళ్ళీ మెల్లిమెల్లిగా క్రిందకి వస్తుంది. అలాగే మానవుడు పుట్టినప్పుడు 25, 30 సంవత్సరాలు, వాడు ఎదుగుతుంటాడు. శక్తి పెరుగుతూ ఉంటుంది. అన్నీ పెరుగుతూ ఉంటాయి. 30 వచ్చిన తర్వాత అక్కడ నుంచి వాడి యొక్క శక్తి తగ్గడం మొదలవుతుంది. ఇవి ఏమి కనిపించవు. తెలియవు.

50, 60 వచ్చేసరికి ఇంక వాడు ఇదివరకు చేసే పనులు చేయలేకపోతుంటాడు, నడవలేక పోతుంటాడు, ఆ రకంగా పనిచేయలేక పోతుంటాడు. అందుకే మీరు చూడండి చాలామంది వాలంటరీ రిటైర్మెంట్

తీసుకుంటారు.  ఎన్నో రకాల అనారోగ్యాలు, జబ్బులు వస్తాయి. ఎందుకు హాయిగా కూర్చోవచ్చు కదా అని అనుకుంటారు. ఇంతకుముందు ఇంకా పని చేయాలి ఇంకా సంపాదించాలి అనుకుంటారు. ఆ ఉద్యోగం చేస్తూ, ఇంకా ఏదో ఒకటి చేస్తూ ఉంటారు. ఇప్పుడు ఆ ఉద్యోగమే చేయలేని పరిస్థితి లోకి వచ్చేశారు. అంటే దాని అర్థం ఏమిటి? ముసలోడిని అయిపోయినాను అని అనుకుంటారు.

కాదు కాదు అర్థం చేసుకోండి,ఆత్మ అయిన నువ్వు, నిన్ను నువ్వు తెలుసుకోవడానికి ఈ శరీరాన్ని ఉపయోగించుకోవాలి, అది ఆత్మయైన నీకు ఇవ్వబడిన అవకాశం. నువ్వేమో ఆ పని చేయక,  నా భార్య అంటూ, నా భర్త అంటూ, నా పిల్లలు అంటూ, నా డబ్బు అంటూ, వీటి కోసం వినియోగిస్తున్నావు. నువ్వు నీ శక్తి యుక్తులన్నీ కూడా, నీ సమయం నీ శక్తి అన్ని  కూడా ఉపయోగిస్తున్నావు. కానీ నువ్వు దేనికి వచ్చినావో ఆ పని చేయట్లేదు. ఆ సమయం అయిపోతుంది అనే సంగతి  కూడా నీకు అర్థం కావట్లేదు. నీకు ఇవ్వబడిన ఆ సమయం తగ్గిపోతుంది.నువ్వు పూర్తిగా ఈ జన్మలో మహా అయితే ఓ 40 సంవత్సరాలు 50 సంవత్సరాలు పని చేయగలవు. పూర్తిస్థాయిలో నీకు ఇవ్వబడిన ఇంద్రియాలు అన్నిటిని ఉపయోగించి పనిచేసుకోగలవు.

నీకు నీలో వచ్చే మార్పు చూసుకుంటే ఇది అర్థం అవుతుంది. ఎంతసేపు నా నా అంటూ ఉంటావు,  మా మా  అంటూ ఉంటావు, నాది అంటావు, మాది అంటావు దాంతోటే  సరిపోతుంది. కానీ ఇక్కడ నాది లేదు, మాది లేదు, అసలు నువ్వుంటే, నీది ఉంటుంది. కొన్నాళ్లకు నువ్వు ఎక్కడున్నావో తెలియదు, అదృశ్యం అయిపోతావు. ఎంతో మమకారంతో పోషించిన ఈ శరీరం, బూడిద అయిపోతుంది. కానీ అదే నేను అనుకున్నావు. సమయం అయిపోగానే, శరీరంలో నుంచి బయటికి రాగానే, నీకు అర్థం అవుతుంది. అరే! ఇంతా చేసి ఆ మంచం మీద ఉన్నది నేను కాదా? నేను ఆత్మనా? అదే నేను అనుకున్నానే. అరెరే,అలా వాళ్లకి నాకు సంబంధం లేదా?  ఇంకా వాళ్ళు నా వాళ్ళు అనుకున్నాను. కానీ కాసేపటికి అర్థం అవుతుంది. ఎవరితోటి

నాకు సంబంధం లేదు అని. అది నేను తీసుకున్న శరీరము. నేను నా లక్ష్యాన్ని సాధించడం కోసం తీసుకున్న శరీరము అని తెలుస్తుంది. ఆ శరీరంతో నేను జ్ఞానాన్ని సంపాదించుకోవాలి, నా గురించి నేను తెలుసుకోవాలి, దానికోసం ఇవ్వబడినటువంటి శరీరం తప్ప అది నేను కాదు అన్నది  అర్థమవుతుంది.

ఆ శరీరంతో ఇవి అన్నీ తెలుసుకోవలసిన వాడివి, మమకారంతో ఆ పని మానేసి అన్ని పనులు చేస్తావు. ఈ సంసారం మీద మమకారంతో నీ గురించి విస్మరిస్తావు, అశ్రద్ధ చేస్తావు . పై కెళ్లాక ఇంక ఏమి జరుగుతుంది? అరే ఎంత జీవితం వృధా చేశాను నేను? అని అక్కడ బాధ పడతావు. అందుకే పత్రి గారు అంటారు. “మరణించక ముందే మరణించాలి”, అంటే మరణించిన తర్వాత ఏం జరుగుతుందో ముందే తెలుసుకోవాలి. ఎప్పుడైతే ఈ విషయం తెలుసుకుంటారో, నేను ఆత్మ అని తెలుస్తుంది, ఈ శరీరంతో నాకు సంబంధం లేదు అని తెలుస్తుంది, నా వాళ్ళు అనుకున్న వాళ్ళు ఎవరూ నా వాళ్ళు కాదు అనే సంగతి తెలుస్తుంది. నావి అనుకున్న ఈ ఆస్తులు, అంతస్తులు,  డబ్బు, ఈ పదవులు ఏవీ నాకు సంబంధం లేదు. ఇంకా గట్టిగా మాట్లాడితే కల ఎలా అదృశ్యం అయిపోతుందో  అలా అదృశ్యం అయిపోతాయి అన్నీ.

ఇది కనక నువ్వు ముందే తెలుసుకుంటే, అవసరాలకు పరిమితం అవుతావు.ఎందుకంటే నీ జీవితాన్నే నువ్వు తీసుకొని ఈ విచారణ చేస్తూ ఉంటే, నీకే ఆశ్చర్యం వేస్తుంది.

నేను పత్రి గారి మార్గంలోకి వచ్చి 20 సంవత్సరాలు దాటింది. 20 సంవత్సరాలు అంటే సామాన్యమైన విషయం కాదు. నా మనవడిని నా కోడలు చంకలో వేసుకొని ఉండేది. వాడు ఇప్పుడు పెళ్లి చేసుకుని, ఆడపిల్లని కన్నాడు. ఈ 20 సంవత్సరాలు ఎలా గడిచాయో మాకు ఏమి అర్థం కావట్లేదు. 20 సంవత్సరాలు అయిపోయాయా అని అనిపిస్తుంది మాకు. ఒక జనరేషన్ మారిపోయింది.

మనవడికి  పిల్లలు పుట్టారు ఇప్పుడు. కానీ మేము పూర్తిగా సమాజానికి దూరం అయిపోయాం.  మేమిద్దరం కూడా. ఇదివరకు ఈ

భీమవరం టౌన్ లో మాకు తెలియని వాళ్ళు అంటూ ఎవరూ ఉండేవారు కాదు, అంత కీ రోలు పోషించాం. మా కుటుంబమే అలాంటి కుటుంబం. నాన్నగారు మునిసిపల్ చైర్మన్ చేశారు. నేను బాగా యాక్టివ్ గా ఉండేవాడిని. తర్వాత నేను చాంబర్ ప్రెసిడెంట్ గా చేశాను, రైస్ మిల్లర్స్ సెక్రటరీగా చేశాను. చాలా యాక్టివ్ పార్ట్ ఉండేది.

అనేక సంస్థల్లో ఇంచుమించు అందరూ తెలుసు. నాకు తెలియని వాళ్ళు ఎవరూ ఉండేవారు కాదు. ఇప్పుడు నేను జీవించి ఉండగానే చూస్తే చాలామందికి నేను తెలియదు. ఇప్పుడు నా పేరు చెప్తే నా వయసు స్థాయిలో చాలామంది చనిపోయారు. మా కుటుంబంలోనే నేను చాలామందికి తెలియదు. ఏదో ఫంక్షన్ కి మొన్న వెళ్ళాను. మా వాళ్లు పరిచయం చేస్తున్నారు నన్ను మా వాళ్లకి. నాకు ఆశ్చర్యం వేసింది, మీ తాత రా, అంటూ ఇలా పరిచయం చేస్తున్నారు. ఓహో ఎలాంటి పరిస్థితి వచ్చింది అని అనుకున్నాను. నేను ఉండగానే నన్ను మరిచిపోయే పరిస్థితి వచ్చింది. నేను ఎవరో తెలియని పరిస్థితి వచ్చింది. మరి చనిపోతే, ఇంకేం తెలుస్తుంది  చెప్పండి.

బాగా దగ్గరోళ్ళు కూడా మా గురించి ఆలోచించట్లేదు. ఇక చనిపోతే ఎక్కడుంటుంది ఆలోచించండి. ఇది కళ్ళతో చూస్తున్నాం. పత్రి గారు చెప్పిన తర్వాత నాకు అర్థం అవుతుంది. ఓహో మరణించక ముందే మరణించడం అంటే ఇలా ఉంటుందన్నమాట అని. మరణిస్తే అందరూ ఎలా మర్చిపోతారో ఈ మరణించక ముందే  మర్చిపోయారు, చాలా విచిత్రంగా ఉంది. స్నేహితులు లేరు, పరిచయస్థులు లేరు, బంధువులు లేరు, ఏమీ లేదు. మా ప్రపంచమే వేరు. ఈ 20 ఏళ్ల నుంచి ఆత్మ నేను అనుకుంటూ నేను పని చేశాను.

ఆధ్యాత్మికంలో జరిగే మార్పులు ఇవి అన్నీ అర్థమవుతున్నాయి కానీ ప్రాపంచికంగా జరిగే మార్పులు టెక్నాలజీ డెవలప్మెంట్ లు ఇవి అన్ని నాకు అర్థం కానంతగా మారిపోయాయి. పిల్లలు చెప్తుంటే నాకే ఆశ్చర్యం వేస్తుంది. వీళ్లకు తెలిసున్నా కూడా నాకు  తెలియవే అని. అంత మారిపోయింది

ప్రపంచం. ఏకంగా చనిపోయిన తర్వాత  పై లోకాల్లోనే చూడాలి ఇవి. అన్ని మార్పులు జీవించి ఉండగానే చూస్తున్నాము. అందుకే మీరు చూడండి కావాలంటే, మీరు బాగా ముసలోళ్ళు అయ్యి, మీ అవసరం లేనప్పుడు మిమ్మల్ని ఎవరూ పట్టించుకోరు, మీకు ఇంపార్టెన్స్ ఇవ్వరు, మీతో చెప్పరు. వాళ్ళ పనులు వాళ్ళు చేసుకుంటారు. మీరు సంబంధం లేనట్లుగానే ఉండిపోతారు. అటువంటి వాళ్ళ కోసం మీరు మీ జీవితం అంతా నాశనం చేసుకుంటున్నారు. అందుకే మమకారం వదలాలి అని చెపుతున్నాను.

మమకారం వల్ల మీకు కష్టాలు రాకపోవచ్చు. కానీ అపారమైన నష్టం కలుగుతుంది. ముందు మీరు అంతా ఆత్మలు. ఆత్మలైన మీరు ఆత్మ లాభానికి కృషి చేయాల్సింది మానేసి మమకారం వల్ల ఆత్మను నిర్లక్ష్యం చేస్తారు, ఆత్మను పట్టించుకోరు. ఎంతసేపూ ఈ శరీరానికి ఈ ప్రపంచానికి వీటికే ప్రాముఖ్యం ఇస్తూ ఉంటారు. మరి ఈ సంసార సముద్రాన్ని ఎలా దాటుతారు. ఇది చాలా బాధాకరమైనది.దుఃఖకరమైనది, ఇందులోనే పడి కొట్టుకుంటే బయటపడేది ఎప్పుడు?

అందుకే  మమకారం గురించి ఆది శంకరాచార్యుల వారు, ఇలాంటి వాళ్లు చెప్పిన సందేశాల ద్వారా మనకు తెలుస్తుంది. లేకపోతే ఇప్పుడు మమకారంతో ఉన్నామన్న  సంగతి కూడా మనకి తెలియదు. ఆయన ఏమన్నారంటే

**శ్లో॥  కాతేకాంతా ధన గత చింతా**
**వాతుల కిం  తవ నాస్తి నియంతా?**
**త్రిజగతి సజ్జన సంగతి రేకా**
**భవతి భవార్ణవతరణే నౌకా?"**

తాత్పర్యం :  "ఓ వెర్రివాడా! నీ భార్యను( భర్త) గూర్చి, ధనాన్ని గూర్చి ఎందుకు అంత చింతిస్తావు. ధర్మ పరిపాలన చేసే నియంత లేదనుకున్నావా?

నియంత అంటే  పరబ్రహ్మ, భగవంతుడు  ఈ సృష్టిని నడిపించేవాడు, సృష్టికి మూలమైన వాడు, సృష్టికి కారకుడు.


త్రికాలాలలోనూ భవసాగరాన్ని ( సంసార సాగరాన్ని ) దాటింపగల నౌక సజ్జన సాంగత్యము మాత్రమేనని తెలుసుకో. అంటే సత్యం గురించి చెప్పగలిగిన వారి సాంగత్యం. సత్యము అంటే ఆత్మ, ఆత్మ గురించి,ఆత్మ జ్ఞానం గురించి, ఆత్మ ఉన్నతి గురించి, ఆత్మ లాభం గురించి చెప్పగలిగిన వారి సాంగత్యం, మించింది ఇంకేమీ లేదు. ఆత్మవైన నువ్వు ఈ భవ సాగరాన్ని దాటాలి అంటే ఇంతకన్నా నీకు దారి లేదు అని శంకరాచార్యులు చెప్పారు.

శంకరాచార్యుల వారు చెప్పింది పత్రి గారు పదే పదే చెప్పారు. అదే ఇప్పుడు మనం అందరం చేసే పని ఏమిటంటే ప్రతిరోజు అందరం సజ్జన సాంగత్యం చేస్తున్నాం, ఏదైతే గొప్పదని ఆ గొప్ప వాళ్ళు చెప్పారో ఆ గొప్ప పనే మనమంతా చేస్తున్నాం. ఇటువంటి సజ్జన సాంగత్యంలోకి రావాలంటే 350 జన్మలు దాటి ఉంటేనే తప్ప ఆసక్తి ఉండదండి. అసలు భవసాగరంలో ఉన్నామనే సంగతే చాలామందికి తెలియదు సంసారం చేసుకుంటున్నామని అనుకుంటున్నారే గాని సంసార సాగరంలో పడిపోయాం అనే ఆ ఆలోచనే ఉండదు మీకు. సాగరంలో పడిన వాడు ఎన్ని తిప్పలు పడతాడో చూడండి. ఎంతసేపు ఈదుతుంటాడో అంతసేపు తేలి ఉంటాడు. ఎంత కష్టం చెప్పండి అలా తేలి ఉండడానికి. అదే రకంగా ఉంది మీ పని. కష్టాలు లేకుండా ఉండాలి అని ఎంత ప్రయత్నం చేస్తున్నారు, రోజూ సమస్యే, ఏదో ఒక గొడవే, ఏదో ఒక ఇబ్బందే బ్రతకడానికి.

క్రింద మీద పడి ఏదో సమస్యలో నుంచి బయట పడుతుంటే, మళ్లీ తెలియకుండానే ఏదో సమస్య, పోనీలే మనకంటూ ఏ సమస్య లేకుండా చేసుకుంటే, మనవాళ్ళకి. మరి సంసారం సాగరం కదా మీరు ఉండేది మీ పిల్లలకి లేకపోతే, భర్తకి, భార్యకి, తల్లికి, తండ్రికి బంధువులకి, ఎవరికి ఏమైనా మీకే బాధ. ఏదో ఈది, ఈది, ఈది శరీరాన్ని వదిలేస్తారు. హమ్మయ్య అనుకోవడానికి కూడా లేదు. ఇలా వెళ్తారు. మరలా గోడ కు కొట్టిన బంతిలాగా తిరిగి వస్తారు. హమ్మయ్య అయిపోయింది అనుకోడానికి కూడా లేదు, మళ్లీ తిరిగి వస్తాం. మళ్లీ మామూలే. ఇలాఎన్ని జన్మల నుంచి జరుగుతుంది. వెళ్లడం,

రావడమూ. శ్రీకృష్ణులవారు చెప్పారు కదా భవద్గీతలో, పుట్టిన వాడు గిట్టక మానడు, గిట్టిన వాడు పుట్టక మానడు అని. పుట్టడం–చావడం, పుట్టడం–చావడం. ఎంతసేపూ ఈ చావు పుట్టుకల్లోనే ఉంటున్నారు. అందుచేత చావు పుట్టుకలు లేని స్థితి సంపాదించుకోవాలి, వాడే భవసాగరాన్ని దాటినట్టు.

అందుకే శంకరాచార్యులవారు సంసార సాగరం అన్నారు. అంతు పంతు ఉండదు. అలా ఈదుతూనే వున్నాం. తీరం దొరకదే. సరే చచ్చిపోయాం, అదే తీరం అనుకుంటాం. కానీ అదేం తీరం కాదు! ఒకసారి మునుగుతాం, మునిగి మళ్లీ లేస్తాం. మునిగినోడు అలాగే మునిగి వుంటాడా? చచ్చినోడు అలాగే ఉండిపోతాడా? మునిగినోడు మళ్ళీ పైకి లేస్తాడు. చచ్చినోడు మళ్ళీ పుడతాడు. ఇలాంటి సంసార సాగరాన్ని దాటించగలిగింది సజ్జన సాంగత్యమే. ఇక అంతకన్నా వేరే దారి లేదు అని చెప్తున్నారు శంకరాచార్యులు వారు.



## ధ్యానం చేసే పద్ధతి
## శ్వాస మీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతోన్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమక్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీమండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండలశుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) మరణించకముందే మరణించాలి - రూ.130/-
10) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
12) గీతాసందేశం - రూ.120/-
13) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/-
23) కర్మ సిద్ధాంతం - రూ.80/-
24) ధ్యానమంటే ? - రూ.80/-
25) త్రివిధాలు - రూ.80/-
26) ఉత్తమ పురుషుడు - రూ.80/-
27) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
28) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
29) జ్ఞాన జ్యోతి - రూ.70/-
30) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
31) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
32) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
34) బుద్ధుని సందేశాలు - రూ.70/-
35) భూతదయే దైవత్వం - రూ.70/-
36) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
38) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
39) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
40) మానవునిలోని చెడు -రూ.70/-
41) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
42) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
43) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
44) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
45) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
46) అతీంద్రియ శక్తులు - రూ.60/-
47) ఆలోచించండి - రూ.60/-
48) నిర్వాణ మార్గం - రూ.60/-
49) ధ్యానులకు సూచనలు - రూ.60/-
50) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
51) మాస్టర్‌గా ఎదగాలంటే? -రూ.50/-
52) భగవంతుని ఇష్టులవ్వాలంటే-రూ.50/-
53) సంకల్పమంటే? - రూ.50/-
54) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
55) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
56) మూడురకాల భవిష్యత్తులు -రూ.50/-
57) అరిహంత్ - రూ.50/-
58) మూడురకాల జీవితాలు -రూ.40/-
59) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
60) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
61) బ్రహ్మం అంటే? -రూ.40/-
62) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/-
63) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
64) మహాత్ముల సందేశాలు - రూ.40/-
65) సత్యం - రూ.40/-
66) చక్రాలు - రూ.40/-
67) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
68) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
69) మౌన ధ్యానం - రూ.40/-
70) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
71) శాకాహారమే మానవాహారం - రూ.15/-
72) అహింస మరియు శాఖాహారం- రూ.15/-



# మానవునిలో చెడు లక్షణాలు

ఎప్పుడూ విచారంలో ఉండడం, భయం, నేనేమీ చేయలేను, నేనేమీ సాధించలేను అని అనుకోవడం, అలా ప్రతి విషయంలో వ్యతిరేకంగా భావించడం, నేను అల్పుడను, ఏమీ లేని వాడిని, నేనేమి ఇవ్వగలను, ఇవ్వలేని వాడిని అని భావించడం, ఎదుటి వారిలోని లోపాలను చూడటం, ఎదుటి వారిని చులకనగా చూడటం, ఎదుటి వారిని తక్కువగా భావించడం, దుర్వినియోగం, నిర్వినియోగం, ఓర్పు, సహనం లేకపోవడం, వర్తమానంలో జీవించలేకపోవడం, లోభం, సోమరితనం, బద్ధకం, అతినిద్ర, గర్వం, అహంకారం, వ్యామోహం, మమకారం.

మానవుడు పూర్ణ స్థితికి ఎదగాలంటే తనలో చెడుని పూర్తిగా తొలగించుకోవాలి. ఏదో ఒకటో రెండో తొలగించుకుని నేను చాలా మారిపోయాను అనుకుంటారు. కానీ ఎన్నో మార్చుకోవాలి. కొంచెం శ్రద్ధ ఉంటే తేలికగా అధిగమించగలుగుతారు.

ఈ ధ్యానాన్ని అంటే "శ్వాస మీద ధ్యాస" ధ్యానాన్ని తీవ్రాతి తీవ్రంగా చెయ్యాలి. అలాగే ఆహార నియమాలు కఠినంగా పాటిస్తూ చేస్తారో ఒకటి కాదు రెండు కాదు మానవునిలోని ఎన్ని రకాలు చెడులు వుంటాయో అన్నీ కూడా తొలగిపోతాయి. ధ్యానం యొక్క ముఖ్య ఉద్దేశం రోగాలు తొలగించు కోవడానికి కాదు, కోరికలు తీర్చుకోవడానికీ కాదు, ఏవో అనుభవాలు పొందడానికి కాదు. మొదటగా మీలో ఉన్నటువంటి చెడు తొలగించుకోవడం కోసమే.

**- బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు**

రూ.70/-